


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 318

శనివారం 8-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**సిరీస్ కాపాడుకునేందుకు...**

ఆక్లాండ్‌లో న్యూజిలాండ్‌తో నేడు భారత్ రెండో వన్డే.

– స్పోర్ట్స్‌లో




**వడ్డీరేటు తగ్గించిన ఎస్‌బీఐ**

రుణ రేట్లను తగ్గించిన ఎస్‌బీఐ, కెనరా బ్యాంకులు

-బిజినెస్‌లో

### ఉప్పొంగిన భక్తి భావం ● కన్నుల పండుగగా కొనసాగుతున్న మహా జాతర

# మేడారం.. జనసంద్రం

**వనదేవతలను దర్శించుకున్న గవర్నర్లు తమిళిసై, దత్తాత్రేయ, సీఎం కేసీఆర్**

**అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పణ**

**ఒక్కరోజే 40 లక్షల మంది దర్శనం**

- కోటీ 10 లక్షలు దాటిన మొక్కులు
- నేడు జనం నుంచి వనంలోకి దేవతలు



శుక్రవారం మేడారంలో సమక్క గద్దె వద్ద మొక్కుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు

**మేడారం నుంచి సాక్షి ప్రతినిధి, వరంగల్:** మేడారం జనసంద్రమైంది. తెలంగాణ కుంభ మేళాగా ఖ్యాతిగాంచిన సమక్క–సారలమ్మ జాతర కన్నుల పండుగగా సాగుతోంది. వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతతో ఉప్పొంగుతోంది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై కొలువు దీరడంతో శుక్రవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనాలకు బారులుతీరారు. చీర, సారె, నిలువెత్తు బంగారం (బెల్లం), ఎదుర్కోళ్లు, ఒడి బియ్యం, కొబ్బరి కాయలు... ఇలా తీరొక్క రూపాల్లో వనదేవతలకు మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మల ప్రసాదం (బెల్లం) దక్కించుకునేందుకు పోటీపడ్డారు. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్లు తమిళిసై సౌందరరాజన్, బండారు దత్తాత్రేయ శుక్రవారం ఉదయం అమ్మవార్లను దర్శించుకోగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శుక్రవారం మధ్యాహ్నం వనదేవతలను దర్శించుకున్నారు. వీవీఐపీల పర్యటన సందర్భంగా రెండు విడతల్లో సుమారు 2 గంటలకుపైగా దర్శనాలను నిలిపివేయడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

**వనదేవతలకు చీర, సారె సమర్పించిన సీఎం కేసీఆర్...**

వనదేవతల దర్శనానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి మేడారానికి చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మేడారం పూజారులు, జాతర పునరుద్ధరణ కమిటీ చైర్మన్ ఆలం రామ్మూర్తి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావులు డోలు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మను కేసీఆర్ దర్శించుకొని మిగతా 2వ పేజీలో ▶

**బరువు తగ్గిన కేసీఆర్!**

సమ్మక్క–సారలమ్మల దర్శనం సందర్భంగా సీఎం కేసీఆర్ నిలువెత్తు బంగారాన్ని మొక్కుగా సమర్పించిన సమయంలో ఆయన 51 కిలోల బరువు తూగారు. 2018 ఫిబ్రవరి 2న మేడారం దర్శనానికి వచ్చిన సందర్భంగా నిలువెత్తు బంగారం సమర్పించినప్పుడు ఆయన 52 కిలోల బరువు ఉండేవారు. ఈసారి కేసీఆర్ 51 కిలోల బరువు తూగడంతో రెండేళ్లలో ఆయన ఒక కిలో బరువు తగ్గినట్లయింది. మరోవైపు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 66 కిలోలు, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ 55 కిలోల బంగారాన్ని మొక్కులుగా సమర్పించినట్లు పౌర సమాచార సంబంధాల శాఖ వెల్లడించింది.

# 'నిర్భయ' కేసులో కేంద్రానికి నిరాశ

- దోషులకు నోటీసులివ్వాలన్న పిటిషన్‌కు సుప్రీం తిరస్కరణ
- మళ్లీ డెత్ వారంట్లు ఇవ్వాలన్న ఢిల్లీ ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చిన ఢిల్లీ కోర్టు

5లో

నిర్భయ కేసులో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు తాత్కాలికంగా నిరాశ మిగిలింది. నిర్భయ కేసులో దోషులందరినీ ఒకేసారి ఉరితీయాలనీ, న్యాయపరమైన అవకాశాలన్నింటినీ వినియోగించుకోవడానికి వారికి ఢిల్లీ హైకోర్టు గడువివ్వడాన్ని సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఖైదీల ఉరితీతపై స్టేకు వ్యతిరేకంగా నోటీసులు జారీ చేయడానికి విముఖత వ్యక్తం చేసింది.












# జేబీఎస్–ఎంజీబీఎస్ మెట్రో షురూ

జెండా ఊపి ప్రారంభించిన సీఎం కేసీఆర్

జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రోలో ప్రయాణం

ఈ మార్గంలో 13 నిమిషాల్లో జర్నీ పూర్తి

నేటి నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి..

ఈ మార్గంలో సుమారు 60 వేల నుంచి లక్ష మంది వరకు జర్నీ చేసే అవకాశం

హైదరాబాద్ నలుమూలలా మెట్రో విస్తరణ కోసం మాస్టర్ ప్లాన్ తయారీకి సీఎం ఆదేశం



3లో

శాంపిళ్ల సేకరణలో

## అవగాహనలేమి!

- ఏ మోతాదులో సేకరించాలో తెలియని వైనం
- సరైన పరిమాణంలో తీసుకోని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు
- అయినా పరీక్షలు నిర్వహించిన గాంధీ సిబ్బంది
- చైనీయులకు కరోనా సోకినట్లు తప్పుడు సమాచారం.. రెండోసారి నెగటివ్

- వివరాలు 14లో

ఉలిక్కిపడిన

## 'హుస్నాబాద్'


- అక్కన్నపేటలో ఏకే–47తో కాల్పులు
- గౌరెల్ల కాపరికి ఏకే–47 ఎక్కడిదనే చర్చ
- నిందితుడు మాజీ మావోగా అనుమానం
- నిందితుడి ఇంటి వద్ద బుల్లెట్లు, తల్వార్ స్వాధీనం

- వివరాలు 13లో

# నేడే ఢిల్లీ పోలింగ్

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. శనివారం నాటి పోలింగ్‌కు ఎన్నికల సంఘం(ఈసీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ రణ్‌బీర్ సింగ్ వెల్లడించారు.

- వివరాలు 5లో






epaper.sakshi.com


శుక్రవారం మేడారంలో బంగారం సమర్పించేందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్


శుక్రవారం మేడారంలో సమ్మక్క గద్దె వద్ద తెలంగాణ గవర్నర్ తమిళిసై


నిలువెత్తు బంగారంతో సీఎం కేసీఆర్ తులాభారం. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి, ఎంపీ సంతోష్

# మేడారం.. జనసంద్రం

▶ మొదటి పేజీ తరువాయి

మొక్కులు చెల్లించుకున్నారు. మొదట సమ్మక్క అమ్మవారిని, ఆ తర్వాత సారలమ్మ అమ్మవారితోపాటు పక్కనే కొలువై ఉన్న గోవిందరాజు, పగిడిద్దరాజును దర్శించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం)తోపాటు తెలంగాణ రాష్ట్రం తరపున చీర, సారె సమర్పించారు. హుండీలో కానుకలు వేశారు. దర్శనానంతరం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు సమ్మక్క–సారలమ్మ దేవతల ఫొటోను అందజేశారు. అంతకుముందు రాష్ట్ర గవర్నర్ తమిళిసై, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ కూడా వనదేవతలను దర్శించుకొని అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు కూడా అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### జనసంద్రమైన మేడారం....

మేడారం జాతరకు ఈసారి కోటీ 40 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. అయితే జాతర ముగిసేందుకు శనివారం వరకు సమయం ఉండగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు సుమారు 40 లక్షల మంది మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పటివరకు భక్తుల సంఖ్య కోటీ 10 లక్షలకు చేరినట్లు అధికారులు అంచనా వేశారు. గురువారం ముందు వరకు ముందస్తుగా 70 లక్షల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

### క్యూలలో భక్తుల ఇబ్బందులు...

మేడారంలో శుక్రవారం ఉదయం గవర్నర్ల దర్శనం సమయంలో సుమారు గంటపాటు ఆ తర్వాత సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా మధ్యాహ్నం 12:35 గంటల నుంచి 1:35 గంటల వరకు అధికారులు భక్తుల దర్శనాలను నిలిపివేశారు. దీంతో రద్దీ క్యూలలో పలుమార్లు తోపులాట జరిగింది. తోపులాటలో పలువురు భక్తులు గాయపడ్డారు. వీవీఐపీల దర్శనం ముగిసినప్పటికీ భారీ క్యూల వల్ల సాధారణ భక్తుల దర్శనానికి 4–5 గంటల వరకు సమయం పట్టింది. రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది.

### హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టిన గవర్నర్లు

సమ్మక్క–సారలమ్మను దర్శించుకోవడానికి శుక్రవారం మేడారం వచ్చిన గవర్నర్లు తమిళిసై సౌందరరాజన్, బండారు దత్తాత్రేయ ప్రత్యేక హెలికాప్టర్‌లో జాతర పరిసరాల్లో రెండుసార్లు చక్కర్లు కొట్టారు. ఆయా ప్రాంతాలల్లో భక్తుల రద్దీ, ప్రభుత్వ యంత్రాంగం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

### అమ్మల దర్శనం సంతోషంగా ఉంది: గవర్నర్ తమిళిసై

వనదేవతలను దర్శించుకున్న అనంతరం గవర్నర్ తమిళిసై మీడియాతో మాట్లాడారు. సమ్మక్క–సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మేడారం జాతర ప్రకృతితో మమేకమైందన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సమ్మక్క–సారలమ్మ ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవార్లను మొక్కుకున్నట్లు తమిళిసై తెలిపారు.


బంగారం(బెల్లం) మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ


సారలమ్మ గద్దె వద్ద బంగారం సమర్పిస్తున్న సీఎం కేసీఆర్


పగిడిద్దరాజు గద్దె వద్ద సీఎం కేసీఆర్

### సీఎం కేసీఆర్ పర్యటన సాగింది ఇలా...

- మధ్యాహ్నం 1:06 గంటలకు హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు.
- 1:10 గంటలకు వనదేవతల గద్దెల ప్రాంగణానికి చేరుకున్నారు. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి కండువా కప్పారు.
- 1:14 గంటలకు సంప్రదాయబద్ధంగా ప్రధాన ప్రవేశమార్గం ద్వారా ఆలయ పూజారులు, మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు సీఎంకు ఆహ్వానం పలికారు.
- 1:16 గంటలకు నిలువెత్తు బంగారం తులాభారం సమర్పించారు.
- 1:19 గంటలకు సమ్మక్క గద్దె వద్ద, 1:22 గంటలకు సారలమ్మ గద్దె వద్ద చీర–సారె, కానుకలు సమర్పించారు. అనంతరం గోవిందరాజు, పగిడిద్దరాజును దర్శించుకున్నారు.
- 1:28 గంటలకు గద్దెల ప్రాంగణం నుంచి బయటకు వచ్చారు.
- 1:35 గంటలకు పోలీస్ ఔట్‌పోస్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిది ప్రాంతానికి చేరుకొని భోజనం చేశారు.
- 2:05 గంటలకు తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని హైదరాబాద్ తిరుగు పయనమయ్యారు.


### నేడు వనంలోకి దేవతలు

అశేష భక్తుల నుంచి తీరొక్క మొక్కులు అందుకున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. జాతరలో చివరి అంకమైన ఈ ఘట్టం శనివారం సాయంత్రం జరగనుంది. తొలుత నలుగురు దేవతల పూజారులు గద్దెల వద్ద పూజలు చేసి ఆపై సారలమ్మను కన్నెపల్లికి, పగిడిద్దరాజును కొత్తగూడ మండలం పూనుగొండ్లకు, గోవిందరాజును ఏటూరు నాగారం మండలం కొండాయికి, సమ్మక్కను మేడారం సమీపంలోని చిలకలగుట్టపైకి తీసుకెళ్తారు. ఈ సమయంలో గద్దెల వద్ద ఉన్న భక్తులకే వనప్రవేశాన్ని చూసే వీలు ఉంటుంది. ఆలయం దాటిన తర్వాత బయట వారినెవరినీ వెంట రానివ్వరు. అందుకే ఈలోగానే అమ్మవార్లను దర్శనం చేసుకోవాలని భక్తులు భారీగా వస్తున్నారు.


గవర్నర్ తమిళిసై తులాభారం

# రాష్ట్రంలో 2.99 కోట్ల ఓటర్లు..

- పురుషులు 1,50,41,943
- మహిళలు 1,48,89,410
- ఇతరులు 1,590 మంది
- అసెంబ్లీ స్థానాల వారీగా తుది ఓటర్ల జాబితాల ప్రకటన



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో 2,99,32,943 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,50,41,943 మంది పురుష, 1,48,89,410 మహిళ, 1,590 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. కొత్తగా 1,44,855 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 12,639 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం–2020లో భాగంగా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రకటించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

**ఉచితంగా ప్రామాణిక ఓటరు గుర్తింపు కార్డులు**

త్వరలో రాష్ట్రంలోని ఓటర్లందరికీ ప్రామాణిక ఓటరు గుర్తింపు కార్డులను ఉచితంగా జారీ చేయనున్నారు. ఓటర్లకు జీవితాంతం ఒకే విశిష్ట సంఖ్యతో ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. 10 ఆంగ్ల అక్షరాలు, అంకెల (ఆల్ఫా న్యూమరిక్) కలయికతో కొత్త నమూనాలో ప్రామాణిక ఓటరు గుర్తింపు (స్టాండర్డ్ ఎపిక్) కార్డులు జారీ చేస్తోంది. ఓటరు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లినా.. వారి విశిష్ట ఓటరు సంఖ్య మారదు. చిరునామా మారితే అదే విశిష్ట సంఖ్యతో కొత్త ఓటరు గుర్తింపు కార్డు జారీ చేయనున్నారు. ఈ విశిష్ట ఓటరు గుర్తింపు సంఖ్య ద్వారా ఓటర్లను ఈఆర్వో నెట్ సాఫ్ట్‌వేర్ ద్వారా సులువుగా ట్రాక్ చేయడానికి వీలు కలగనుంది. పాత ఓటరు గుర్తింపు (నాన్ స్టాండర్డ్ ఎపిక్) కార్డులు కలిగి ఉన్న ఓటర్లందరికీ ప్రామాణిక ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీఈవో రజత్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో 23,76,403 మంది పురుషులు, 27,03,587 మంది మహిళలు, థర్డ్ జెండర్ ఒకరు కలిపి మొత్తం 50,79,991 మందికి ఇంకా ప్రామాణిక ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు.

### జిల్లాల వారీగా ఓటర్ల జాబితా..

| జిల్లా | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| కుమ్రంభీం | 2,02,300 | 2,00,934 | 16 | 4,03,250 |
| మంచిర్యాల | 2,94,867 | 2,91,380 | 43 | 5,86,290 |
| ఆదిలాబాద్ | 2,05,923 | 2,12,589 | 12 | 4,18,524 |
| నిర్మల్ | 3,26,757 | 3,49,807 | 35 | 6,76,599 |
| నిజామాబాద్ | 6,16,794 | 6,85,243 | 32 | 13,02,069 |
| కామారెడ్డి | 3,06,082 | 3,24,796 | 53 | 6,30,931 |
| జగిత్యాల | 3,24,233 | 3,44,602 | 15 | 6,68,850 |
| పెద్దపల్లి | 3,37,704 | 3,35,802 | 40 | 6,73,546 |
| కరీంనగర్ | 4,96,205 | 5,01,440 | 30 | 9,97,675 |
| రాజన్న సిరిసిల్ల | 2,12,858 | 2,24,047 | 3 | 4,36,908 |
| సంగారెడ్డి | 6,15,106 | 5,99,474 | 34 | 12,14,614 |
| మెదక్ | 2,,02,231 | 2,13,481 | 7 | 4,15,719 |
| సిద్దిపేట | 4,48,982 | 4,55,230 | 17 | 9,04,229 |
| రంగారెడ్డి | 15,79,766 | 14,53,823 | 361 | 30,33,950 |
| వికారాబాద్ | 4,48,967 | 4,48,457 | 23 | 8,97,447 |
| మేడ్చల్ | 12,73,703 | 11,73,149 | 262 | 24,47,114 |
| హైదరాబాద్ | 21,93,352 | 20,43,631 | 207 | 42,37,190 |
| మహబూబ్‌నగర్ | 3,26,257 | 3,25,646 | 14 | 6,51,917 |
| నాగర్‌కర్నూల్ | 3,34,051 | 3,29,276 | 8 | 6,63,335 |
| వనపర్తి | 1,24,497 | 1,23,189 | 15 | 2,47,701 |
| జోగుళాంబ | 2,26,124 | 2,28,484 | 9 | 4,54,617 |
| నల్లగొండ | 6,80,795 | 6,83,458 | 18 | 13,64,271 |
| సూర్యాపేట | 4,60,055 | 4,71,089 | 13 | 9,31,157 |
| యాదాద్రి | 2,11,129 | 2,10,181 | 2 | 4,21,312 |
| జనగామ | 3,48,866 | 3,49,402 | 13 | 6,98,281 |
| మహబూబాబాద్ | 2,19,656 | 2,23,399 | 33 | 4,43,088 |
| వరంగల్ రూరల్ | 2,11,174 | 2,17,836 | 2 | 4,29,012 |
| వరంగల్ అర్బన్ | 3,59,925 | 3,66,028 | 179 | 7,26,132 |
| భూపాలపల్లి | 1,32,132 | 1,31,098 | 4 | 2,63,234 |
| భద్రాద్రి | 4,50,386 | 4,69,891 | 21 | 9,20,298 |
| ఖమ్మం | 5,50,315 | 5,74,862 | 58 | 11,25,235 |
| ములుగు | 1,05,594 | 1,08,061 | 8 | 2,13,663 |
| నారాయణపేట | 2,15,157 | 2,19,625 | 3 | 4,34,785 |
| మొత్తం | 1,50,41,943 | 1,48,89,410 | 1,590 | 2,99,32,943 |

# వరంగల్‌లో మైండ్‌ట్రీ ఐటీ కంపెనీ

- సీఎం కేసీఆర్ విజ్ఞప్తి పట్ల ఎల్‌అండ్‌టీ అంగీకారం
- ట్విట్టర్‌లో ప్రకటించిన మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** వరంగల్ నగరంలో మైండ్‌ట్రీ ఐటీ కంపెనీ ఏర్పాటుకు ఎల్‌అండ్‌టీ గ్రూపు ముందుకువచ్చింది. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన జేబీఎస్–ఎంజీబీఎస్ మెట్రో రైలు మార్గం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందిస్తూ ఎల్‌అండ్‌టీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సుబ్రమణ్యం ఈ మేరకు అంగీకారం తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు ట్విట్టర్‌లో ఈ విషయాన్ని ప్రకటించారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న మైండ్‌ట్రీ ఐటీ, ఔట్ సోర్సింగ్ కంపెనీని 1999లో ఎల్‌ఎండ్‌టీ గ్రూపు ఏర్పాటు చేసింది. ఈ కంపెనీలో 20,204 మంది ఉద్యోగులు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే మైండ్‌ట్రీ కంపెనీ ప్రాంగణం ఉండగా, వరంగల్‌కు సైతం విస్తరించనుంది.

### ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు భేష్..

మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన మూడు కేసులను రాష్ట్రంలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు సత్వర విచారణ నిర్వహించడమే కాకుండా, మూడు కేసుల్లో ఐదుగురు నిందితులకూ మరణ శిక్ష విధించాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సత్వర న్యాయం కోసం రాష్ట్ర పోలీసు, హోంశాఖ, న్యాయశాఖ అధికారుల కృషిని ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్‌లో ప్రశంసించారు.

### నేటితో ముగియనున్న ప్యాక్స్ నామినేషన్ల ప్రక్రియ

**సాక్షి, హైదరాబాద్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగియనుంది. రెండో రోజైన శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 905 ప్యాక్స్‌ల పరిధిలోని 11,765 డైరెక్టర్ల పదవులకు రెండో రోజు 11,959 నామినేషన్లు వచ్చాయి. తొలిరోజు 2,311 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా 14,267 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా నిజామాబాద్‌లో 83 ప్యాక్స్‌లకు 1,328 నామినేషన్లు వచ్చాయి. అత్యల్పంగా జనగాం జిల్లాలో 14 ప్యాక్స్‌లకు 200 నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం సాయంత్రం 3 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. ఆదివారం నామినేషన్ల పరిశీలన, 10న నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు చేయనున్నట్లు ఎన్నికల అథారిటీ అధికారులు వెల్లడించారు.

# పెద్దపల్లి, మహబూబ్‌నగర్ రైల్వే సమస్యలు తీర్చండి

### కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌కు టీఆర్‌ఎస్ ఎంపీల విజ్ఞప్తి

**సాక్షి, న్యూఢిల్లీ:** పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌కు విన్నవించినట్లు టీఆర్‌ఎస్ ఎంపీలు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ నేత, పి.రాములు చెప్పారు. శుక్రవారం వారు కేంద్రమంత్రి గోయెల్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. ముందుగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 'దేవరకద్ర రైల్వేస్టేషన్‌లో తుంగభద్ర, కర్నూల్ సిటీ, హంద్రీ, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌తో సహా పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరాం. దీనివల్ల స్థానిక ప్రజలకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి తెచ్చే అవకాశముంది. ప్రఖ్యాతిగాంచిన మన్యంకొండ వెంకటేశ్వర స్వామి ఆలయం, కురుమూర్తి రాయుడు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగం. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా రైల్వే లైన్లు ఇవ్వాలి. జాతీయ రహదారి 44, 167 వెంబడి ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేయాలని కోరాం' అని వివరించారు.

**పెద్దపల్లిలో ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలి: వెంకటేష్ నేత**

ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ.. 'పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చాం. పెద్దపల్లి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరాం. పెద్దపల్లి స్టేషన్‌లో కోచ్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, స్టేషన్‌ను ఆధునీకరించాలని విన్నవించాం. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో కొత్త ఫ్లాట్ ఫారం, కొత్త టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి. మంచిర్యాల పట్టణంలో హమాలీ జెండా వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. తాండూరు మండలంలోని రేచిని రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేయాలి. వీటన్నింటిపై కేంద్రమంత్రికి వినతిపత్రం అందించాం. ఆయన సానుకూలంగా స్పందించారు..'అని వివరించారు.



రోజూ ఏదో అలాంటి వార్త చూస్తేగానీ నిద్రపోరు... ఏం జబ్బో ఏమో!!

epaper.sakshi.com


శుక్రవారం జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గంలో మెట్రో రైలును పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, కేటీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, ఎల్అండ్‌టీ సీఈఓ సుబ్రమణ్యన్ తదితరులు

# జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో పరుగులు

**పచ్చజెండా ఊపి ప్రారంభించిన సీఎం కేసీఆర్**
**జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రోలో ప్రయాణం**
**ఈ మార్గంలో 13 నిమిషాల్లో జర్నీ పూర్తి**
**నేటి నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి..**

**సాక్షి, హైదరాబాద్:** గ్రేటర్ వాసుల కలల మెట్రో రైల్‌ను జేబీఎస్–ఎంజీబీఎస్ మార్గంలో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ పచ్చ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జేబీఎస్ వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ వరకు మెట్రో రైల్‌లో ప్రయాణం చేశారు. సీఎం ప్రయాణించడంతో ఈ మార్గంలోని చిక్కడపల్లి మినహా ఇతర మెట్రో స్టేషన్లలో ఎక్కడా రైలును నిలపకుండా నేరుగా ఎంజీబీఎస్ వరకు నడిపారు. దీంతో 13 నిమిషాల్లోనే జర్నీ పూర్తయ్యింది. సాధారణంగా ఈ మార్గంలో ప్రతీ స్టేషన్‌లో మెట్రో రైల్ నిలిపితే ప్రయాణానికి 16 నిమిషాల సమయం పడుతుంది. ఎంజీబీఎస్ వద్ద మెట్రో దిగిన సీఎం స్టేషన్ లో ప్రయాణికులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ అధికారులు నగర మెట్రో ప్రాజెక్టు విశేషాలను కేసీఆర్‌కు వివరించారు. మెట్రో ప్రస్థానంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి తిలకించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎంపీ రేవంత్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్అండ్‌టీ సీఈఓ ఎస్ఎన్ సుబ్రమణ్యన్, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ కేవీబీ రెడ్డి, నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఉన్నారు.

**నేడు ఉదయం 6.30 నుంచి అందుబాటులోకి...**

జేబీఎస్–ఎంజీబీఎస్ మార్గంలో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి మెట్రో సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. నిత్యం ఈ మార్గంలో సుమారు 60 వేల నుంచి లక్ష మంది వరకు జర్నీ చేసే అవకాశాలున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. కాగా, మెట్రో ప్రారంభానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకావడంతో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిపించింది. జేబీఎస్ మెట్రో స్టేషన్ వద్దకు భారీగా చేరుకున్న నాయకులు, కార్యకర్తలు బ్యాండ్ మేళాలు, నృత్యాలతో సందడి చేశారు. చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వద్ద కొన్ని నిమిషాల పాటు రైల్ నిలపడంతో కేసీఆర్‌ను చూసేందుకు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరికి సీఎం అభివాదం చేశారు.


మెట్రో రైలులో డీజీపీ మహేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు


మెట్రో రైలు క్యాబిన్‌లో ఎల్అండ్‌టీ సీఈఓతో ముచ్చటిస్తున్న కేటీఆర్

### మెట్రో విస్తరణకు ప్లాన్ సిద్ధం చేయండి..

నగరం నలుమూలలా మెట్రో విస్తరణకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. మెట్రోలో ప్రయాణిస్తూ ఆయన.. ఎన్వీఎస్ రెడ్డి, ఇతర అధికారులతో మాట్లాడారు. నగరవాసులకు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ లేకుండా ప్రయాణం సాగించేందుకు, హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు మెట్రో ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. మూడు మార్గాల్లో మెట్రో పూర్తితో ఆ ఫలాలను నగరవాసులు అందిపుచ్చుకున్నారని సీఎం అన్నారు. జేబీఎస్, ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్లు అత్యాధునిక ఎయిర్ పోర్టుల తరహాలో కనిపిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. టెక్నాలజీ, విజన్‌పరంగా ఢిల్లీ మెట్రో కంటే హైదరాబాద్ మెట్రో మరింత అత్యాధునికంగా ఉందన్నారు. మెట్రో రైల్లో ప్రయాణిస్తూ ఆ మార్గంలోని ప్రతి ప్రాంతాల విశిష్టతలను ముఖ్యమంత్రి గుర్తు చేసినట్లు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

# డిగ్రీలోనూ 'మేనేజ్‌మెంట్' బాదుడేనా?

- యాజమాన్య కోటా అమలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి
- యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గిన ఉన్నత విద్యా మండలి
- సర్కార్ ఓకే అంటే ప్రైవేట్ కాలేజీలకు పండుగే..
- అడ్డగోలుగా సీట్లు అమ్ముకునేందుకు వెసులుబాటు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లోనూ మేనేజ్‌మెంట్ కోటా అమల్లోకి తెచ్చేందుకు ఉన్నత విద్యా మండలి చర్యలు వేగవంతం చేసింది. గత రెండేళ్లుగా యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిడికి తలొగ్గి ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాను అమలు చేసేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి శుక్రవారం ప్రభుత్వానికి పంపింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఓకే అంటే 500 ప్రైవేటు డిగ్రీ కాలేజీల పంట పండినట్లే. మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశపెట్టినా, వివిధ కోర్సులకు యూనివర్సిటీలు నిర్ణయించిన ఫీజులనే మేనేజ్‌మెంట్ కోటాలోనూ వసూలు చేయాలని ఉన్నత విద్యా మండలి చెబుతున్నా యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులను దండుకునేందుకు మార్గం సుగమం కానుంది.

**ప్రత్యేక ఫీజు విధానం లేదు..**

ప్రస్తుతం రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ కోటాకు ప్రత్యేక ఫీజు విధానం అంటూ ఏమీ లేదు. కన్వీనర్ కోటాలో నిర్ణయించిన ఫీజునే మేనేజ్‌మెంట్ కోటాలోనూ అమలు చేయాలి. అయినా ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా వంటి వృత్తి, సాంకేతిక విద్యా కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లను అడ్డగోలుగా అమ్ముకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డిగ్రీ కోర్సుల్లోనూ అదే విధానానికి ఉన్నత విద్యా మండలి తెరతీస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో డిమాండున్న ఎక్కువ సీట్లు భర్తీ అయ్యే డిగ్రీ కాలేజీలు 500 వరకుంటే అందులో 40కి పైగా కాలేజీలు కోర్టును ఆశ్రయించి మరీ ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. తాము కోర్సును నిర్వహించాలంటే తమకు నచ్చిన ఫీజును వసూలు చేస్తామని, యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజుతో తాము కాలేజీలను నడపలేమని చెబుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశాల నుంచి కోర్టు నుంచి మినహాయింపు తెచ్చుకొని తమ ఇష్టానుసారంగా ఫీజులను తీసుకుంటూ సీట్లను భర్తీ చేస్తున్నాయి. మరోవైపు మైనారిటీ కాలేజీలు సొంతంగానే ప్రవేశాలు చేపట్టుకుంటున్నాయి. అలాంటి కాలేజీలను సాధారణ విద్యార్థులకు అందుబాటులోకి తేవడంలో విఫలమైన ఉన్నత విద్యామండలి విద్యార్థులకు అందుబాటులో ఉన్న కాలేజీల్లోనూ మేనేజ్‌మెంట్ కోటాను ప్రవేశపెట్టి సీట్లు అమ్ముకునేందుకు అవకాశం కల్పి స్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆ తరహాలోనే..**

వృత్తి, సాంకేతిక విద్యా సంస్థల తరహాలోనే డిగ్రీలోనూ మేనేజ్‌మెంట్ కోటా 30% అమలు చేసేందుకు విద్యా మండలి సిద్ధమైంది. ఈ అంశాన్ని తమ ప్రతిపాదనల్లో పొందుపరిచినట్లు తెలిసింది. పైగా ఇష్టం ఉన్న కాలేజీలు కోటాను అమలు చేసుకోవచ్చు. ఇష్టం లేని కాలేజీలు మొత్తం కన్వీనర్ కోటా కింద నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశాల్లో భర్తీ చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నాయి. దీని వల్ల టాప్ కాలేజీలు, కొంత పేరున్న కాలేజీలు, 80 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యే కాలేజీలు 500కు పైగా మేనేజ్‌మెంట్ కోటాను అమలు చేస్తాయి. అంటే ఇపుడు కోర్టును ఆశ్రయించి సొంతంగా ప్రవేశాలు చేస్తూ, సొంతంగా ఫీజులను నిర్ణయించుకొని వసూలు చేస్తున్న 40 కాలేజీలకు తోడు మరో 450 పైగా కాలేజీలు తమ ఇష్టానుసారంగా 30% సీట్లను భర్తీ చేసుకునే వీలును ఉన్నత విద్యామండలే కల్పిస్తోంది.




### మేనేజ్‌మెంట్ కోటాలో లక్షకు పైగా సీట్లు..

ప్రస్తుతం రాష్ట్రంలో 1,170 డిగ్రీ కాలేజీలుండగా, వాటిల్లో 4,44,169 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో ప్రభుత్వ, ఎయిడెట్, అటానమస్, గురుకులాలు పోగా 845 ప్రైవేటు డిగ్రీ కాలేజీలున్నాయి. వాటిల్లో 3,13,485 సీట్లున్నాయి. వాటిన్నింటిలో ఇప్పటివరకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారానే ప్రవేశాలు జరుగుతున్నాయి. వాటికి తోడు మరో 42,460 సీట్లు కలిగిన 118 కాలేజీలు సొంతంగా ప్రవేశాలు చేపడుతున్నాయి. ఇందులో కోర్టును ఆశ్రయించినవి ఉన్నాయి. అవి కూడా కలుపుకొని (వాటిల్లో మేనేజ్‌మెంట్ కోటా అమలు చేస్తే) మొత్తంగా 966 కాలేజీల్లో 3,55,945 సీట్లు అందుబాటులో ఉండనుండగా, అందులో మేనేజ్‌మెంట్ కోటా కింద 1,06,783 సీట్లను యాజమాన్యాలే భర్తీ చేసుకునే వీలు ఏర్పడనుంది.

## టీటీడీ ఈవోకు కోర్టు ధిక్కార నోటీసు

**సాక్షి, హైదరాబాద్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సిబ్బందికి పదోన్నతులు కల్పించేటప్పుడు రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకోకుండా సీనియార్టీ ఆధారంగా చేయాలని ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంతో టీటీడీ కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. 2018 అక్టోబర్‌లో ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయలేదని ఎం.రమేశ్‌బాబు అనే టీటీడీ ఉద్యోగి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని ఇటీవల విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఈవోకు నోటీసులిచ్చింది. కావాలనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని, కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లుగా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.




# అవినీతి చీడ వదిలించే బాధ్యత మీదే

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన
- ముగిసిన అఖిలభారత సర్వీసెస్, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారుల ఫౌండేషన్ కోర్సు


శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి

**సాక్షి, హైదరాబాద్:** ప్రజా జీవితంలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం అనేవి రాజకీయ నేతలు, అధికారులకు అత్యంత ముఖ్యమైన అంశాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. అవినీతి చీడను పారద్రోలి సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల పరిష్కారానికి బాటలు వేయాల్సిన బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులదేనని, సుపరిపాలన ద్వారా దేశ సమగ్ర, సుస్థిరాభివృద్ధికి కృషిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వమంటే ప్రజలకు కనిపించేది అధికారుల రూపంలోనేనని చెప్పారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అఖిలభారత సర్వీసెస్, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారుల ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సివిల్ సర్వెంట్స్‌కు ప్రజాసేవే పరమావధికావాలి. అనుక్షణం నీతి, నిజాయితీలతో పనిచేయాలి. ఏదో ఉద్యోగం చేస్తున్నాం అన్నట్టు కాకుండా ప్రజాసేవను ఒక బాధ్యతగా నిర్వహించండి..' అని అన్నారు.

**పేదరికం, లింగవివక్షలపై..**

దేశాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, నిరక్షరాస్యత, కుల, మత, లింగ వివక్షలను పారద్రోలడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతుల కల్పన ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఉప రాష్ట్రపతి సూచించారు. ప్రధాని, ఆర్థికమంత్రి, ముఖ్యమంత్రి ఇలా కొందరి వల్లే దేశ పురోభివృద్ధి సాధ్యం కాదని, అందరి భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమన్నారు. ప్రభుత్వపథకాలను అధికారులు సరిగ్గా అమలుచేయడంతోనే సుపరిపాలన సాధ్యమని తెలిపారు. ప్రస్తుతం అసహనం పెరిగిపోయిందని కొందరు అంటుంటారని, రాజకీయంగా ప్రజలిచ్చిన తీర్పు పట్ల సహనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ కాలంలో అనేక అవకాశాలు లభిస్తాయని, వాటితో పాటు సవాళ్లు కూడా ఉంటున్నందున వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

**ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండండి.. ఫిట్‌గా ఉండండి..**

నేటి యువత పిజ్జా, బర్గర్ వంటి పాశ్చాత్య రుచులకు ఆకర్షితులవుతోందని, ఆ ఆహారం విదేశీయులకు మంచిది తప్ప మనకు కాదని వెంకయ్యనాయుడు హితవుపలికారు. మనపెద్దలు నిర్దేశించినట్టుగా ఏ కాలానికి తగ్గట్టుగా ఆ సంప్రదాయ ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఇన్‌స్టంట్ ఫుడ్ తీసుకుంటే ఎల్లప్పుడూ (కన్‌స్టంట్) రోగాలు పొంచి ఉంటాయన్నారు. శారీరకంగా ధారుఢ్యంగా ఉండేందుకు వ్యాయామం, క్రీడలు దోహదం చేస్తాయని, ఫిట్‌నెస్ అనేది జీవితంలో భాగమని అధికారులు గుర్తించాలని చెప్పారు. తాను 70 ఏళ్ల వయసులోనూ ప్రతీరోజు బ్యాడ్మింటన్ ఆడతానని, ఉదయం ఢిల్లీలో బ్యాడ్మింటన్ ఆడి వచ్చానని తెలిపారు. 'దేశ రక్షణ వ్యవస్థ, అనుబంధ రంగాల్లో మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ వ్యవస్థ కీలకమైంది. ఈ విభాగం (ఎంఈఎస్) అధికారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశ రక్షణ వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం దొరుకుతుంది. ఈ వ్యవస్థలోనూ అవినీతికి తావులేకుండా..లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తిచేయడంలో మీరు చొరవ తీసుకోండి'అని ఎంఈఎస్ అధికారులకు ఉపరాష్ట్రపతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ బీపీ ఆచార్య, కోర్స్ డైరెక్టర్ హర్‌ప్రీత్ సింగ్, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ సీఈ బ్రిగేడియర్ పీకేజీ మిశ్రా పలువురు ఐఏఎస్ అధికారులు, ఫౌండేషన్ కోర్సుకు హాజరైన అఖిలభారత, కేంద్ర సర్వీసుల అధికారులు, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసుల అధికారులు పాల్గొన్నారు.

## టీవోఏ ఎన్నికల్లో పోటీకి జయేశ్ రంజన్‌కు అనుమతి

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీవోఏ) అధ్యక్ష పదవికి జరిగే పోటీల్లో రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ పోటీ చేసేందుకు అనుమతించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల అధికారికి న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆల్ ఇండియా సర్వీస్ (కండక్ట్) రూల్స్–1968లోని 13(5) రూల్‌ను ఆధారంగా తన నామినేషన్‌ను తిరస్కరిస్తూ ఎన్నికల అధికారి రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యుడిగా ఉన్నారని, టీవోఏ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉందని, పైగా, పోటీ చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా అనుమతి ఇచ్చారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. రూల్ 13(5)కు పిటిషనర్‌కు వర్తించదని, ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌ను అమలు చేయలేదనే అధికారం ఎన్నికల అధికారికి లేదని హైకోర్టు స్పష్టం చేసింది. పోటీ చేసేందుకు అనుమతివ్వాలని, అయితే ఈ ఉత్తర్వులు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఎన్నిక ఉంటుందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది.

### వ్యాపారి ఇంట్లో ఐటీ సోదాలు

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివార్లలోని మంచిరేవులలో నివసిస్తున్న ఒక వ్యాపారి నివాసంలో ఢిల్లీ నుంచి వచ్చిన ఐటీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. ఉత్తర తెలంగాణకు చెందిన అధికార పార్టీ నేతకు సమీప బంధువు అయిన ఈ వ్యాపారి ఇంట్లో ఐటీ సోదాలు రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఈ సోదాలు మొదలయ్యాయి. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు బందోబస్తును ఏర్పాటు చేశాయి.





శుక్రవారం రాత్రి విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్న సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంతం



భక్తులతో కిటకిటలాడుతున్న మేడారం



మేడారం బస్ పాయింట్ వద్ద భక్తుల సందడి

# ఆర్టీసీకి భారీ ఆదాయం

### 8.69 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

**భూపాలపల్లి:** మేడారం జాతరలో ఆర్టీసీ సంస్థ శుక్రవారం రాత్రి వరకు 8,69,484 మంది ప్రయాణికులకు సేవలు అందించింది. దీంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. ఈనెల 2వ తేదీ నుంచి శుక్రవారం రాత్రి వరకు వివిధ రూట్లలో 14,700 బస్ ట్రిప్పులు నడిపించింది. బస్సుల కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. సారలమ్మ, సమ్మక్క గద్దెలపైకి రావడంతో తల్లులను దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. దీంతో విపరీతంగా రద్దీ పెరిగింది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. శుక్రవారం ప్రతీ గంటకు 100 నుంచి 350 వరకు బస్సులను నడిపించారు. కాగా హన్మకొండ, భూపాలపల్లి, గోదావరిఖని వైపు వెళ్లేందుకు బస్సులు సరిపడా లేకపోవడంతో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

## జాతరలో మద్యం జోరు

### ఇప్పటికే రూ.4.57 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు

**సాక్షి, వరంగల్ రూరల్ :** మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జాతర సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు 22 షాపుల ఏర్పాటుకు ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు అనుమతి ఇచ్చారు. ఒక్కో మద్యం షాపు రోజుకు రూ.9 వేల అద్దె చొప్పున ఏడు రోజులకు రూ.12.5 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు లభించింది. ఇప్పటి వరకు రూ.4.57 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. కాగా, గత జాతరలో రూ.3.53 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి.

## నేడు ఎంపీ, ఛత్తీస్‌గఢ్ సీఎంలు

**సాక్షి, భూపాలపల్లి:** ములుగు జిల్లాలోని మేడారం మహా జాతరలో భాగంగా వనదేవతలైన శ్రీ సమ్మక్క – సారలమ్మ శనివారం వన ప్రవేశం చేయనున్నారు. జాతర చివరి రోజు మరికొంత మంది వీఐపీలు మేడారానికి వచ్చే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు కమల్‌నాథ్, భూపేష్‌బాగల్ వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

## తల్లులకు వీఐపీల మొక్కులు

**సాక్షి, భూపాలపల్లి:** శ్రీ సమ్మక్క – సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం మేడారానికి వీఐపీల తాకిడి పెరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ బండా ప్రకాష్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ములుగు, భూపాలపల్లి, వర్ధన్నపేట, రామగుండం, మహబూబాబాద్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యేలు సీతక్క, గండ్ర వెంకటరమణారెడ్డి, అరూరి రమేష్, కోరుకంటి చందర్, శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందూలాల్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్మన్లు పుట్టా మధు, జక్కు శ్రీహర్షిణి, గండ్ర జ్యోతి వనదేవతలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరితో పాటు ఐజీ నాగిరెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు మొక్కులు చెల్లించుకున్నారు.



బారికేడ్లను తోసుకుంటూ వస్తున్న భక్తులను నిలువరిస్తున్న పోలీసులు

# అరుపులు.. తోపులాట

**క్యూలైన్లలో భక్తుల ఇక్కట్లు • తల్లుల దర్శనానికి నాలుగు గంటల నిరీక్షణ**

**కాటారం:** మేడారం జాతరలో అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు నానా పాట్లు పడాల్సి వచ్చింది. జాతర మూడో రోజు శుక్రవారం గద్దెలపై కొలువుదీరి ఉన్న సమ్మక్క–సారక్కలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వీవీఐపీ, వీఐపీలతో పాటు సాధారణ క్యూలైన్లలో సైతం భక్తుల రద్దీ పెరిగింది. వీవీఐపీ దర్శనానికి వచ్చే ప్రముఖులకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వడంతో సాధారణ భక్తులు అనేక అవస్థలు పడ్డారు. అమ్మవార్ల దర్శనం కోసం తెల్లవారుజామున క్యూలో ఉండగా.. నాలుగు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్లు, తమిళిసై సౌందరరాజన్, బండారు దత్తాత్రేయ అమ్మలను దర్శించుకోవడం కోసం అధికారులు సాధారణ భక్తులను సుమారు గంట పాటు నిలిపివేశారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు క్యూలైన్లో నిలుచోలేక ఇబ్బందులు పడ్డారు. సహనం కోల్పోయిన పలువురు అరుపులు, కేకలు వేయడంతో గందరగోళం నెలకొంది. ఒకింత తోపులాట జరిగింది. క్యూలైన్లోని భక్తులకు తాగునీటి సౌకర్యం సైతం లేకపోవడంతో నీటి కోసం తండ్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కేకలు వేస్తున్న ఓ భక్తుడు



మేడారంలోని సమ్మక్క, సారలమ్మల గద్దెల ప్రాంతంలో భక్తుల రద్దీ



మేడారంలో భక్తజన సందోహం



## బైబై తల్లీ..!

మేడారం మహాజాతర ముగింపు దశకు చేరుకోవడంతో శుక్రవారం సాయంత్రం తిరుగు పయనమవుతున్న భక్తులు

# ఊరూరా 'మినీమేడారం'

**సాక్షి, మంచిర్యాల:** ఎత్తు బంగారం, చిన్న పిల్లల పుట్టెంటికలు, యాట పోతుల కొనుగోళ్లతో ఎక్కడ చూసినా 'సమ్మక్క సారలమ్మ'సందడి నెలకొంది. దూర భారం, ఇతర కారణాలతో మేడారం వెళ్లలేని భక్తులు స్థానికంగా మినీ మేడారం జాతర్లలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. విద్యా, ఉద్యోగం, వృత్తి రీత్యా వలస వెళ్లిన అనేక మంది తమ సొంత ఊళ్లకు జాతర కోసం రాకపోకలు అధికమయ్యాయి. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఆర్టీసీ డిపో నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. సమ్మక్క, సారలమ్మ జాతర ప్రభావంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంతలు, వ్యాపారాలు జోరందుకున్నాయి. జాతర సందర్భంగా అమ్మలకు ప్రీతి పాత్రమైన 'బంగారం'గా పిలిచే బెల్లం సమర్పణకు భక్తులు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. భక్తుల డిమాండ్ మేరకు మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు బెల్లం బుట్టలను టన్నుల కొద్దీ జిల్లాలకు దిగుమతి చేసుకుంటున్నారు. గతంలో కంటే ఈ ఏడాది బెల్లం విక్రయాలు అధికంగా ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే వార సంతలు, మార్కెట్లలో జీవాల విక్రయాలకు డిమాండ్లు పెరిగాయి. అలాగే జాతర సందర్భంగా భక్తులు చిన్న పిల్లల పుట్టెంటికలు (తలనీలాలు), నిలువెత్తు బెల్లం సమర్పణ, ఇతర ముడుపులు చెల్లించుకుంటున్నారు. మొత్తానికి ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మినీమేడారం సందడి నెలకొంది.

# సంబురానికైనా..సంతోషానికైనా..!

**నృత్యమంటే ఆదివాసీలకు ప్రాణం**

**వివిధ ప్రాంతాల్లో రకరకాల నృత్యరీతులు**

**ఎస్‌ఎస్ తాడ్వాయి:** నృత్యమంటే ఆదివాసీలకు ఆరో ప్రాణం. ఆటవిడుపుకైనా, ఆనంద సమయంలోనైనా అంతా కలసి నృత్యం చేస్తారు. ఖమ్మం జిల్లాలో కొండరెడ్లు, గొత్తికోయలు, గొట్టె కోయలు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆదివాసీ కోయలు, నాయకపోడులు, ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు, ఆంధ్రప్రదేశ్ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలే కాకుండా ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ జాతుల ఆదివాసీ గిరిజనులు ఉన్నారు. వీరందరిని పరిశీలిస్తే ఉమ్మడిగా నృత్యం ఉంటుంది. ఇందులో భిన్నమైన నృత్యరీతులు కనిపిస్తుంటాయి. మేడారం జాతర నేపథ్యంలో అలాంటి నృత్యాల్లో కొన్నింటి వివరాలు..

### థింసా

థింసా ఆదివాసీల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయ నృత్యం. ఇది వారి జీవనాడి, గుండె చప్పుడు అని చెప్పాలి. గూడెంలో థింసా వాయిద్యం మోగిందంటే ఆనందానికి అవధులు ఉండవు. పెళ్లిళ్లు, పండుగలు, స్వాగతాలు పలకడానికి, వేరే గ్రామస్తులతో స్నేహం తదితర సందర్భాలలో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. థింసాలో డప్పు, షహనాయ్, గుడుం, పిల్లన గ్రోవి వంటి తదితర వాయిద్యాలు వాడతారు. థింసాలో పార్ థింసా, బారిజమ్ థింసా, గుదుల్ థింసా, శివాల్ థింసా, గుండిల్ థింసా, గుడుజల్ థింసా అనే నృత్యాలను చేస్తారు.



తలపై నెమలి పింఛాలతో నృత్యం చేస్తున్న ఆదివాసీలు

### సవరల నృత్యం

సవరల నృత్యం వైవిధ్యభరితంగా ఉంటుంది. ఆయా రుతువులు, పరిస్థితులకు అనుగుణంగా చేసే సవరల నృత్య రీతులు సంగీతంతో ముడిపడి ఉంటాయి. ఈ నృత్య రీతుల్లో నర్తకులంతా చేతులతో ఒకరి నడుములు ఒకరు పట్టుకుని వలయాకారంగా ఏర్పడి పాట పాడుతూ నృత్యం చేస్తారు. సాయంత్రపు వేళల్లో చేసే నృత్యాలను 'ఉరిచిగాగు' అని రాత్రి వేళల్లో చేసే ఈ నృత్యాన్ని 'తగిలిగాడు' అని పిలుస్తారు.

### లక్ష్మీదేవర నృత్యం

ఈ నృత్యాన్ని ఆదివాసీ నాయకపోడులు ప్రదర్శిస్తుంటారు. చెక్కతో తయారు చేసిన గుర్రపు ముఖం శరీరానికి తగిలించుకుని పూనకంతో ఉన్న వ్యక్తి లయబద్ధంగా నృత్యం చేస్తాడు. ఆయనకు తోడుగా చెక్కతో తయారు చేసిన పోతురాజు ముఖం, కిష్టస్వామి ముఖం వంటివి ధరించి మిగతా వారు బృందంగా నృత్యం చేస్తారు.

### కుర్రె నృత్యం

వివాహాలు, దేవర్ల కొలువులు, పండుగలు తదితర ఉత్సవాల్లో ఆదివాసీలు ఈ నృత్యాలను ప్రదర్శిస్తారు. పంచ, బనియన్ ధరించి తలకట్టు కట్టుకుని, చేతిలో రుమాలు పట్టుకుని, కాళ్లకు గజ్జెలు ధరించి వలయాకారంగా తిరుగుతూ సంగీతానికి అనుగుణంగా నృత్యం చేస్తుంటారు. రెండు సన్నాయిలు, మూడు మేళాలు, ఈ నృత్యంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సందర్భాన్ని బట్టి 20 నుంచి 30 మంది వరకు పురుషులు ఈ నృత్యంలో పాల్గొంటారు. ఒకరి భుజంపై మరొకరు చేతులు వేసి బృంద నాయకుడి సైగలను అనుసరించి నృత్యం చేస్తుంటారు. వరంగల్ జిల్లాలోని కోయలు, నాయకపోడులు ప్రదర్శిస్తుంటారు.

### గుస్సాడి

గోండులు ఎంతో ఆనందంతో చేసే నృత్యమే ఈ గుస్సాడి లేదా దండారి నృత్యం. ఈ నృత్యంతో గ్రామాల మధ్య స్నేహ పూర్వక సంబంధాలు మెరుగు పరుచుకోవాలని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆలోచిస్తారు. దీపావళికి పది రోజుల ముందు నుంచే ఈ నృత్యంతో ఆదివాసీలు వేడుకలు జరుపుతారు. ఈ నృత్య కాలంలో చలి ఉంటుంది. అందుకే నెగళ్లు పెట్టుకుని చుట్టూ తిరుగుతూ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

### రేల నృత్యం

ఆదివాసీల రేల పాటల నడుమ రేల నృత్యాన్ని చేస్తారు. ముఖ్యంగా భూమి పండుగ, ముత్యాలమ్మ పండుగ, కొలుపు, తాటిచెట్టు పండుగ, లేలే పండుగ వంటి సందర్భాలలో వెన్నెల రాత్రుల్లో ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఒకరి నడుముపై ఒకరు చేతులు వేసి, మూడు అడుగులు ముందుకు, వెనకకు వేస్తూ పాటకు అనుగుణంగా నర్తిస్తారు.

### కొమ్ముల నృత్యం

ఆదివాసీల పూర్వపు పెద్దలు కొమ్ముల నృత్యంలో పాల్గొనే మగవారికి ప్రత్యేక ఆకర్షణ ఉండాలనుకుని కొత్త వేషధారణ ఏర్పాటు చేశారు. ఆడవారు కట్టుకునే పరికిణీ, శరీరానికి బనియన్ ఉపయోగించి ప్రత్యేకంగా అలంకరించుకుంటారు. అడవిదున్న కొమ్ములు, పూసలు, చీరలతో వెదురు బుట్టకు కొమ్ములు తగిలించి తయారు చేసిన కిరీటం లాంటి దాన్ని తలకు ధరిస్తారు. డోలి వాయిస్తూ, పాట పాడుతూ నృత్యం చేస్తారు. ఎవరైనా డబ్బు విసిరితే వాటిని కొమ్ములతో తీసుకోవడం ఆకర్షణగా ఉంటుంది.

## వాక్ అండ్ టాక్

- ఆగిన నెట్‌వర్క్ సిగ్నల్స్
- మూగబోయిన సెల్‌ఫోన్లు

**కాళేశ్వరం:** సమ్మక్క–సారలమ్మ మహాజాతరలో అధికార యంత్రాంగం అంతా వాకీటాకీలపైనే ఆధారపడి విధులు నిర్వర్తిస్తోంది. వారం రోజులుగా పోలీసులతో పాటు ఇతర శాఖల అధికారులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగ్గా పని చేయక ఇబ్బందులు పడ్డారు. అన్ని టెలికాం కంపెనీల టవర్లు ఉన్నప్పటికీ ఏ సిగ్నల్ సరిగ్గా పని చేయలేదు. కాగా వాకీటాకీలు సమకూర్చడంతో ప్రతీ శాఖ అధికారులు వారికి ఇచ్చిన విధుల్లో సమన్వయంతో సమాచారాన్ని చేరవేసుకుంటున్నారు. ప్రధానంగా ట్రాఫిక్ జాం కాకుండా పోలీసులు ఎప్పటికప్పుడు మైక్‌సెట్ల ద్వారా సమీక్షించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెట్ల ద్వారా సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. తక్షణ చర్యల కోసం కూడా ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో సెట్లతో సమాచారాన్ని చేరవేసి ఆ శాఖకు తెలుపుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూస్, ఆర్టీసీ, ఐటీడీఏ, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఎన్పీడీసీఎల్, దేవాదాయ, రెవెన్యూ, ఫారెస్టు, ఎక్సైజ్, ఇరిగేషన్, వెటర్నరీ శాఖ, మత్స్య శాఖ, ఆర్‌అండ్‌బీతో 38 శాఖల అధికారులు 1200 వాకీటాకీ మైక్‌సెట్లతో జాతర విధుల్లో వినియోగిస్తున్నారు.

# నేడే ఢిల్లీ పోలింగ్

## ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల కమిషన్ • షహీన్‌బాగ్‌లో కట్టుదిట్టమైన భద్రత



ఢిల్లీలో పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ సామగ్రితో విధులకు వెళ్తున్న పోలింగ్ అధికారిణి

**సాక్షి, న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. శనివారం నాటి పోలింగ్‌కు ఎన్నికల సంఘం(ఈసీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ రణ్‌బీర్ సింగ్ వెల్లడించారు. పౌరసత్వ సవరణ చట్టంపై షహీన్‌బాగ్‌లో నిరసనలు, జేఎన్‌యూలో హింస వంటి ఘటనల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. 75 వేల మంది ఢిల్లీ పోలీసులు, పారా మిలటరీ దళాలు, 190 కంపెనీల సీఆర్‌పీఎఫ్‌ను బందోబస్తు కోసం వినియోగించుకుంటున్నట్లు స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీర్ రంజన్ వెల్లడించారు.

### ఈసీ ప్రత్యేక ఏర్పాట్లు

ఓటింగ్‌పై నగర ప్రజల్లో నిరాసక్తత పోగొట్టడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంది. ఓటర్లను గుర్తించడానికి ఎన్నికల సిబ్బంది క్యూఆర్ కోడ్స్, మొబైల్ యాప్స్‌ని వాడుతున్నారు. ఓటర్లు స్మార్ట్ ఫోన్‌లను వెంట తెచ్చుకోవడానికి కూడా అనుమతినిచ్చారు. ఓటరు కార్డు లేకపోయినా క్యూ ఆర్ కోడ్‌తో స్కాన్ చేసి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఇస్తారు. షహీన్‌బాగ్‌లో నిరసనకారుల్ని ఎన్నికల సిబ్బంది స్వయంగా కలుసుకొని ఓటు వేయాలని కోరారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలిరావడానికి వీలుగా ఉదయం 4 గంటల నుంచే మెట్రో రైళ్లు నడవనున్నాయి. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న 30 నియోజకవర్గాల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచే కార్యక్రమాలను ఈసీ చేపట్టింది. ఓటర్లను పోలింగ్ బూత్‌లకు ఉచితంగా చేరవేస్తామని టూవీలర్ ట్యాక్సీ సేవల సంస్థ ర్యాపిడో ప్రకటించింది. మూడు కిలోమీటర్ల వరకు ఓటర్ల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయబోమని తెలిపింది. కాగా, ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 28 మంది, పటేల్‌నగర్ నుంచి అతి తక్కువగా నలుగురే పోటీలో ఉన్నారు.

### కేజ్రీవాల్‌కు ఈసీ నోటీసు

మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్న వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేశారంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. శనివారం సాయంత్రం 5 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఇతర పార్టీలన్నీ సీఏఏ, హిందూ–ముస్లిం, మందిరం–మసీదు గురించే మాట్లాడుతుండగా కేజ్రీవాల్ మాత్రం అభివృద్ధి, సంక్షేమం గురించే చెబుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. ఇది నిబంధనావళిని ఉల్లంఘించడమేనంటూ బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

మొత్తం స్థానాలు: 70
మొత్తం ఓటర్లు: 1.47 కోట్లు
బరిలో ఉన్న అభ్యర్థులు: 672
పోలింగ్ బూత్‌లు: 13, 750




### కేజ్రీవాల్ పనితీరు భేష్: శివసేన

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై శివసేన పార్టీ ప్రశంసలు కురిపించింది. 'అయిదేళ్లలో ఆప్ సర్కార్ చిత్తశుద్ధితో అభివృద్ధి పనులు చేపట్టింది. ఢిల్లీ మోడల్ పేరుతో ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమాలను అమలు చేయాలి' అంటూ పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికింది. ప్రధాని, కేంద్ర మంత్రులు, 200 మంది ఎంపీలు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు కలిసి వచ్చినా కేజ్రీవాల్‌దే పైచేయి అని ఆ సంపాదకీయంలో పేర్కొంది.

## క్లుప్తంగా...

### అమెరికాలో తుపాను.. అయిదుగురి మృతి

**లూయిస్‌విల్లే:** అమెరికాను భారీ తుపాను వణికించింది. ఆ తుపాను ధాటికి అయిదుగురు మృతి చెందారు. దాదాపు 3 లక్షల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఈ తుపాను ఉత్తర కరోలినాలో భారీ ప్రభావం చూపింది. పెన్సిల్వేనియాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోడ్డు ప్రమాదాలు, వరదలు, వర్షం కారణంగా అయిదుగురు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ వర్జీనియాలో ఎమర్జెన్సీ ప్రకటించారు. చాలా చోట్ల పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

### 'శబరిమల ఆభరణాల' జాబితాకు రిటైర్డ్ జడ్జి

**న్యూఢిల్లీ:** శబరిమల అయ్యప్ప దేవాలయ ఆభరణాల జాబితాను తయారు చేసేందుకు, వాటి విలువ లెక్కగట్టేందుకు సుప్రీంకోర్టు నడుంకట్టింది. దీనికోసం కేరళ హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ సీఎన్ రామచందరన్ నాయర్‌ను నియమించింది. పండాలం రాజ కుటుంబంలో విభేదాల దృష్ట్యా సుప్రీంకోర్టు శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. పవిత్ర ఆభరణాల భద్రతపై ఆందోళన చెందుతున్నట్లు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ వీ రామసుబ్రమణియన్‌ల ధర్మాసనం వెల్లడించింది. ఆభరణాల జాబితా తయారు చేసేందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది.

### లైంగిక రుగ్మతల నివారణ మ్యాజిక్ ప్రకటనలకు చెక్

**న్యూఢిల్లీ:** కాంతివంతమైన చర్మం, లైంగిక సామర్థ్యం పెంపు, నత్తిగా మాట్లాడటం, మహిళల్లో వంధ్యత్వం, అకాల వృద్ధాప్యం, జుట్టును నల్లగా మార్చడం, మెదడు సామర్థ్యాన్ని పెంచడం కోసం ద్రావకాలు అంటూ ప్రకటనలిచ్చే వారికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ చెక్ పెట్టనుంది. ఇందుకు సంబంధించిన ద్రావకాలు గానీ డ్రగ్స్ గానీ అమ్మిన వారు చిక్కుల్లో పడ్డట్టే. ఈమేరకు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అబ్జక్షనబుల్ అడ్వర్‌టైజ్‌మెంట్స్ యాక్ట్–1954) చట్టానికి మంత్రిత్వ శాఖ సవరణను ప్రతిపాదించింది. ఇలాంటి ప్రకటనలు చేసిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించే అవకాశముంటుంది.



భారత ఆర్మీ అధికారి మేజర్ అనూప్ మిశ్రా తయారుచేసిన బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్ ఇది. కేవలం 10 మీటర్ల దూరం నుంచి ఏకే-47 గన్‌తో కాల్చినా బుల్లెట్లను తట్టుకునేలా దీన్ని తయారు చేశారు. ఏకే-47 బుల్లెట్లను తట్టుకునే ప్రపంచంలోనే తొలి హెల్మెట్ ఇదేనని ఆయన చెప్పారు. అనూప్ గతంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌నూ తయారుచేశారు.

### విమానం కూల్చివేతకు ఇజ్రాయెల్ యత్నం: రష్యా

**మాస్కో:** సిరియాలో ఒక ప్యాసెంజర్ విమానాన్ని ఇజ్రాయెల్ క్షిపణులతో కూల్చేందుకు ప్రయత్నించిందని శుక్రవారం రష్యా ఆరోపించింది. సిరియాలోని ఇద్లిబ్‌లో రష్యా మద్దతున్న ప్రభుత్వ దళాలకు, విపక్షాన్ని సమర్థిస్తున్న టర్కీ దళాలకు మధ్య పోరు తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో రష్యా ఈ ఆరోపణలు చేసింది. ఇరాన్ నుంచి వస్తున్న 172 మంది ప్రయాణికులున్న విమానం డమాస్కస్ విమానాశ్రయంలో దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే.. నాలుగు ఇజ్రాయెల్ ఎఫ్ –16 యుద్ధ విమానాలు 8 క్షిపణులను ప్రయోగించాయని రష్యా ప్రకటించింది. దాంతో రష్యా దళాల నిర్వహణలో ఉన్న హిమీమ్ ఎయిర్ బేస్‌లో ఆ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చిందని తెలిపింది.

# మంత్రిపై దాడికి యత్నం




- ప్రధానిపై రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హర్షవర్ధన్
- ఆగ్రహంతో దాడికి యత్నించిన కాంగ్రెస్ సభ్యుడు మాణిక్యం
- నిరసనలతో పలుమార్లు లోక్‌సభ వాయిదా

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలపై కేంద్రమంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు కొట్టుకునే దాకా వెళ్లాయి. అసభ్యకరమైన రాహుల్ వ్యాఖ్యలను ఖండించేందుకు మాటలు చాలవంటూ కేంద్రమంత్రి హర్షవర్ధన్ వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ సభ్యుడు మాణిక్యం మంత్రిపై దాడి చేయబోయారు. అనంతరం రెండు పార్టీల సభ్యుల నిరసనల మధ్య సభ శనివారానికి వాయిదాపడింది. శుక్రవారం ఉదయం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యుడు రాహుల్ గాంధీ దేశంలో వైద్యకళాశాలల ఏర్పాటుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమాధానం ఇవ్వాల్సిన ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్..ముందుగా గురువారం ఢిల్లీ ఎన్నికల ర్యాలీలో రాహుల్ 'ఆరు నెలల తర్వాత నిరుద్యోగ యువత ప్రధాని మోదీని కర్రలతో కొట్టి దేశం నుంచి తరిమేస్తారు' అంటూ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఇటువంటి అసభ్యకర వ్యాఖ్యలను ఖండించేందుకు మాటలు చాలవని పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమిళనాడుకు చెందిన మాణిక్యం ఠాగూర్ అధికార పక్షం వైపు దూసుకువచ్చారు. మంత్రిపై దాడి చేసేందుకు ఆయన యత్నించగా పలువురు అడ్డుకున్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ సభ్యుల నిరసనలతో సభ పలుమార్లు వాయిదా పడింది.

## మోదీ ప్రధానిలా ప్రవర్తించడం లేదు



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రధాని మోదీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ట్యూబ్‌లైట్‌గా వర్ణించడంపై రాహుల్ స్పందించారు. మోదీ దేశ ప్రధానిలా వ్యవహరించడం లేదని శుక్రవారం వ్యాఖ్యానించారు. పార్లమెంటులో తనను మాట్లాడకుండా చేసేందుకు బీజేపీ కుట్రపన్ని గందరగోళ పరిస్థితులు సృష్టించిందని ఆరోపించారు. ''సాధారణంగా ప్రధానికి నిర్దిష్టమైన స్థాయి ఉంటుంది. ప్రవర్తించే తీరు ఉంటుంది. కానీ మన ప్రధానికి అలాంటివేవీ లేవు'' అని విమర్శించారు. పార్లమెంటులో తమ గళం వినిపించకుండా చేస్తున్నారని, గొంతులు నొక్కేస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. 'దేశంలో నిరుద్యోగ సమస్యను ఎలా ఎదుర్కోవాలో ప్రధానికి పాలుపోవడం లేదు. ఆయన్ను రక్షించేందుకు బీజేపీ పార్లమెంటును పదేపదే అడ్డుకుంటోంది. తద్వారా ఈ అంశాలపై చర్చ జరగకుండా చేస్తోంది'' అని వివరించారు. కేరళలోని తన నియోజకవర్గం వయనాడ్‌లో వైద్యకశాల లేకపోవడం వల్ల ప్రజలకు వైద్యం దూరమవుతోందన్న విషయాన్ని ప్రస్తావించేందుకు తాను ప్రయత్నించానని కానీ బీజేపీ అడ్డుకుందని వ్యాఖ్యానించారు. వయనాడ్ అంశం లేవనెత్తితే కేంద్ర మంత్రి హర్షవర్ధన్ తాను పార్లమెంటు బయట చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ అమర్యాదకరంగా ప్రవర్తించారని, ప్రశ్నోత్తరాల సమయంలో వేరే అంశాలను ప్రస్తావించే హక్కు ఆయనకు లేదని రాహుల్ స్పష్టం చేశారు. మంత్రి హర్షవర్ధన్‌పై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం టాగూర్ దాడి చేశారన్న బీజేపీ ఆరోపణను రాహుల్ గాంధీ ఖండించారు.

## పాక్‌లో రేపిస్టులకు బహిరంగ ఉరి !

**ఇస్లామాబాద్:** పిల్లలపై అత్యాచారాలకు, హత్యాచారాలకు పాల్పడే వారికి బహిరంగ ఉరిశిక్ష అమలు చేసే తీర్మానాన్ని పాకిస్తాన్ పార్లమెంట్ శుక్రవారం ఆమోదించింది. దేశంలో చిన్నారులపై పెరుగుతున్న హత్యాచారాలను నియంత్రించేందుకే ఈ తీర్మానాన్ని తీసుకొస్తున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మొహమ్మద్ ఖాన్ చెప్పారు. హత్యాచారం చేసే వారికి కేవలం ఉరి సరిపోదని, వారికి బహిరంగ ఉరి వేయాల్సిందేనని తీర్మానం ప్రవేశపెడుతూ ఆయన చెప్పారు. ఈ తీర్మానం మెజారిటీ ఓట్లతో పాసయింది. అయితే దీనిపై పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ మాత్రం పెదవి విరిచింది. ఈ చర్య ఐక్యరాజ్యసమితి నియమనిబంధనలను ఉల్లంఘించడమేనని చెప్పింది. ఈ చర్య నేరాలను తగ్గించదని చెప్పింది. ఈ తీర్మానాన్ని ప్రభుత్వంలోని సైన్స్ శాఖ మంత్రి ఫవాద్ చౌధరి, మానవ హక్కుల శాఖ మంత్రి షిరీన్ మజారిలు ఖండించారు.

## 'నిర్భయ' కేసులో కేంద్రానికి నిరాశ

- దోషులకు నోటీసులివ్వాలన్న పిటిషన్‌కు సుప్రీం తిరస్కరణ
- మళ్లీ డెత్ వారంట్లు ఇవ్వాలన్న ఢిల్లీ ప్రభుత్వ వినతిని తోసిపుచ్చిన ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు తాత్కాలికంగా నిరాశ మిగిలింది. నిర్భయ కేసులో దోషులందరినీ ఒకేసారి ఉరితీయాలనీ, న్యాయపరమైన అవకాశాలన్నింటినీ వినియోగించుకోవడానికి వారికి ఢిల్లీ హైకోర్టు గడువివ్వడాన్ని సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఖైదీల ఉరితీతపై స్టేకు వ్యతిరేకంగా నోటీసులు జారీ చేయడానికి విముఖత వ్యక్తం చేసింది. దోషులకు నోటీసులు ఇవ్వాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనతో జస్టిస్ భానుమతి జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఏఎస్.బోపన్నలతో కూడిన ధర్మాసనం ఏకీభవించలేదు. అది మరింత జాప్యానికి దారితీస్తుందని, దీనిపై 11వ తేదీన విచారిస్తామని తెలిపింది. అయితే ఉరిశిక్ష అమలులో జాప్యంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దేశం సహనాన్ని పరీక్షించింది చాలుననీ, ఇకపై వారిని ఉరితీసేందుకు అనుమతించాలనీ కోరారు. అయిదేళ్లుగా నిర్భయ దోషుల్లో ఒకరైన పవన్ క్షమాభిక్ష అర్జీ పెట్టుకోకపోగా ముకేశ్ కుమార్ న్యాయపరమైన అన్ని అవకాశాలను వినియోగించుకున్నాడని వెల్లడించారు. అందుకే, ఒకే కేసులో దోషులను విడివిడిగా ఉరితీసే అంశంపై చట్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అయితే ఏ ఒక్కరూ తాము ప్రాణాలతో ఉండేందుకు కావాల్సిన అవకాశాలనూ వినియోగించుకోకుండా అడ్డుకోరాదని ధర్మాసనం తెలిపింది. మరో పరిణామం..నిర్భయ దోషుల ఉరితీతకు కొత్త తేదీలను ఖరారు చేయాలంటూ తీహార్ జైలు అధికారులతోపాటు ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పటియాలా హౌస్ కోర్టు తిరస్కరించింది. 'చట్టపరంగా జీవించే అవకాశం దోషులకు ఉండగా, ఉరితీయడం నేరపూరితమైన పాపం'అని అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణా వ్యాఖ్యానించారు.

## రికార్డుల నుంచి ప్రధాని మోదీ మాట తొలగింపు



**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంలోని ఒక పదాన్ని రికార్డుల నుంచి తొలగించారు. 'ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 6.20 నుంచి 6.30 గంటల మధ్య జరిగిన కార్యకలాపాల్లోని కొంత భాగాన్ని రికార్డుల నుంచి తొలగించాలని చైర్మన్ ఆదేశించారు' అని రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటించింది. రోజువారీ విధుల్లో భాగంగా రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్యానాయుడు ప్రతీరోజు సభ ముగిసిన తరువాత.. ఆ రోజు ప్రసంగాల్లో రికార్డుల నుంచి తొలగించాల్సిన పదాలను గుర్తించి, వాటిని రికార్డుల నుంచి తొలగించాలని ఆదేశిస్తుంటారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియనే అని అధికారులు తెలిపారు. అయితే, ప్రధాని మోదీ ప్రసంగంలోని పదాలను తొలగించడం అసాధారణమేనన్నారు. జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)ను సమర్థిస్తూ ఆవేశంగా మాట్లాడుతున్న సందర్భంగా ప్రధాని ఆ పదం ఉపయోగించారు. కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ ప్రసంగంలోని ఒక పదాన్ని కూడా తొలగించాలని చైర్మన్ ఆదేశించారన్నారు.

## శాంతి, అహింసల విజయం

- బోడో ఒప్పందంపై ప్రధాని మోదీ వ్యాఖ్య
- సీఏఏ ఆందోళనల అనంతరం తొలిసారి అస్సాంకి మోదీ



**కోక్రాజర్:** బోడో ఒప్పందం ద్వారా శాంతి, అహింస విజయం సాధించాయనీ అది ప్రజల వల్లే సాధ్యమైందనీ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బోడో శాంతి ఒప్పందం 21వ శతాబ్దంలో అస్సాం సహా మొత్తం ఈశాన్య ప్రాంతానికే ఒక నూతన ప్రారంభం అని మోదీ అన్నారు. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఈ ప్రాంతాభివృద్ధికి తోడ్పడుతుందని మోదీ తెలిపారు. అస్సాంలోని కోక్రాఝర్‌లో జరుపుకుంటోన్న బోడో శాంతి ఒప్పంద ఉత్సవాలకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ ''రాష్ట్రంలో శాశ్వత శాంతి ఉదయించింది''అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల శాంతి, అభివృద్ధి కోసం కలిసిపనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అస్సాంలోని బోడోల్యాండ్ ఉద్యమ సంస్థలతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందం రాష్ట్రంలో శాశ్వత శాంతికి పునాదులు వేస్తుందన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. 'తిరిగి హింసను ఆమోదించేది లేదు'అని మోదీ స్పష్టం చేశారు. భారత పౌరసత్వ సవరణ చట్టంపై వెల్లువెత్తిన ఆందోళనల అనంతరం మోదీ అస్సాంలోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## అల్ కాయిదా టాప్ లీడర్ రిమీ హతం

### యెమెన్‌లో తమ దళాలు చంపేశాయన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్:** యెమెన్‌లో అమెరికా భద్రతా దళాలు జరిపిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో అల్ కాయిదా ఇన్ అరేబియన్ పెనిన్సులా (ఏక్యూఏపీ) కీలక నేత ఖాసిం అల్ రిమీ (46) హతమయ్యాడు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ధ్రువీకరించారు. రిమీ మరణంతో అరేబియన్ ద్వీపకల్పంలో అల్ కాయిదా మరింత బలహీనపడుతుందని, దీంతో జాతీయ భద్రతకు ఉగ్రవాద గ్రూపుల నుంచి ముప్పు తప్పుతుందని పేర్కొన్నారు. తన ఆదేశాల మేరకు యెమెన్‌లోని అమెరికా దళాలు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ జరిపినట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఈ ఆపరేషన్ ఎప్పుడు, ఎలా నిర్వహించారో వెల్లడించలేదు. రిమీ 1990ల్లో అల్‌కాయిదాలో చేరాడని, అఫ్గానిస్తాన్‌లో ఒసామా బిన్ లాడెన్ కోసం పని చేశాడని ట్రంప్ తెలిపారు. రిమీ నేతృత్వంలో అల్‌కాయిదా ఇన్ అరేబియన్ పెనిన్సులా (ఏక్యూఏపీ) గ్రూపు యెమెన్‌లోని సాధారణ పౌరులపై హింసాకాండ జరిపిందని పేర్కొన్నారు. రిమీ మరణంతో అమెరికా ఆశలు, ఆశయాలు భద్రంగా ఉన్నాయన్నారు. అమెరికాకు హాని తలపెట్టాలని చూసే ఉగ్రవాదులను ఏరిపారేసి అమెరికన్ పౌరులను కాపాడుకుంటామన్నారు. కాగా, డిసెంబర్ 6న ఫ్లోరిడాలోని అమెరికా నావల్ బేస్‌లో జరిగిన కాల్పులకు రిమీ నేతృత్వంలోని గ్రూపు తమదే బాధ్యత అని ప్రకటించింది. ఈ ఘటనలో ఓ సౌదీ వాయుసేన అధికారి ముగ్గురు అమెరికా నావికులను చంపాడు. రిమీకి సంబంధించిన సమాచారం ఇచ్చినవారికి కోటి డాలర్లు (10 మిలియన్ డాలర్లు) ఇస్తామని అమెరికా గతంలో ప్రకటించింది. అల్‌కాయిదాకు అల్ జవహరి వారసుడు రిమీ అనుకుంటారు. గత కొన్ని నెలల్లో అమెరికా చేపట్టిన మూడో పెద్ద ఆపరేషన్ ఇది. గతేడాది అక్టోబర్‌లో ఐసిస్ నేత బగ్దాదీని, ఈ ఏడాది జనవరిలో ఇరానియన్ జనరల్ సులేమానీని అమెరికా దళాలు హతం చేశాయి.

# ఆగని కరోనా మరణాలు

- 637కి పెరిగిన మృతులు; గురువారం ఒక్కరోజే 73 మరణాలు
- వైరస్‌పై 'పీపుల్స్ వార్' ప్రారంభించామన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- వైరస్‌పై ముందే హెచ్చరించిన డాక్టర్ మృతిపై ఆందోళనలు



దక్షిణ కొరియాలోని ఓ చర్చిలో సామూహిక వివాహ వేడుకలో మాస్కులు ధరించి ఉంగరాలు మార్చుకుంటున్న వేలాది కొత్త జంటలు

**బీజింగ్:** చైనాలో కరోనా వైరస్ ధాటికి మరణిస్తున్న వారి సంఖ్య గురువారానికి మరింత పెరిగింది. ఈ వైరస్ బారిన పడి గురువారం నాటికి మొత్తం 637 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 73 మంది గురువారం రోజే చనిపోయారు. వారిలో వైరస్‌కు కేంద్ర బిందువుగా మారిన వుహాన్ పట్టణం ఉన్న హ్యుబయి ప్రావిన్స్‌లోనే 69 మంది మృతి చెందారు. అలాగే, చైనా వ్యాప్తంగా వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిన వారి సంఖ్య 31 వేలకు చేరుకున్నట్లు చైనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. వైరస్ బారినపడి చికిత్స ద్వారా కోలుకున్న 1,540 మందిని డిశ్చార్జ్ చేశామన్నారు. కాగా, జపాన్‌లో నౌకాశ్రయంలోనే నిలువరించిన ఓ నౌకలో 41 మందికి వైరస్ సోకినట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, తొలిసారి కరోనా వైరస్ ఉనికిని గుర్తించి అందరినీ హెచ్చరించిన డాక్టర్ లీ వెన్లియాంగ్ మరణంపై చైనా శుక్రవారం ఆవేదన వ్యక్తం చేసింది. డాక్టర్ లీ మరణంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగిన నేపథ్యంలో చైనా ఉన్నతస్థాయి బృందం ఒకదాన్ని విచారణ కోసం వుహాన్‌కు పంపింది. ప్రస్తుతం భారత్ సహా 27 దేశాలకు ఈ వైరస్ వ్యాపించింది. భారత్‌లో మూడు సహా చైనాయేతర దేశాల్లో మొత్తం 220 కేసులు నమోదయ్యాయి. మరోవైపు, కరోనా సాకుగా చూపుతూ పలు విమానయాన సంస్థలు చైనాకు విమానాలను రద్దు చేయడంపై ఆ దేశం ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్‌కు ఫిర్యాదు చేసింది. షాంఘైకి చెందిన టీఎంఐరాబ్ సంస్థ తయారు చేసిన 30 ప్రత్యేక రోబోలను ఆసుపత్రుల్లో మందులు చల్లడంతోపాటు వార్డుల్లో ఆహారం, మందుల సరఫరాకు ఉపయోగిస్తున్నారు. చైనాలోని వుహాన్ కేంద్రంగా పలు దేశాలకు వ్యాపించిన కరోనా వైరస్‌ను కట్టడి చేసే ప్రయత్నాల్లో రోబో సేవలను ఉపయోగించుకుంటున్నారు.

### పంగోలిన్‌లు కారణమా..?

కరోనా వైరస్ వ్యాప్తికి పంగోలిన్ జంతువులు కారణమై ఉండవచ్చునని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ జంతువుల మాంసాన్ని చైనీస్ వైద్యంలో విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. ఈ జంతువుకు సోకిన ఓ వైరస్..ప్రస్తుతం మనుషులకు సోకిన కరోనా వైరస్ జన్యుక్రమాలకు 99 శాతం సారూప్యత ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

### నౌకాశ్రయాల్లోనూ కరోనా స్క్రీనింగ్

**న్యూఢిల్లీ:** కరోనా వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో దేశంలోని మొత్తం 12 ప్రధాన నౌకాశ్రయాల్లో థర్మల్ స్క్రీనింగ్ చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అనుమానితులను ప్రత్యేక గదుల్లో ఉంచి చికిత్స అందించడం తక్షణమే ప్రారంభించాలని అన్ని నౌకాశ్రయాలను ఆదేశించామని తెలిపింది. చైనా నుంచి భారత్ రావాలనుకుంటున్న వారి వీసాలను రద్దు చేశామని రాజ్యసభలో ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. కాగా, వైరస్ కారణంగా జపాన్ తీరంలో నిలువరించిన నౌకలో భారతీయ సిబ్బంది, ప్రయాణికులు ఉన్నారని విదేశాంగ శాఖ తెలిపింది. కొద్ది రోజులుగా కేరళలో కరోనా వైరస్ కొత్త కేసులు వెలుగుచూడకపోవడంతో విపత్తు హెచ్చరికను ఆ రాష్ట్రం శుక్రవారం ఎత్తేసింది.

### ట్రంప్, జిన్‌పింగ్ చర్చ

కరోనా విజృంభణ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కరోనా రోగుల చికిత్సకు, వైరస్ కట్టడికి 'పీపుల్స్‌వార్'ను ప్రారంభించామని ట్రంప్‌నకు వివరించారు. ఏదైనా ఒక సమస్యపై ప్రజల సహకారంతో విస్తృత, దీర్ఘకాలం పోరు అనే ఉద్దేశంతో 'పీపుల్స్ వార్' అనే సైద్ధాంతిక భావనను చైనా కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుడు మావో తొలిసారి ఉపయోగించారు. కాగా, కరోనా వైరస్‌పై పోరులో అమెరికా సహకరించడంలేదని చైనా విదేశాంగ శాఖ ఆరోపించింది.

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 8

# ట్రంప్ విజయగర్వం

ముందే ఊహించినట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై సెనేట్‌లో అభిశంసన తీర్మానం గురువారం వీగిపోయింది. మరో తొమ్మిది నెలల్లో అధ్యక్ష పదవికి జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున రెండో దఫా పోటీ చేయబోతున్న ట్రంప్‌కు ఇది ముందస్తు విజయమని చెప్పాలి. దాదాపు రెండున్నర శతాబ్దాల అమెరికా చరిత్రలో ఇప్పటికి ముగ్గురు అధ్యక్షులు అభిశంసనను ఎదుర్కొనవలసి రాగా, ఆ ముగ్గురిలో ఎవరికీ రెండోసారి పోటీచేసే ఛాన్స్ రాలేదు. ఇప్పటికే ట్రంప్ అనుకూలురు, వ్యతిరేకులుగా నిట్టనిలువున చీలిపోయిన అమెరికా సమాజం వచ్చే నవంబర్‌లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల సమయానికల్లా మరిన్ని వైపరీత్యాలు చవి చూడాల్సివస్తుందని తీర్మానం వీగిపోయాక ట్రంప్ చేసిన ప్రసంగం గమనిస్తే అర్థమవుతుంది. రిపబ్లికన్లను ఉద్దేశించి చేసిన ఆ ప్రసంగం ఆద్యంతమూ ప్రత్యర్థులను పరుష పదజాలంతో దూషించడం, సొంత పార్టీకి చెందిన మహిళా నేతలపై కూడా చవకబారు వ్యాఖ్యలు చేయడం కనబడుతుంది. డెమొక్రాట్ల ఆధిక్యత ఉన్న దిగువ సభ ట్రంప్ అభిశంసనను సమర్థించగా, రిపబ్లికన్లు సెనేట్‌లో తమకున్న ఆధిక్యతతో దాన్ని అడ్డుకోగలిగారు. కనుకనే అమెరికా మీడియా మొత్తం అధ్యక్ష ఎన్నికల ముందు డెమొక్రాట్లు ఇలాంటి వృథా ప్రయాసకు ఎందుకు దిగారని నిలదీసింది. కానీ సెనేట్ విజయాన్ని అత్యంత ఘనమైన విజయంగా ట్రంప్ నమ్మమంటున్నారు. సభలో తమ పార్టీ వారెవరూ జారిపోకుండా ఆయన చూసుకోగలిగారు. ఆ ఒక్క విషయంలోనూ ట్రంప్ సమర్థతను మెచ్చుకోవాలి.

ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు పార్టీలకు అతీతంగా ఓటేయడం అమెరికాలో రివాజు. ఈసారి రిపబ్లికన్లలో మిట్ రోమ్నీ ఒక్కరే ఆ పని చేశారు. ఆయన గతంలో అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ అభ్యర్థిగా ఒబామాపై పోటీచేసి ఓడిపోయారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా తీసుకొచ్చిన అభిశంసన తీర్మానంలో రెండు అంశాలున్నాయి. అందులో ఒకటి అధికార దుర్వినియోగానికి సంబంధించింది కాగా, రెండోది కాంగ్రెస్ అధికారాన్ని ట్రంప్ అడ్డగించారన్నది. రోమ్నీ మొదటి అంశంలో డెమొక్రాట్లతో ఏకీభవించి ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. కానీ రెండో అంశంలో ట్రంప్‌కు అనుకూలంగానే వ్యవహరించారు. అయినా ఆయనను ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల చరిత్రలో ఆయనంత నాసిరకమైన ప్రచారాన్ని ఎవరూ నిర్వహించలేదన్నారు. ఈ విజయంతో ట్రంప్‌కు పట్టపగ్గాల్లేకుండా పోయాయని పార్టీలోని మహిళా ఎంపీలపై ఆయన చేసిన వ్యాఖ్యలు రుజువు చేశాయి. కనీసం వారంతా తన పార్టీవారని, తనకు అనుకూలంగా ఓటేసిన వారన్న ఇంగితజ్ఞానం కూడా ట్రంప్‌కు లేకపోయింది. అరిజోనా ప్రతినిధి డెబీ లెస్కోను పేరుతో మొదలుపెట్టి పలు అసందర్భ వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ ప్రతినిధి ఎలైస్ స్టెఫానిక్‌ను 'ఆమె అందంగా వుంటారని తెలుసు. కానీ నోరు తెరిచినప్పుడు కూడా అంతే అందంగా వుంటారని తెలియలేదు. నిజానికి ఆమె మాటలతో వారిని చంపేశారు' అని నోరు పారేసుకున్నారు. మహిళలు మాత్రమే కాదు...నల్లజాతి ఎంపీలన్నా ఆయనకు చులకనే. జిమ్ జోర్డాన్‌ను 'ఆయన తన శరీరాన్ని చూసుకుని పొంగిపోతారనుకుంటాను. ముఖ్యంగా తన చెవులు చూసుకుని...' అంటూ అవమానకరంగా మాట్లాడారు. ట్రంప్ వ్యక్తిగతంగా ఎలాంటివారో కొంత వెనక్కెళ్లి చూస్తే అర్థమవుతుంది. కొందరు మహిళలపై చేసిన లైంగిక దాడుల గురించి ఆయన గొప్పగా చెప్పుకుంటున్న టేప్ 2016 అధ్యక్ష ఎన్నికల ముందు 'వాషింగ్టన్ పోస్ట్' బయటపెట్టినప్పుడు 'ఇది నా జీవితంలో చెడ్డరోజు. ఎందుకంటే అధ్యక్షుడిగా నా అవకాశాలను ఇది ఇబ్బందుల్లో పడేసింది' అన్నారు. అంటే ఆయనకు చేసిన పనులపై పశ్చాత్తాపం లేదు. అది అధ్యక్ష పదవికి ఎసరు పెడుతుందన్న భయం ఒక్కటే ఉంది. అభిశంసన అంశాల్లో అధికార దుర్వినియోగం కూడా ఉందన్న సంగతిని కూడా మరిచి, 'అప్పుడే అయిపోలేదు. ప్రతిభావంతులైన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. డెమొక్రాటిక్ పార్టీ నాయకుడు జోయ్ బిడెన్‌కు ముమ్ముందు ఏం జరుగుతుందో చూడండి' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ తీర్మానం వల్ల ట్రంప్ వైదొలగవలసి వస్తుందని డెమొక్రాట్లు కూడా అనుకోలేదు. అమెరికా ప్రజలు కూడా అనుకోలేదు. కానీ ఆయనలో పరివర్తన వస్తుందని, ఇకపై బాధ్యతతో, జవాబుదారీతనంతో వ్యవహరిస్తారని ఆశించారు. అయితే అది జరగకపోగా, అందుకు విరుద్ధంగా ఆయన మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉన్నదని పార్టీలో సహ మహిళా సభ్యులపైనా, ఇతరులపైనా, ప్రత్యర్థులపైనా ఆయన చేసిన వ్యాఖ్యలు రుజువు చేస్తున్నాయి. గతంలో అభిశంసన తీర్మానాలను ఎదుర్కొన్న అధ్యక్షులు నిస్సహాయతలో పడేవారు. వారు సైతం చట్టాలకూ, రాజ్యాంగానికి లోబడి పనిచేయక తప్పదన్న అభిప్రాయం అమెరికా పౌరుల్లో కలిగేది. కానీ ట్రంప్ వాలకం చూస్తే దేశ పౌరులకు ఆయన సూపర్‌మాన్ అనిపిస్తుంది. తాను అన్నిటికీ అతీతుడినన్న భావన, ప్రత్యర్థులు తనను ఏం చేయలేరన్న భరోసా ఆయనలో కనిపిస్తుంది. ఇది ప్రమాదకరమైనది.

ట్రంప్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన రికార్డుల్ని వైట్ హౌస్ విడుదల చేయాలా లేదా, అక్కడి సిబ్బంది సాక్ష్యాలను సేకరించవచ్చా లేదా అన్న అంశాలపై న్యాయస్థానాలు విచారించి నిర్ణయించేలోగానే డెమొక్రాట్లు అభిశంసనపై ఎక్కడ లేని తొందరా ప్రదర్శించారు. తీర్మానం ఓడినా, రాజకీయంగా ట్రంప్‌ను బట్టబయలు చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో అది తమకు లాభిస్తుందని భావించారు. ఇది ట్రంప్‌ను కాపాడటానికి సంబంధించిన సమస్య కాదని, మొత్తంగా అధ్యక్ష పదవిలో ఉండేవారి పరిమితుల్ని, జవాబుదారీతనాన్ని నిర్ణయించేదని రిపబ్లికన్లు సైతం అనుకోలేదు. ట్రంప్ వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేయలేని సెనేట్ నిస్సహాయస్థితి గమనించాక, ముందుముందు వచ్చే డెమొక్రాటిక్ అధ్యక్షుడు సైతం అదే మాదిరి వ్యవహరించబోరన్న గ్యారెంటీ ఏమీ లేదు. ఇది అమెరికా నమ్ముకున్న ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు తెస్తుంది.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి శు.చతుర్దశి ప.3.20 వరకు, తదుపరి
పౌర్ణమి, నక్షత్రం పుష్యమి రా.10.00 వరకు
తదుపరి ఆశ్లేషవర్జ్యం ఉ.6.31 నుంచి 8.04 వరకు
దుర్ముహూర్తం ఉ.6.33 నుంచి 8.03 వరకు
అమృతఘడియలు... ప.3.44 నుంచి 4.33 వరకు.

**సూర్యోదయం :** 6.34
**సూర్యాస్తమయం:** 5.54
**రాహుకాలం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# పతన ఆర్థిక వ్యవస్థ పట్టదా?

విశ్లేషణ



పెంటపాటి పుల్లారావు

**2020 బడ్జెట్ ఏమంత పెద్దగా కానీ, అసాధారణంగా గానీ లేదన్న సాధారణ భావమే మెల్లమెల్లగా ఏర్పడుతోంది. ఈ బడ్జెట్‌లోనూ కీలకమైన నిర్ణయాలేవీ తీసుకోలేదు. అదొక షరా మామూలు బడ్జెట్‌గానే మిగిలింది. నిర్మలా సీతారామన్ సమర్థతలను అంచనా వేయడానికి ఇది సమయం కాదు. అరుణ్ జైట్లీ తొలి అయిదేళ్లు ఆర్థికమంత్రిగా ఉండేవారు. కాని తనకు పేరు తెచ్చిపెట్టే గొప్ప అవకాశాన్ని ఆయన జారవిడుచుకున్నారు. కానీ డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప వ్యక్తి సరసన నిలబడేందుకు, అలాంటి పేరు తెచ్చుకునేందుకు ఆర్థికమంత్రి ముందు ఇప్పుడు మంచి అవకాశం ఉంది. పైగా అవకాశాలు మళ్లీ మళ్లీ రావు. ఈ కోణంలో చూస్తే 2020 బడ్జెట్ కూడా అలాంటి అవకాశాన్ని పోగొట్టుకున్న బడ్జెట్ అనే చెప్పాల్సి ఉంటుంది.**

సుప్రసిద్ధ బ్రిటన్ ప్రధానమంత్రి హెరాల్డ్ విల్సన్ 50 ఏళ్ల క్రితం.. రాజకీయాల్లో ఒక వారం రోజులు అంటే చాలా ఎక్కువ కాలం అని పేర్కొన్నారు. రాజకీయాల్లో వారం రోజులే అధికం అనుకుంటే బడ్జెట్ విషయంలో వారం రోజులంటే మరీ ఎక్కువ కాలం అనే చెప్పాలి. ఫిబ్రవరి1న కేంద్ర బడ్జెట్‌ని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించినప్పుడు చాలా మంది తక్షణ స్పందనలు వ్యక్తీకరించారు. కానీ ఫిబ్రవరి 1న మనం చేసిన చాలా సరళ నిర్ధారణల విషయంలో వారం రోజుల తర్వాత, అనిశ్చితి నెలకొంది. దీంతో బడ్జెట్‌పై రెండో అభిప్రాయం ప్రకటించడం మొదలెడుతున్నాం.

ఒకవిషయం మాత్రం మారలేదు. బడ్జెట్ ప్రసంగాలకు సంబంధించిన పాత రికార్డులన్నింటినీ నిర్మల బద్దలు గొట్టేశారు. ఆర్థిక మంత్రి 2 గంటల 45 నిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగం చేస్తున్నప్పుడు కొంతమంది మంత్రులు నిద్రపోయారు కూడా. ఇప్పుడు సమస్య ఏమిటంటే అంత సుదీర్ఘ ప్రయత్నంలో విషయ గాఢత ఏమైనా ఉందా అన్నదే.

అంత సుదీర్ఘ ప్రసంగం తర్వాత ఏర్పడిన ఉల్లాస స్థితిలో మనం ప్రతి విషయంలోనూ ముఖవిలువను మాత్రమే తీసుకుంటాం. కానీ కొంత సమయం తర్వాత వాస్తవంగా బడ్జెట్ పూర్తి భిన్నంగా ఉందని గ్రహిస్తాం. 2020 బడ్జెట్‌లో ఏమంత పెద్దగా కానీ, అసాధారణంగా గానీ లేదన్న సాధారణ భావమే మెల్లమెల్లగా ఏర్పడుతోంది. కీలకమైన నిర్ణయాలేవీ తీసుకోలేదు. అదొక షరా మామూలు బడ్జెట్‌గానే మిగిలింది. ఆర్థికమంత్రిని కాస్త సంప్రదాయకంగానే ఉండాలని, ఆర్థిక వ్యవస్థ కుంగుబాటు సహజంగానే దాని ముగింపును చేరుకునేంతవరకు (అంటే మళ్లీ పుంజుకోవడం ప్రారంభమయ్యేంతవరకు) వేచి చూడాలని ఎవరో ఆమెకు సలహా ఇచ్చినట్లుగా కనిపిస్తోంది.

ఆర్థిక వ్యవస్థ పతనబాట పట్టాక కొంతకాలం శిక్షను అనుభవించాక, సహజంగానే అది కోలుకుంటుందని ఆర్థిక శాస్త్రం మనకు పాఠం చెబుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ తన అత్యంత పతనస్థాయికి చేరుకుంది కాబట్టి ఆర్థిక వ్యవస్థ తిరిగి వృద్ధిబాటను చేపడుతుందనే భావన ఉంటోంది. మోదీ ప్రభుత్వ ఆశ కూడా అదేననిపిస్తోంది. 2019 అక్టోబర్ నుంచే మీడియా, విభిన్న భావాలు కలిగిన ఆర్థికవేత్తలు, వ్యాపారవేత్తలు కూడా 2020 బడ్జెట్ బిగ్ బ్యాంగ్ బడ్జెట్‌గా ఉంటుందని, ఆర్థిక వ్యవస్థకు అధిక ద్రవ్యం వచ్చి చేరుతుందని, భారీ సంక్షేమ పథకాలు మొదలై ప్రజల చేతుల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని కలలు కన్నారు. కానీ వీటిలో ఏ ఒక్కటీ తాజా బడ్జెట్‌లో కనిపించలేదు.

ఆర్థిక వ్యవస్థ పతనమైనప్పుడు దాంట్లోకి భారీగా డబ్బును పంపించడం ద్వారా లేక డబ్బును అధికంగా ముద్రించడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించాలని ఆర్థిక సిద్ధాంతం తెలుపుతోంది. ఇది వినియోగదారుల్లో డిమాండును సృష్టించి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడుపుతుంది. కానీ 2016 నవంబర్ 8న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన పెద్దనోట్ల రద్దుతో ప్రజల చేతుల్లోని డబ్బు, సహజసిద్ధమైన వారి డిమాండ్ శక్తి మటుమాయమైపోయింది. లక్షలాదిమంది తమ ఉద్యోగాలు కోల్పోయారు, చిన్నచిన్న వ్యాపారాలు మూసివేతకు గురయ్యాయి. రైతులు పండించిన పంటకు తగిన డబ్బులు రాలేదు. దేశవ్యాప్తంగా ఆర్థిక కల్లోలం చెలరేగింది, ఆరోజు చమురు ధరలు తగ్గిన కారణంగానే ఆర్థిక వ్యవస్థ తనకు తానుగా కోలుకుని తీవ్ర కుంగుబాటు బారినుంచి తప్పించుకుంది. కానీ ఆనాటి పెద్దనోట్ల రద్దు దుష్ఫలితాలు ఇప్పటికీ దేశం అనుభవిస్తూనే ఉంది.



పైగా జీడీపీ సాధారణ వృద్ధిరేటు 10 శాతంగా ఉంటుందని ఆర్థిక మంత్రి సెలవిచ్చారు. అంటే జీడీపీ వృద్ధి ప్లస్ ద్రవ్యోల్బణ రేటు అనీ ఆమె ప్రకటన అర్థం తప్ప జీడీపీ వాస్తవ వృద్ధి కాదని అర్థం. 2016 నవంబర్ 8 నాటి పెద్దనోట్ల రద్దు ఫలితాలు దీర్ఘకాలం ఉంటాయి. చాలామంది ప్రజల, ఆర్థిక వేత్తల అంచనాలను ఈ బడ్జెట్ అందుకోనప్పటికీ బడ్జెట్‌లోని కొన్ని సానుకూల అంశాలను ఎత్తిపట్టాల్సి ఉంటుంది.

1. పన్ను వివాదాల కేసులు: దేశంలో 4.86 లక్షల పన్ను వివాదాలపై కేసులు కొనసాగుతున్నాయని ఆర్థికమంత్రి చెప్పారు. అంటే ఈ వివాదాల్లో దాదాపు రూ. 15 లక్షల కోట్లు ఇరుక్కుపోయి ఉన్నాయి. ఇలా కేసుల రూపంలో స్తంభనకు గురైన భారీ సంపదను తప్పకుండా వెలికి తీసుకురావాలని ఆమె చెప్పారు. పన్ను కేసులు పరిష్కారమైతే ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వం ఆమేరకు లాభపడతారు. భారీగా ఇరుక్కుపోయిన ఈ ఆదాయాన్ని వెలికి తీసుకురావడానికి అత్యవసర చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆర్థిక అవార్డులు, వివాదాలతో కూడిన కేసును పరిష్కరించాలనుకుంటే మరిన్ని ఆరోపణలు, న్యాయమూర్తుల పేర్లకు మరకలంటించడం చేస్తారని దానికి బదులుగా ప్రభుత్వం ఇలాంటి కేసుల్లో 50 శాతం రాయితీని కల్పించే విషయం ఆలోచిస్తోందని ఆర్థికమంత్రి చెప్పారు.

2. భారతీయ విద్యాసంస్థల్లో విదేశీ మదుపులను అనుమతించడం చాలా సానుకూలతను కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా భారతీయ విశ్వవిద్యాలయాల నాణ్యతను ఇది పెంచుతుంది. దీనివల్ల భారతదేశంలో విదేశీ విద్యార్థులు కూడా చదువుకునే అవకాశాలను పెంచుతుంది. ఈరోజు అమెరికాలో 10 లక్షల మంది, చైనాలో 5 లక్షలమంది విదేశీ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ రంగంలో భారత్ కూడా పోటీపడాల్సిన అవసరముంది.

3. ప్రభుత్వ ఆసుపత్రులతో వైద్య కళాశాలలను అనుసంధానించడం. ప్రస్తుతం ప్రతి వైద్య కళాశాలకు కనీసం 750 పడకల పెద్ద ఆసుపత్రి అనుసంధానమై ఉండాలి. ప్రైవేట్ మెడికల్ కాలేజీలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులతో అనుసంధానం కావాలని తాజా బడ్జెట్ పేర్కొంది. దీనికి ఆర్థిక సహాయం కూడా అవసరం. దేశంలో మరిన్ని వైద్య కళాశాలల అవసరం ఉంది కాబట్టి ఈ చర్య తప్పక దోహదం చేస్తుంది.

4. ఆరోగ్యరంగానికి గరిష్టంగా నిధులు పెంచారు. గత సంవత్సరం ఈ రంగానికి రూ. 65,000 కోట్లు కేటాయించగా ఈ ఏడాది దాన్ని రూ. 67,500 కోట్లకు పెంచారు. ప్రజల వినియోగ డిమాండును ఇది తప్పకుండా పెంచుతుంది.

5. భారతదేశంలో బహిరంగ మలవిసర్జన ప్రపంచంలోనే అత్యధికం కాబట్టి పారిశుధ్య కల్పన అనేది దేశంలో అత్యంత ప్రధానమైన సంక్షేమ చర్య, ఆరోగ్య పథకంగా ఉంటోంది. ఈ రంగానికి తాజా బడ్జెట్‌లో గణనీయంగా నిధులు పెంచారు. గతేడాది పారిశుధ్యానికి రూ. 9,600 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 12,300 కోట్లకు పెంచారు. అంటే 28 శాతం పెరుగుదల అన్నమాట. ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలుచేసి పబ్లిక్ టాయ్‌లెట్లను అధికంగా నిర్మించాల్సిన అవసరముంది.

గత ఆరు బడ్జెట్ల ద్వారా నరేంద్రమోదీ చాలా ఆశాభంగం కలిగించారు. మోదీ విదేశీ వ్యవహారాలు, రక్షణ, అంతర్గత భద్రత, స్వచ్ఛభారత్ వంటి అనేక పథకాలను సమర్థవంతంగా నిర్వహించారు. కానీ భారత ఆర్థిక వ్యవస్థ పతనమవుతున్నందున మరింత మంచి బడ్జెట్‌ను దేశం కోరుకుంటోంది. కాని తాజా బడ్జెట్ కేటాయింపులు చూస్తే జరుగుతున్న పరిణామాలను అలాగే కొనసాగనిద్దాం అనే ధోరణే కనబడుతోంది కానీ నది మధ్యలో ఉన్న బోటును షేక్ చేసే దృక్పథాన్ని ఇది ప్రదర్శించడం లేదు.

ప్రస్తుత బడ్జెట్ పరిస్థితి నాకు ఫ్రెంచ్ రచయిత జీన్ అల్ఫాన్స్ కార్ 130 ఏళ్ల క్రితం చెప్పిన మాటలను గుర్తుకు తెస్తోంది. పరిస్థితులు ఎంత అధికంగా మారితే, అంత ఎక్కువగా అవి అలాగే కొనసాగుతుంటాయి అని తన వ్యాఖ్య. దీనికనుగుణంగానే గత ఆరు బడ్జెట్లు యధావిధిగా కొనసాగుతూ వచ్చాయి. మార్పు అన్నదే కనిపించలేదు. ఈ ఆరేళ్లలో ఏమీ జరగని నేపథ్యంలో.. త్వరలోగానీ, తర్వాత కానీ అలాంటి అద్భుతమైన బడ్జెట్ ఏనాటికైనా వస్తుందా అనే సమస్య తలెత్తక మానదు.

అరుణ్ జైట్లీ తొలి అయిదేళ్లు ఆర్థికమంత్రిగా ఉండేవారు. కాని తనకు పేరు తెచ్చిపెట్టే గొప్ప అవకాశాన్ని ఆయన జారవిడుచుకున్నారు. నిర్మలా సీతారామన్ సమర్థతలను అంచనా వేయడానికి ఇది సమయం కాదు. కానీ డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప వ్యక్తి సరసన నిలబడేందుకు, అలాంటి పేరు తెచ్చుకునేందుకు ఆమెముందు ఇప్పుడు మంచి అవకాశం ఉంది. పైగా అవకాశాలు మళ్లీ మళ్లీ రావు. ఈ కోణంలో చూస్తే 2020 బడ్జెట్ కూడా అలాంటి అవకాశాన్ని పోగొట్టుకున్న బడ్జెట్ అని కూడా చెప్పాల్సి ఉంటుంది.

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా


### సాధారణం



"కశ్మీర్‌లో ఏం జరగబోతోందో తనకు తెలీదనీ, కానీ జరగబోయేదాంతో చాలామంది అసంతృప్తి చెందవచ్చనీ, అయినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, సంయమనం పాటించాలని ఆరు నెలల క్రితం తన చివరి ట్వీట్‌లో ఒమర్ అబ్దుల్లా జమ్మూకశ్మీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సెక్షన్ 107 కింద ఒమర్ నిర్బంధం ముగిసే సందర్భంలో అమానుషమైన ప్రజా భద్రతా చట్టాన్ని (పీఎస్ఏ) ప్రయోగించి మాజీ ముఖ్యమంత్రులైన ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను మరింత కాలం నిర్బంధంలో ఉంచుతోంది. ఇక సాధారణ స్థితి ఎక్కడుంది?"

– నిధి రజ్దాన్, జర్నలిస్ట్

### ఇద్దరూ



"జైపూర్‌లో కశ్మీరీ యువకుడిపై మూకదాడికి పాల్పడినవారిలో ముస్లింలు కూడా ఉన్నారని తెలిసి అసహ్యం వేసింది. కశ్మీరీ యువకుడిని హతమార్చిన హిందువులైనా, ముస్లింలు అయినా ఉగ్రవాదులే. ఒక భారతీయ ముస్లింగా నేను సిగ్గుపడుతున్నా. కశ్మీరీ ప్రజలారా... నన్ను క్షమించండి"

– ఇరేనా అక్బర్, కళాకారిణి

### ఆటంకం



"నేను పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకోవడానికే కావాలని ఆటంకాలు కల్పించారు. నిరుద్యోగాన్ని ఎలా ఎదుర్కోవాలో ప్రధాని నరేంద్ర మోదీకి అవగాహన లేదని దేశంలోని యువతకు స్పష్టంగా అర్థమయ్యింది. ఆయన్ని కాపాడటానికి బీజేపీ పార్లమెంట్‌లో అంతరాయం కలిగిస్తూ చర్చను అడ్డుకుంటోంది"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత


### ఎంతకాలం?



"మెహబూబా ముఫ్తీకి కొంతసేపటి క్రితమే పీఎస్ఏ ఆర్డర్లు అందాయి. తొమ్మిదేళ్ల పసివాళ్లపై రాజద్రోహం మోపే నిరంకుశమైన ఈ ప్రభుత్వం జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఇద్దరిపై ఈ క్రూరమైన చట్టాన్ని అమలు చేస్తారని ఊహించినదే. ఈ దేశం దేనికోసం నిలబడిందో దాన్ని అపవిత్రం చేస్తుంటే మనం ఇంకా ఎంతకాలం ప్రేక్షకపాత్ర పోషిస్తాం"

– ఇల్తిజా, ముఫ్తీ కుమార్తె

### అభూతకల్పన



"ఎంత పెద్ద అబద్ధమైనా రాయిస్తాడు చంద్రబాబు నాయుడు. అన్నింటికి ఆయన తెగబడిపోయాడు. ఎల్లో మీడియా వార్తలు ప్రజలు నమ్మడం లేదని రాయిటర్ ఏజెన్సీ పేరుతో కియా వెళ్లిపోతుందని అభూత కల్పన సృష్టించాడు. ప్రజా క్షేత్రంలో తేల్చుకునే దమ్ములేక ఇలాంటి పిరికిపంద పనులకు పాల్పడుతున్నాడు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### ఏం వార్త



"ఒమర్, ముఫ్తీల ఆరునెలల ముందస్తు నిర్బంధం ముగుస్తోంది. కానీ, ఇప్పుడు వారిని పీఎస్ఏ కింద నిర్బంధిస్తున్నారు. అంటే, రెండేళ్లపాటు విచారణ, ఆరోపణలు లేకుండా నిర్బంధించవచ్చు. ఒమర్ తాత షేక్ అబ్దుల్లా 1978లో ఈ పీఎస్ఏ చట్టాన్ని ప్రవేశపెట్టారు"


– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

# దానవీరులు



శ్రీరమణ

అక్షర తూణీరం



సిరిసంపదలు సృష్టించడం బ్రహ్మ విద్య మాత్రమే కాదు, ఒక గొప్ప కళ. కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కాగానే ఆయన సొంత వ్యవసాయ క్షేత్రంలో సాలుకి ఎకరాకి కోటింజిల్లర ఆదాయం రావడం మొదలు పెట్టింది. ఆదిత్యుని కటాక్ష వీక్షణాలతో శమంతకమణి తునక ఆ క్షేత్రంలో జారిపడిందని సనాతనులు విశ్వసించారు. కాదు, హైబ్రిడ్ క్యాప్సికమ్ అనే బుంగ మిరపకాయలు విరగకాసి తద్వారా కోటికి పడగలెత్తారని చంద్రశేఖరరావు నమ్మినబంట్లు పొలికేకలు పెట్టారు. 'కాదు.. ఇవన్నీ శాస్త్రానికి నిలవవు' అంటూ విషయ పరిజ్ఞానం కలిగిన హేతువాదులు ఇళ్లెక్కి అరిచి మొత్తుకున్నారు. ఏది ఏమైనా వ్యవసాయ క్షేత్రాలకు ఆఖరికి వజ్రాలు పండినా పన్నులేదని ట్యాక్స్‌వాళ్లు తేల్చి చెప్పారు. ఆ మహాపంట, ఆ ఆదాయం వాటి వెనకాల ఉన్న శక్తి యుక్తులు ఏవిటో ఈ రోజుకీ ఆయనకు తప్ప వేరేవరికీ తెలియదు. చిదంబర రహస్యంగానే మిగిలి ఉంది. ఈ శమంతకోపాఖ్యానాన్ని ఇలా ఉంచి మరికొన్ని ఆదాయ వనరుల్ని పరిశీలిద్దాం. ఆనాడు గాంధీగారికి వేసిన సాదా సీదా పూలదండని ఏ బిర్లాగారో వెయ్యి రూపాయలకు వేలంలో పాడి ఉద్యమానికి జమవేసిన సందర్భం ఉంది. కాంగ్రెస్ సభలో నెహ్రూగారి మెళ్లో పడిన నూలు దండని వెయ్యినూట పదహార్లకు సింఘానియాలు సొంతం చేసుకుని పార్టీ నిధికి జమవేశారు. అప్పటి రోజుల్లో పరోక్షంగా అవన్నీ భారి విరాళాలు. ఇప్పుడు కేవలం ఒక ప్లేటు భోజనం. అంతే!

ఈమధ్య వేలంపాటల తాలూకు అపశ్రుతులు పేపర్లకెక్కాయ్. మెట్రోలో జోకులై చిటపటలాడాయ్. మన అగ్రనేతలంతా శ్రమదానాలతో లక్షలకి లక్షలు కుమ్మారని, దాన్ని సొంత పార్టీకి మంచి పనులకి ధారపోసి దానవీరం ప్రదర్శించారని వార్తలొచ్చాయ్. ఒకాయన చిన్న చిన్న బరువులు మోసి అయి దారులకారాలు ప్రజల నుంచి గుంజాడు. కేటీఆర్ స్వయంగా కొన్ని చిన్నా చితక పనులు చేసి లక్షలు ఆర్జించి ప్రజలకి ధారపోసి, చేతికి ఎముక లేదని నిరూపించుకున్నారు. అమ్మాయి కవిత నే తక్కువ తిన్నానా.. ఇదిగో నా కష్టార్జితం అంటూ లక్షలు గుమ్మరించి నుదుటి చెమట తుడుచుకుంది. హరీష్‌రావు పై సంగతి వేసి పెద్దరికంగా మిగిలిపోయారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్మాణాల దగ్గర ఇసుక సిమెంట్, కంకర బొచ్చెలకెత్తుకుని కేసీఆర్ లక్షలకి లక్షలు ఉద్యమ సాదరు ఖర్చులకు లోటు లేకుండా చూశారు. ఇంతవరకు బానే ఉంది. తర్వాత అసలు కథ మొదలైంది. మీ మీ శ్రమదాన ఆదాయాన్నీ లెక్కల్లో చూపించారా? దానికి పద్ధతిగా పన్ను చెల్లింపులు జరిగాయా? చెల్లించని యెడల మీ 'ఈజీ మనీ'పై అపరాధ రుసుంతో సహా ఫలానా ఫలానా నిబంధన కింద పన్నెందుకు వసూలు చేయరాదో చెప్పాలని కేటీఆర్ అని కూడా ఖాతరు చెయ్యకుండా ఐటీవాళ్లు తాఖీదులు జారీ చేశారు.

అసలు ఆదాయపు పన్ను వారికి ఓర్పు, సహనాలు చాలా తక్కువ. హస్తవాసి బావుండి డాక్టర్‌కి పది రూపాయలు అదనంగా వస్తే వాళ్లు సహించలేరు. వాక్శుద్ధి కలిగిన లాయర్‌కి నాల్రూపాయలు వచ్చాయని తెలిస్తే తట్టుకోలేరు. ఆఖరికి ప్రైవేట్ ట్యూషన్ మేష్టర్లని కూడా వదలరు. ఆ మధ్య అపరకర్మల మీద బాగా పిండుకుంటున్నాడని ఓ పంతుల్ని కర్మల రేవులో రెడ్ హ్యాండెడ్‌గా కాటేశారు ఇన్‌కమ్‌ట్యాక్స్ వాళ్లు. గోదాన, భూదాన సువర్ణాది షోడశ దానాలూ పరోక్షంగా పెద్ద తలకాయలకే ముడుతున్నట్టు తేల్చి పాపం ముంచేశారు. పంతులు చేసేది లేక వచ్చిన శాపనార్థాలన్నీ పెట్టాడు. ఐటీ శాఖ వారు 'జాన్‌దేవ్' అనేసి నోటీసులు జారీ చేసేశారు. లాటరీ వచ్చినా వాళ్లొదలరు. 'జన్మకో శివరాత్రి మహా ప్రభో వదలండి' అని కాళ్లావేళ్లా పడ్డా మాక్కూడా సేమ్ టు సేమ్ కదా అంటూ రూపాయికి పావలాలు పట్టేస్తారు.

ఇదివరకు, ఇప్పుడు కూడా పార్టీ పెద్ద పండుగలప్పుడు సభల్లో హుండీలు పెడతారు. కలెక్షన్లు బానే ఉంటాయ్. ఇక్కడో చమత్కారం ఉందని చెబుతారు. 'ఏవుంది, ఓ చేత్తో పడేసి, ఇంకో చేత్తో తీసుకోవడమే.. ఈ రోజుల్లో హుండీలో వేసేది ఎవరండీ అని' ఒకాయన వాపోయాడు. మనమే తుమ్మి మనమే చిరంజీవ అనుకోవాలి. ఎవరిని నమ్మి కరెన్సీ కట్టలిస్తాం? మళ్లీ అన్నీ పడ్డాయో లేదో తేలేదాకా టెన్షను.

ఇలా హుండీ ఆదాయాలు చూపించకపోతే తర్వాత ఏ శేషనో ఖర్చులు బైటికిలాగి లేనిపోని యాగీ చేస్తే– అదో పెద్ద తంటా. ఇవన్నీ గుప్తదానాలు. ఎవరు ఏమిచ్చారో ఎందుకిచ్చారో చెప్పక్కర్లేదు. చంద్రబాబు పదే పదే అంటున్నట్టు బంగారు గుడ్లు పెట్టే బాతుగా ప్రతి హుండీ ఆ రోజుల్లో నిధులు సమకూర్చేది. మావూరి రచ్చబండ మీద ఒక పెద్దాయన తాజా విశేషాలు చెబుతూ, మా చంద్రబాబుకి అయిదేళ్లనాడు ఈ సంగతి తెలిస్తేనా... అంటూ మొదలుపెట్టాడు. మొన్న మన గోడవతల చైనాలో తొమ్మిది రోజుల్లో వెయ్యి పడకల ఆసుపత్రిని, ఇంకో వారంలో ఇంకోటి నిర్మించారట. వాళ్ల దగ్గర కావల్సిన యంత్రాంగం, మంత్రాంగం ఉందిట! మనకి మాట మాత్రం తెలిస్తే మనకీ అద్భుతం జరిగేది అనగానే అంతా ఛీకొట్టారు. వాళ్లది వేరు, మనది వేరు అని నోరు మూయించారు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# చెలగాటం న్యాయమా?

'హైదరాబాద్‌లో దిశ నిందితుల్ని ఎన్‌కౌంటర్ చెయ్యడం.. దిగ్భ్రాంతికరమే.. కానీ పోలీసులు అలా ఎన్‌కౌంటర్ చేశాక ప్రజలు వేడుక చేసుకున్నారు'... నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలులో ఆలస్యాన్ని ప్రస్తావిస్తూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఢిల్లీ హైకోర్టులో చేసిన వ్యాఖ్యలివి. నిర్భయ దోషులకు శిక్ష అమలు న్యాయస్థానాల సహనానికి ఓ పరీక్షగా మారిందనేది ఇప్పుడు విస్తృతంగా వినిపిస్తున్న విమర్శ. నిర్భయ దోషులకు శిక్షపడేరోజు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వాళ్లంతా చట్టం వాళ్లకు కల్పించిన న్యాయ అవకాశాలు చూసి విసుగు చెందారు. ఈ విసుగు వ్యవస్థపై నమ్మకాన్ని పోగొట్టేదని అర్థం చేసుకోవాలి. ఆ నమ్మకం పోయినప్పుడు జరిగే నష్టం రెండు రకాలు. బాధితులు న్యాయస్థానాల వైపు చూడటం మానేయడం మొదటిదైతే.. ఏం నేరం చేసినా తేలిగ్గా తప్పించుకోవచ్చనే నిర్భీతి పెరగడం రెండో అతిపెద్ద నష్టం. నిర్భయ చట్టం తెచ్చినంత వేగంగా ఆ బాధితురాలి కుటుంబానికి న్యాయం చెయ్యలేకపోయింది మన వ్యవస్థ.

తప్పు చేసిన వాళ్లకు శిక్ష పడటం బాధితుల కుటుంబాలకు ఎంతో సాంత్వననిస్తుంది. ఆ సాంత్వన కోసమే నిర్భయ తల్లి ఏడేళ్లుగా పోరాడుతున్నారు. ఆమె జనవరి 31న ఢిల్లీ హైకోర్టు ఆవరణలో తీవ్ర ఆవేదనతో కుప్పకూలిపోయారు. ఆమె దుఃఖానికి రెండు కారణాలు. దోషుల తరఫు లాయర్ ఆమెకు చేసిన ఓ సవాల్. 'దోషుల్ని ఉరితియ్యడం అనేది జరగదు. అలా ఎప్పటికీ జరగనివ్వను' అంటూ లాయర్ ఏపీ సింగ్ తనకు చాలెంజ్ విసిరారని ఆశా సింగ్ కన్నీటి పర్యంతమయ్యారు. నిర్భయ దోషులు ముఖేష్ సింగ్, వినయ్ శర్మ, అక్షయ్ ఠాకూర్, పవన్ గుప్తాలకు సుప్రీంకోర్టులో ఉరిశిక్ష పడి రెండేళ్లు పూర్తైంది. అంతకు నాలుగేళ్ల ముందే ట్రయల్ కోర్టు ఉరిశిక్ష విధించింది. అయినా ఇప్పటికీ వాళ్ల తరఫున వాదిస్తున్న ఇద్దరు లాయర్లు.. వాళ్లు నిర్దోషులనే వాదిస్తున్నారు. వాళ్లకు ఈ కేసుతో కావాల్సినంత ప్రచారం దొరుకుతున్నందున దాన్ని వదులుకోవడానికి వాళ్లు సిద్ధంగా లేరు. అందుకే దోషులందరితో ఒకేసారి కాకుండా ఒక్కొక్కరితోనే పిటిషన్లు వేయిస్తూ కాలయాపన వ్యూహం అమలు చేస్తున్నారు. వాళ్ల న్యాయ అవకాశాలన్నీ వాడుకోవాలంటే శిక్ష అమలుకు ఇంకెన్నేళ్ళు పడుతుందో చెప్పలేం. కాలంతో పాటు చట్టాలు, న్యాయవిచారణలు మారకపోవడం వల్ల వచ్చిన సమస్య కాదా ఇది..? సీసీకెమెరాలు,అడ్వాన్స్‌డ్ ఇన్వెస్టిగేషన్ ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాక కూడా సాంప్రదాయ పద్ధతిలోనే సాక్ష్యాధారాలు సేకరించడం, ఎప్పుడో రాసుకున్న న్యాయ సూత్రాలనే పాటించడం వల్ల దోషులు తప్పించుకోవడానికి అన్ని అవకాశాలు కల్పించినట్లవుతుంది కదా. ఇది న్యాయవ్యవస్థలోని తీవ్రమైన లోపాలున్న విషయాన్ని చాటేదని న్యాయ వ్యవస్థకు ఎవరు చెప్పాలి?

నిర్భయ ఘటన జరిగి ఏడేళ్లైనా దోషులకు శిక్షపడలేదు కాబట్టే హైదరాబాద్‌లో దిశ ఘటన జరిగినప్పుడు ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నిర్భయ ఘటనలాగే తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఘటన ఎస్తర్ అనూహ్య కేసు. ఈ కేసులోనూ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చెయ్యడంతో ఏడాదిలోపే ఆ దుర్మార్గుడు చంద్రబాన్‌కు మరణ శిక్ష పడింది. కానీ నాలుగేళ్లు దాటుతున్నా ఇంకా అది అమలుకాకపోవడం తల్లిదండ్రులను కలచివేస్తోంది. గత యేడాది జూన్‌లో వరంగల్‌లో 9 నెలల పసిగుడ్డుపై ప్రవీణ్ అనే కామాంధుడు అత్యాచారం చేసి హత్య చేస్తే.. వేగంగా విచారణ పూర్తి చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఉరిశిక్ష విధించింది. అయితే ఆ శిక్ష పడ్డ నెలరోజులకే అతనికి నేరచరిత్ర లేదన్న కారణం చూపి ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. తాజాగా హాజీపూర్‌లో ముగ్గురు అమ్మాయిల్ని బావిలోకి తోసి హత్యాచారం చేసిన సైకో శ్రీనివాస్ రెడ్డికి కోర్టు ఉరి శిక్ష వేసినా అది అమలు జరిగేది ఎన్నేళ్లకో అనే అనుమానాలున్నాయి.

క్రూరమైన అత్యాచార నేరాల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తర్వాత కూడా సాధారణ కేసుల్లో ఇచ్చే అన్ని న్యాయపరమైన అవకాశాలు ఇవ్వడం సమంజసమేనా అని సమీక్షించుకోవాల్సిన సమయం ఇది. దీనివల్ల బాధితులు, వారి కుటుంబాలు మరింత ఎక్కువ బాధితులుగా మారడాన్ని మించి బాధితులకు జరిగే న్యాయం ఏంటన్నది చర్చించాలి.

తులసీచందు, జర్నలిస్టు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



ఫోరమ్ థియేటర్ ప్రక్రియలో ఆడిన నాటకంలోని దృశ్యాలు

# వేధింపులపై చిందు ఎత్తిన చైతన్యం

**ఓ కాలేజీ అమ్మాయిని కొందరు టీజ్ చేస్తున్నారు.
అమ్మాయి బెదిరిపోతున్న కొద్దీ మరింత రెచ్చిపోతున్నారు.
చూడగానే తెలిసిపోయే డైరెక్ట్ అటాక్ అది.
ఆఫీస్‌లోని ఓ మేల్ కొలీగ్ హుందాగా.. చాలా మర్యాదగా ప్రవర్తిస్తున్నట్టే కనిపిస్తాడు.
కానీ... ప్రతి మాట, ప్రతి చేష్ట వెనకాల హెరాస్‌మెంటే.
నిరూపించలేని పరోక్ష దాడి.
ఈ డైరెక్ట్ అటాక్‌లనూ, ఇన్‌డైరెక్ట్ వేధింపులనూ ఎలా ఎదుర్కోవాలో
రంగస్థలం సాక్షిగా ప్రదర్శిస్తున్నారు ఇద్దరు కళాకారులు.
‘ఫోరమ్ థియేటర్’, ‘ప్లే బ్యాక్ థియేటర్’తో యువతలో చైతన్యాన్ని
‘చిందు’ ఎత్తిస్తున్న సబ్రీనా ఫ్రాన్సిస్, సురేష్‌లది మంచి ప్రయత్నం.**

హైదరాబాద్... గాంధీ మెడికల్ కాలేజ్ ఆవరణ...

ఒక అమ్మాయిని కొంతమంది అబ్బాయిలు వెంటాడుతున్నారు.. వేధిస్తున్నారు. ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. పాపం ఆ అమ్మాయి ఎదిరించలేక ఏడుస్తోంది. ఆమె నిస్సహాయత ఆ అబ్బాయిలు మరింత రెచ్చిపోయేలా చేసింది. ఇదంతా గమనిస్తున్న ఓ గుంపులోంచి ఒక విద్యార్థిని ‘నువ్వు రియాక్ట్ కావాలి’ అంటూ ముందుకొచ్చింది. ‘ఎలా రియాక్ట్ కావాలో మీరు చూపించండి మరి’ అడిగారు ఎవరో. అంతే ఆ అమ్మాయి ఆ రౌడీమూక ను చేరి వాళ్ల చేష్టలను నిలువరించే ప్రయత్నం మొదలుపెట్టింది. ఆ ఆకతాయిలు కూడా ఎక్కడా తగ్గకుండా ప్రతివ్యూహాలు పన్నుతూ ఇబ్బంది పెడ్తున్నారు.

కాసేపటికి ఇంకో అమ్మాయి వచ్చింది గుంపులోంచి.. తనదైన పద్ధతిలో ఆ అబ్బాయిల ఆట కట్టించేందుకు. ఇలా ఓ గంట గడిచింది. తర్వాత ప్రశంసలు. ఆ పరిస్థితికి తగ్గట్టుగా తమను తాము రక్షించుకున్న ఆ అమ్మాయిల సమయస్ఫూర్తికి... ధైర్యానికి.. తెగువకు.

అవును.. ఇది నాటకమే. ఈ విధానాన్ని ‘ఫోరమ్ థియేటర్’ అంటారు.

ఒక కాన్ఫరెన్స్ రూమ్...

పాతికమంది వరకూ ఉన్నారు. నిశ్శబ్దంగా ఉంది వాతావరణం. ఒక ఉద్యోగిని తను అనుభవించిన వెతను వెళ్లబోసుకుంటోంది.

‘నేను సింగిల్ ఉమన్‌ను. పెళ్లయిన యేడాదిలోపే విడాకులయ్యాయి. నన్ను తీసుకెళ్లి ఇంట్లో పెట్టుకొనే స్వాతంత్ర్యం కాని, ఆర్థిక స్థోమత కానీ అమ్మానాన్నకు లేవు. దాంతో నా చదువుకి తగ్గ ఉద్యోగాన్ని వెదుక్కుని హైదరాబాద్ వచ్చాను. నా సీనియర్‌తో హెరాస్‌మెంట్ ఎదుర్కొంటున్నాను’ అని ఆగిపోయింది ఆమె. ‘జాయినై ఆఫీస్‌లోకి ఎంటర్ అవగానే’ అంటూ మళ్లీ మొదలుపెట్టింది.. ‘ముందు నా కాళ్లు చూశారు.. తర్వాత మెడ. మేల్ కొలీగ్స్ దగ్గర్నుంచి హయ్యర్ ఆఫీషియల్స్(పురుషులు)వరకు. దాన్నిబట్టి నా మ్యారిటల్ స్టేటస్ అంచనావేయడం.. మ్యారేజ్ కాలేదని తెలిసాక దాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకోవడం. అందులో నా సీనియర్ సిద్ధహస్తుడు. అది ఎలా ఉంటుందంటే దాన్ని వేధింపు అని నేను రుజువు చేయలేను. అలాగని భరించనూ లేను. అతని తీరును గమనించిన ఎవరికైనా అది నా పట్ల కన్‌సర్న్‌గా.. గౌరవంగానే కనిపిస్తుంది. కాని సదరు మనిషి వ్యక్తిగతంగా నాతో మాట్లాడేటప్పుడు, నా పని గురించి అతనితో చర్చించాల్సి వచ్చినప్పుడు మాత్రమే అతని వెకిలితనాన్ని బయటపెడ్తాడు. దీనివల్ల నేను ఫ్రస్టేట్ అయిపోయి అరిస్తే నన్నో గయ్యాళిగా.. మర్యాద తెలియని మనిషిలా ఎస్టాబ్లిష్ చేస్తాడు. ఈ సమస్యను ఎవరితో చెప్పుకున్నా నమ్మని పరిస్థితిని క్రియేట్ చేశాడు. భరించలేకపోతున్నా. ఆత్మహత్య ఆలోచనదాకా కూడా వెళ్లా’ అంటూ రెండుచేతుల్లో మొహం దాచుకొని ఏడ్చేసింది ఆమె. అంతలోనే ఆడ, మగ కలిపి పదిమందిదాక ఉన్న ఓ బృందం పోడియం దగ్గరకు చేరింది. ఆ అమ్మాయి పంచుకున్న విషయాలతో అప్పటికప్పుడు నాటకాన్ని అల్లి ప్రదర్శించడం మొదలుపెట్టారు. తాము విన్నదంతా అలా కళ్లకు కడుతుంటే ఆ సమావేశంలో ఉన్నవాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఆ నాటకాన్ని పది రకాల పరిష్కారాలతో ఎండ్ చేశారు.

ఇదే ‘ప్లే బ్యాక్ థియేటర్ ’ విధానం. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉంది. ప్రసిద్ధికెక్కుతోంది.

‘ఫోరమ్ థియేటర్’, ‘ప్లే బ్యాక్ థియేటర్’ ఈ రెండు విధానాల ద్వారా మహిళల్లో ఆత్మస్థయిర్యం, ఆత్మరక్షణా మెలకువలను బోధిస్తున్నారు.. సబ్రీనా ఫ్రాన్సిస్, సురేష్‌లు తమ గ్రూప్‌లోని దివ్యశ్రీ, తదితర కళాకారులతో కలిసి. ఫోరమ్ థియేటర్‌లో ప్రేక్షకులను భాగస్వామ్యం చేస్తే, ప్లే బ్యాక్ థియేటర్‌లో ప్రేక్షకులు మనసు విప్పి మాట్లాడే అవకాశాన్ని కల్పించి.. వాళ్ల బాధకు నాటకరూపమిచ్చి వాళ్లే పరిష్కారం వెదుక్కునేలా చేస్తున్నారు. ‘తమకు జరిగింది బయటకు చెప్పుకుంటే చులకనగా చూస్తారని, తల్లిదండ్రులకు చెబితే చదువు మాన్పిస్తారేమోనని, భర్తకు చెబితే ఉద్యోగం వద్దంటాడేమోననే భయంతో వ్యథను అణచుకుని క్షోభననుభవిస్తుంటారు. రేప్‌కి కారణం అమ్మాయి వస్త్రధారణను, ప్రవర్తనను తప్పు పట్టే .. వ్యాఖ్యలు చేసే దుస్థితిలో ఉన్నాం. అలాంటి వాళ్లకు ఊరటే కాదు.. జీవితాన్ని నెగ్గే మెలకువలను నేర్పించే మాధ్యమం ఫోరమ్ థియేటర్, ప్లే బ్యాక్ థియేటర్’ అని చెప్పడమే కాదు నిరూపిస్తున్నారు కూడా సబ్రీనా, సురేష్‌లు. వేధింపులు, వివక్ష, హింసను ఎదుర్కోవడంలో మహిళలను చైతన్యపరిచినట్టే అబ్బాయిలు, తల్లిదండ్రుల్లోనూ జెండర్ ఈక్వాలిటీ పట్ల స్పృహను పెంచుతున్నారు ఈ రెండు నాటక ప్రక్రియలతోనే. గ్రామాలు, పట్టణాలు, స్కూళ్లు, కాలేజీలు, కార్యలయాలు ఇలా ఎక్కడైనా ప్రభుత్వ సిబ్బంది, ప్రైవేట్ యాజమాన్యాల పిలుపు మేరకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నారు. ‘దీనివల్ల బెరుకు, భయం పోయి పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందించాలో తెలుస్తుంది. తమను తాము కాపాడుకోవడమే కాదు ఇతరులనూ రక్షించే ధైర్యం వస్తుంది’’ అని వివరిస్తారు సబ్రీనా, సురేష్‌లు. వాళ్లు నేర్చుకున్న, శిక్షణ పొందిన ఈ థియేటర్ ప్రక్రియలను ఇలా జెండర్ సమస్యలను వెలుగులోకి తేవడానికే ఉపయోగిస్తున్నారు.

## షీటీమ్స్‌తో కలిసి..



సురేష్



సబ్రీనా ఫ్రాన్సిస్

గత మూడేళ్లుగా తెలంగాణ షీటీమ్స్‌తో కలిసి పనిచేస్తున్నారు. అందులో భాగమే హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజ్ ప్రదర్శన. షీ టీమ్స్ సారథ్యంలో కాలేజ్‌లు, హాస్టల్స్‌లో ఫోరమ్ థియేటర్ మెథడ్‌లో అమ్మాయిలు సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఆత్మరక్షణా నైపుణ్యాన్ని పెంచుకునేలా చేస్తున్నారు. దీంతోపాటు పిల్లలు, మహిళల రక్షణ, సాధికారత మీద ఆడియో ఆల్బమ్‌లు, డాక్యుమెంటరీలు, షార్ట్‌ఫిల్మ్స్ తీస్తున్నారు. ఇవన్నీ కూడా ‘చిందు’ అనే సాంస్కృతిక వ్యక్తిత్వ వికాస కేంద్రం కింద చేస్తున్నారు. దీన్ని ఇరవై ఏళ్ల కిందట స్థాపించారు వీళ్లు. సబ్రీనా, సురేష్ ఇద్దరూ కళాకారులే. డాన్స్, సంగీతం, డ్రామా.. ఈ మూడింటిలో నిపుణులు. ఒక వర్క్‌షాప్‌లో ఒకరికొకరు పరిచయమయ్యారు. ఇద్దరి అభిరుచులు, లక్ష్యాలు ఒకటే అని అర్థమయ్యాక కలిసి పనిచేస్తే బాగుంటుందని ‘చిందు’ను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఈశాన్య రాష్ట్రాలు సహా దేశమంతా ప్రదర్శనలిస్తుంటారు. విదేశీ వేదికల మీదా వీళ్ల ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ప్లే బ్యాక్ థియేటర్‌లో పట్టభద్రులైన ఈ ఇద్దరు డ్రామా థెరపి, సైకోడ్రామా, థియేటర్ అప్రెస్డ్ అనే విధానల్లోనూ శిక్షణ పొందారు. అంతేకాదు యూకేలోని టావిస్టాక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ రిలేషన్స్‌లోనూ ట్రైనింగ్ తీసుకున్నారు. జెండర్ సమస్యలు, జెండర్ స్పృహకు సంబంధించి వీరి కళాసహాయం కావాలనుకునే వారు ఈ నంబర్‌లో సంప్రదించవచ్చు.. 9849091717.

## నిలువుటద్దం

రేపటి ‘ఫన్‌డే’లో..!

ఎరుపెక్కిన కళ్లతో తల పైకెత్తి చూసింది తను. మెడలో రుద్రాక్షలు, నుదిటి మీద విభూతి బొట్లు, చేతికి కాశీతాళ్లు, జై దుర్గా అనే నామస్మరణ...భలే చిత్రంగా ఉన్నాడా మనిషి. అరవై ఏళ్లు పైబడి ఉంటాయి.

తనని చూస్తూ...

‘‘ఏమైంది తల్లీ...ఒంటరిగా కూర్చొని ఏడుస్తున్నావు?’’ అంటూ ఆరా తీశాడు.

‘‘నీకు ఈ బతుకు అవసరమా? చచ్చిపో...అంది మా అమ్మ. అందుకే చచ్చిపోదామని వచ్చేశానండీ. కానీ భయమేస్తుంది’’ గుండెలోతుల్లో నుంచి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ చెబుతున్నప్పుడు ఆ స్వరాన్ని వింటూనే విషయం అర్థం చేసుకున్నాడు అతడు.

‘‘నాకు నీ సమస్య అర్థమైంది’’ అన్నాడు శాంతస్వరంతో.

తన సమస్య ఏమిటి?

హృదయాల్ని కదిలించే ఉద్భవి కథ ‘నిలువుటద్దం’లో చదవండి.



## గుహలోకి వెళ్లి చూస్తే...

పద్మపాదుడు కూర్చున్నచోటి నుంచి హడావుడిగా లేచాడు. గుహలోనికి వెళ్లిచూస్తే శంకరుడు యధాస్థితిలో శయనించి వున్నాడు. పక్కనే విష్ణశర్మ మాత్రం లేడు. స్నానసమయం కనుక వాగు దగ్గరకే వెళ్లి ఉంటాడని ఊహించి అక్కడికి వెళ్లాడు పద్మపాదుడు.

మాట్లాడే మట్టిచిలకను ఒడ్డు మీద పెట్టి విష్ణుశర్మ వాగులో స్నానానికి దిగాడు. పద్మపాదుడు విష్ణుశర్మకు వచ్చిన పని చెప్పాడు. తాను తిరిగివచ్చే వరకూ ఆచార్య శంకరుని దేహసంరక్షణ భారం వహించమన్నాడు.

విష్ణుశర్మ ఆ మాట వింటూనే బేలగా మారిపోయాడు.

ఎందుకు?



*హంసః సోహం (శంకర విజయం 32: ఆదిశంకరాచార్యుల జీవిత చరిత్ర)లో చదవండి.*

## తుమ్మా మజాకా!

పాపం హఠాత్తుగా అతను తుమ్మాడు.

పాపం...హఠాత్తుగా అతని ముఖం ముడుచుకుపోయింది. కండ్లు ఆకాశం వైపు తేలిపోయాయి.

‘తుమ్ముదేముందండీ...మన జన్మహక్కు...హాయిగా తుమ్మేయడమే’ అనుకుంటాంగానీ ఆ గుమాస్తాగారు అలా అనుకోలేదు. గజగజా వణికి పోయారు. ఎంతలా అంటే....




*ప్రసిద్ధ రచయిత చెహోవ్ కథ ‘గుమస్తా మరణం’లో చదవండి.*

*ఇంకా... ఆనాటి ఆటవిడుపు (ముఖచిత్రకథనం), సామజవరగమనా... పాటతత్వం సిరివెన్నెల మాటల్లో (పాటతత్వం),ఉదంకుడి గురుభక్తి (పురానీతి), బాపు పోయిండు (ఇసుకచెట్టు: గల్ఫ్ కథలు), తాళంచెవి (క్రైమ్‌స్టోరీ), జాతీయాలు...
మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.*

## సేమ్ సీన్

## మంచి కాఫీ లాంటి పెళ్లి

మంచి కాఫీ లాంటి సినిమా ‘ఆనంద్’ గుర్తుందా? పెళ్లికూతురు కట్టుకున్న చీర బాగో లేదని, వెంటనే చీర మార్చుకోమని చెబుతుంది కాబోయే అత్తగారు. లేదు, నాకీ చీరే బాగుంది. ఇది మా అమ్మ చీర అని చెబుతుంది పెళ్లికూతురు. ఆ మాటలకు కాబోయే



అత్తగారు ఉరిమి చూసి, నానా మాటలూ అంటుంది. అప్పుడు పెళ్లికూతురే ఆ పెళ్లి క్యాన్సిల్ చేస్తుంది. అందరూ ఆమెను నానా మాటలూ అంటారు చీరకోసం పెళ్లి రద్దు చేసుకుంటావా అని. అచ్చం ఇటువంటి ఘటనే జరిగింది కర్ణాటకలోని హసన్‌లో.

పెళ్లికూతురికి ఆమె తల్లిదండ్రులు పెట్టిన పెళ్లి చీర నాసిరకంగా ఉందన్న కారణంతో తన తల్లిదండ్రుల సలహాపై పెళ్లి కొడుకు రఘుకుమార్ పెళ్లి మండపానికి రాకుండానే అదృశ్యమైపోయాడు. పెళ్లికి ముందురోజు... ‘‘అమ్మాయిని చీర మార్చుకు రమ్మనండి, తను కట్టుకుని ఉన్నది బొత్తిగా నాసిరకంగా ఉంది’’ అన్నారు అబ్బాయి తల్లిదండ్రులు. అమ్మాయి తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోలేదు. ఆ వాదన చివరికి పెళ్లి రద్దు చేసుకునేలా చేసింది. దాంతో అమ్మాయి తల్లిదండ్రులు పెళ్లికొడుకు మీద, అతని అమ్మానాన్నల మీద స్థానిక మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. మంచి కాఫీలాంటి సినిమాలా ఈ కథ కూడా సుఖాంతం అవుతుందేమో చూడాలి.

## రెండు విషయాలు

## క్యాబరే క్వీన్



క్యాబరే క్వీన్ ఆరతీదాస్

నలుపు, తెలుపు చిత్రాల కాలం నాటి ప్రేక్షకుల్ని రెప్ప వెయ్యనివ్వకుండా చేసిన తొలి బెంగాలీ క్యాబరే డ్యాన్సర్ ఆరితీదాస్ గురువారం కోల్‌కతాలో కన్నుమూశారు! ఆమె వయసు 77 ఏళ్లు. మిస్ షెఫాలీగా ప్రసిద్ధురాలైన ఆరతి.. డ్యాన్సర్ మాత్రమే కాదు. విలక్షణ నటి కూడా. సత్యజిత్ రే ‘ప్రతిధ్వని’, ‘సీమబద్ధ’ చిత్రాలలో ఆమె నటించారు. ఇటీవలే ఆమె ఆత్మకథ ‘సంధ్యా రతేర్ షెఫాలీ’.. పుస్తక రూపంలో విడుదలైంది. తూర్పు బెంగాల్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) నుంచి శరణార్థులుగా పశ్చిమ బెంగాల్ వచ్చిన కుటుంబంలోని ముగ్గురు అక్కచెల్లెళ్లలో ఆరతీదాస్ ఆఖరు అమ్మాయి. పన్నెండేళ్ల వయసులోనే ఇల్లు గడవడానికి అప్పట్లో ప్రముఖులు వచ్చిపోతుండే ‘ఫిర్పో’ రెస్టారెంట్‌లో డాన్స్ చేశారు ఆరతి. ఆ తర్వాత సినిమాల్లోకి వెళ్లారు. పేదరికంలో జీవితాన్ని ప్రారంభించిన ఆరతి పేదరికంలోనే అంతిమశ్వాస వదిలారు. చివరి రోజుల్లో తన అనారోగ్య సమస్యలకు మందులు కూడా కొనుక్కోలేని స్థితిలో ఆమె ఉన్నారని బెంగాలీ పత్రికలు రాశాయి.



వరుణ్ గ్రోవర్, అతి వేళ్లు

## ఓ మై మ్యాన్

వరుణ్ గ్రోవర్ స్క్రీన్ రైటర్, పాటల రచయిత, థింకర్. వీటన్నిటినీ మించి హాస్య రసజ్ఞుడు. వయసు 40 ఉంటుంది. అయితే ఇప్పుడు హాస్యం కోసం అతడు ఈ పని చేయలేదు. ఏ పని?! వరుణ్ తన చేతి వేళ్లకు రెండు రకాల గోళ్ల రంగును వేసుకుని ఆ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు. దాన్ని చూసిన మగాళ్లంతా అతడిని ఇష్టం వచ్చినట్లు ట్రోల్ చెయ్యడం మొదలు పెట్టారు. ‘పురుషుడివి ఆయుండీ ఈ స్త్రీవేషాలు ఏంటి?’ అని అతడిపై గత ఇరవై నాలుగు గంటలుగా ఏకబిగిన సెటైర్‌లు వేస్తూనే ఉన్నారు. కొందరైతే ‘మగజాతికే తలవంపులు తెచ్చావు’ అని దుయ్యబడుతున్నారు. ఆ మాటలకు వరుణ్ బాధపడ్డాడు. ఆశ్చర్యపోయాడు. ఆవేదన చెందాడు. థింకర్ కదా.. తాత్వికంగా కూడా ఆలోచించే ఉంటాడు. చివరికి ఈ ట్రోలింగ్ చేస్తున్న వాళ్లకు తనూ ఓ ప్రశ్న వేశాడు. ‘‘గోళ్ల రంగు వేసుకుంటే నా చెయ్యి నాకే చూడముచ్చటగా, అందంగా అనిపించింది. అందుకే షేర్ చేసుకున్నాను. దీన్నొక జెండర్ ఇష్యూగా చూస్తారెందుకు?’’ అన్నాడు. ‘నీకు చూడముచ్చటగా ఉంటే సరిపోయిందా..’ అని మళ్లీ ఆయనపై దాడి ప్రారంభమయింది. ఇప్పట్లో అది ముగిసేట్టు లేదు.



సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
8-2-2020

# ఆకు లేని పాలకూరలు

**ఇక్కడ చెప్పినవన్నీ 'పాల'కూరలే.**
**మామూలుగా మనం పాలకూర అని పిలిచే వెజిటబుల్‌లో ఆకులుంటాయి.**
**ఇక్కడ చెప్పిన కూరల్లో దేనిలోనూ ఆకుల్లేవు. కానీ ఆకుకూరలంత ఆరోగ్యముంది.**
**సంపూర్ణాహారమైన 'పాలు' పోసి వండిన కూరలివి.**
**వీటి రుచుల్లో పాలభాగం సగపాలు. మిగతాది ఆ కూరల పాలు.**
**వీటి రుచులెంతో మేలు. తింటే మంచి ఆరోగ్యం మీ 'పాలు'.**

నిర్వహణ: వైజయంతి పురాణపండ





## సొరకాయ పాలు కూర

**కావలసినవి:** సొరకాయ ముక్కలు – అర కేజీ; ఉల్లి తరుగు – ఒక కప్పు; పచ్చి మిర్చి – 6 (సన్నగా పొడవుగా తరగాలి); పాలు – ఒక కప్పు; ఉప్పు – తగినంత; పసుపు – అర టీ స్పూను; నూనె – ఒక టేబుల్ స్పూను.

**తయారీ:** ● సొరకాయ ముక్కలకు తగినన్ని నీళ్లు, పసుపు జత చేసి స్టౌ మీద ఉంచి ఉడికించాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు వేసి వేయించాలి ● ఉప్పు జత చేసి మరోమారు కలిపి కొద్దిసేపు మూత ఉంచాలి ● ఉడికించిన సొరకాయ ముక్కలు జతచేసి మరోమారు కలియబెట్టాలి ● బాగా ఉడికిన తరవాత పాలు పోసి, మూత ఉంచి, కూర దగ్గర పడేవరకు ఉడికించి దింపేయాలి (ఇష్టమైన వారు కొద్దిగా బెల్లం కాని పంచదార కాని వేసుకోవచ్చు) ● అన్నంలోకి, రోటీలలోకి రుచిగా ఉంటుంది.





## బీరకాయ పాలు కూర

**కావలసినవి:** బీరకాయలు – అర కేజీ; పాలు – పావు కప్పు
**పోపు కోసం:** నువ్వుల నూనె – ఒక టీ స్పూను; మినప్పప్పు – ముప్పావు టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – అర టీ స్పూను; ఆవాలు – అర టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; పచ్చి మిర్చి – 4; పసుపు – అర టీ స్పూను; కరివేపాకు – 3 రెమ్మలు; ఉప్పు – తగినంత.

**తయారీ:** ● చెక్కు తీసేసిన బీర కాయలను చిన్న చిన్న ముక్కలుగా తరిగి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక, ఆవాలు వేసి చిటపటలాడాక పచ్చి సెనగ పప్పు, మినప్పప్పు జత చేసి మరోమారు వేయించాలి ● జీలకర్ర, పచ్చి మిర్చి, కరివేపాకు ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించాలి ● బీరకాయ ముక్కలు, పసుపు, ఉప్పు వేసి బాగా కలియబెట్టి, మూత ఉంచి, ఐదు నిమిషాల తరవాత పాలు పోసి మరోమారు కలియబెట్టి, పది నిమిషాల సేపు మూత ఉంచాలి ● మెత్తగా ఉడికి, పాలన్నీ ఇగిరిపోయిన తరవాత దింపేయాలి ● ఈ కూర అన్నంలోకి రుచిగా ఉంటుంది.





## వంకాయ పాలు కూర

**కావలసినవి:** వంకాయలు – 8 (గుత్తి కాయలు); ఉల్లి తరుగు – పావు కప్పు; ధనియాలు – ఒక టేబుల్ స్పూను; టొమాటో తరుగు – అర కప్పు; గసగసాలు – ఒక టేబుల్ స్పూను; లవంగాలు – 2; అల్లం తురుము – ఒక టీ స్పూను; ఎండు కొబ్బరి పొడి – 3 టేబుల్ స్పూన్లు; మిరప కారం – అర టేబుల్ స్పూను; ఉప్పు – తగినంత; పాలు – ఒక కప్పు; ఆవాలు + జీలకర్ర – ఒక టేబుల్ స్పూను; పసుపు– పావు టీ స్పూను; నూనె – తగినంత

**తయారీ:** ● వంకాయలను గుత్తులుగా కట్ చేసి, ఉప్పు నీళ్లలో వేసి పక్కన ఉంచాలి ● మిక్సీలో గసగసాలు, ధనియాలు, ఉల్లి తరుగు, అల్లం తురుము, టొమాటో తరుగు, ఎండు కొబ్బరి పొడి, మిరప కారం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా చేసి, ఈ మిశ్రమాన్ని వంకాయలలోకి స్టఫ్ చేయాలి ● స్టౌ మీద బాణలిలో మూడు టేబుల్ స్పూన్ల నూనె కాగాక, ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి ● స్టఫ్ చేసిన వంకాయలను జత చేసి బాగా కలిపి, మూత ఉంచాలి ● పది నిమిషాల తరవాత పాలు జత చేసి కూరను బాగా కలియబెట్టి, మరోమారు మూత ఉంచి, బాగా ఉడికించి దింపేయాలి ● వేడి వేడి అన్నంలోకి చాలా రుచిగా ఉంటుంది.





## మునగకాడ పాలు కూర

**కావలసినవి:** మునగ కాడలు – 3 (పెద్ద పెద్ద ముక్కలుగా తరగాలి); ఉల్లి తరుగు – ఒక కప్పు; పచ్చిమిర్చి – 10; పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు; నానబెట్టిన బియ్యం – పావు కప్పు; కరివేపాకు – 2 రెమ్మలు; పసుపు – అర టీ స్పూను; పాలు – 400 మి.లీ.

**పోపు కోసం:** నూనె – 5 టేబుల్ స్పూన్లు; ఎండు మిర్చి – 3; ఆవాలు – పావు టీ స్పూను; మినప్పప్పు – పావు టీ స్పూను; జీలకర్ర – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత.

**తయారీ:** ● మిక్సీలో పచ్చి కొబ్బరి తురుము, నానబెట్టిన బియ్యం వేసి మెత్తగా ముద్దలా చేసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు ఒకదాని తరవాత ఒకటి వేసి దోరగా వేయించాలి ● ఉల్లి తరుగు జత చేసి నాలుగైదు నిమిషాలు కలియబెట్టాలి ● మునగ కాడ ముక్కలు, తగినన్ని నీళ్లు, ఉప్పు జత చేసి బాగా కలిపి, మూత ఉంచి, పావు గంట సేపు ఉడికించాలి ● మెత్తగా చేసిన పచ్చి కొబ్బరి తురుము మిశ్రమం, పాలు జత చేసి బాగా కలియబెట్టి, మరో పావు గంట ఉడికించి దింపేయాలి ● అన్నంలోకి, చపాతీలలోకి రుచిగా ఉంటుంది.





## పొట్లకాయ పాలు కూర

**కావలసినవి:** పొట్ల కాయ – అర కేజీ; ఉల్లి తరుగు – పావు కప్పు; టొమాటో తరుగు – అర కప్పు; పచ్చి మిర్చి – 2; అల్లం వెల్లుల్లి ముద్ద – ఒక టీ స్పూను; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; జీడిపప్పులు – 10; నూనె – ఒక టేబుల్ స్పూను; మిరప కారం – 2 టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; పసుపు – పావు టీ స్పూను; కరివేపాకు – 2 రెమ్మలు; కొత్తిమీర – ఒక కట్ట (చిన్నది); పాలు – పావు లీటరు (ఒక గ్లాసు).

**తయారీ:** ● పొట్ల కాయను శుభ్రంగా కడిగి, చక్రాలుగా తరిగి, ఉప్పు నీళ్లలో శుభ్రంగా కడిగి, నీరంతా పిండేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఆవాలు, జీలకర్ర, జీడి పప్పు, ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించాలి ● టొమాటో తరుగు జత చేసి మరోమారు వేయించాలి ● పొట్లకాయ చక్రాలను జత చేసి బాగా కలియబెట్టి, పది నిమిషాల పాటు ఉడికిన తరవాత, పాలు జత చేసి బాగా కలిపి మూత ఉంచాలి ● బాగా ఉడికిన తరవాత మూత తీసేసి, కరివేపాకు, కొత్తిమీర జత చేసి బాగా కలిపి, ఉడికించి దింపేయాలి ● ఈ కూర అన్నంలోకి రుచిగా ఉంటుంది.

ఫుడ్ ప్రింట్స్

# కోవా.. కావాలామ్మా!

**ప్రకృతి అందాలకు నిలయం కోనసీమ. రుచికరమైన పాలకోవాకు కంద్రిగ పాలకోవా ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. విదేశాల్లో స్థిరపడిన స్థానికులు, స్థానికేతరులు పనిగట్టుకుని కంద్రిగ వచ్చి పాలకోవాను తీసుకు వెళ్తుంటారు. కోవాలోని మాధుర్యాన్ని ఈ గ్రామం మొత్తం భారత దేశానికి పంచుతోంది. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు సుమారు 5 కిలోమీటర్లు దూరంలో ఉంది కంద్రిగ గ్రామం. అక్కడ ఆదిలక్ష్మీస్వీట్ (పాలకోవా) స్టాల్, అటుగా వెళుతున్నవారిని తన దగ్గరకు తియ్యగా రప్పించుకుంటుంది.**



సూరవరపు సుబ్బారావు

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా సుమారు 30 ఏళ్ల క్రితం సూరవరపు సుబ్బారావు.. కొత్తపేట – అమలాపురం రోడ్డు కంద్రిగ రేవు దగ్గర చిన్న కాఫీ హోటల్ ప్రారంభించారు. 20 ఏళ్ల క్రితం ఆయన కుమారుడు సూరవరపు వీరరాఘవులు హోటల్‌ని మరింత అభివృద్ధి చేయటం కోసం పాల కోవా తయారీ ప్రారంభించారు. అంతే.. వీరి జీవితాలలో మాధుర్యం వచ్చి చేరింది. వ్యాపారం పెరగటంతో, విశాలమైన స్థలంలో ఆదిలక్ష్మి స్వీట్స్ అండ్ టీ స్టాల్ ప్రారంభించిన కొద్దికాలానికే పాలకోవా వ్యాపారమూ చెందింది.



పాలకోవా పాకం

### ఊక పొయ్యి మీదే...

గ్యాస్ స్టౌ, స్టీమ్ విధానం ఉన్నా ఇక్కడ మాత్రం ఊక పొయ్యి మీదే పాలకోవా తయారుచేయటం ప్రారంభించారు. నాలుగు బట్టీలతో రెండు ఊక పొయ్యిలు పెట్టి, ఎంత వేగంగా పాలకోవా తయారుచేస్తున్నా, ఇలా ప్లేటులోకి తీస్తుండగానే, అలా ఎగరేసుకుపోతున్నారు పాలకోవా ప్రియులు. ప్రొప్రయిటర్ పెద్ద కాపు కుటుంబ సభ్యులు పదహారు మందితో పాటు మరో పది మంది కలిసి, రోజుకు సుమారు 100 కేజీల కోవా తయారుచేస్తున్నారు.

### నాణ్యమైన పాలతోనే కోవా

చుట్టుపక్కల గ్రామాల్లోని రైతుల నుంచి గేదె పాలు సేకరిస్తాం. ఇందులో ఒక్క చుక్క కూడా నీరు కలపకుండా, కోవా కోసమే ఉపయోగిస్తాం. 500 లీటర్ల పాలకు సుమారు 100 కేజీలు కోవా తయారవుతుంది. గ్యాస్, స్టీమ్ పొయ్యిలు అందుబాటులోకి వచ్చినా వాటిపై కోవా వండితే ఇంత రుచి రాదు. ఊక పొయ్యి మీద వండితేనే ఘుమఘుమలాడుతూ ఇంత తియ్యగా వస్తుంది. అందుకే ఊక పొయ్యి బట్టీల మీదే కోవా తయారుచేస్తున్నాం. ఇలా వేడివేడిగా ఉండగానే, అలా చల్లగా కొనేస్తుంటారు. 25 గ్రాములు, 50 గ్రాములు చొప్పున కోవా బిళ్లలను తయారుచేస్తాం.

**– సూరవరపు సుబ్బారావు,** నిర్వాహకుడు

### తయారీ...

ఊక పొయ్యి మీద ఇత్తడి గంగా ళాలు పెట్టి, పాలు పోసి మీగడ కట్టకుండా గరిటె తిప్పుతూ, సుమారు గంట సేపు మరగకాగి ముద్దలా అవుతున్న సమయంలో పంచదార (20 లీటర్ల పాలకు, మూడు కేజీల పంచదార) వేసి, పాలు, పంచదార పాకాన్ని గరిటెతో విరామం లేకుండా, దగ్గర పడేవరకు కలిపి, నెయ్యి పూసిన పళ్లెంలో పోస్తారు. గట్టిపడేవరకు గరిటెతో బాగా కలుపుతారు. ఇలా గట్టి పడటం కోసం ప్రస్తుతం ఒక రకమైన గ్రైండర్ వాడుతున్నారు. గ్రైండర్‌లో వేసిన అరగంటకు ముద్దలా మారిపోతుంది. ఆ మిశ్రమాన్ని బిళ్లలుగా తయారుచేసి ప్యాకింగ్ చేస్తారు. ఇలా ఈ పాలు కోవాగా మారి కవర్లలోకి వెళ్లడానికి రెండున్నర గంటల సమయం పడుతుంది. అయితేనేం, కోవా తిన్నవారు ఇచ్చే తియ్యటి మాటలు వారి జీవితమంతా వారి మనసులో పదిలంగా నిలుస్తున్నాయి.



పాలకోవా ముద్ద

**– జగతా రాంబాబు,**
సాక్షి, కొత్తపేట,తూ.గో. జిల్లా

ఆయుర్వేదం

# పాలు మురిపాలు

సంస్కృతిసంప్రదాయాలకు, సనాతన సదాచారాలకు నిలయం భారతదేశం. ఆహార ద్రవ్యాలలో, పవిత్ర పూజా ప్రక్రియలలో పాలు ప్రధాన పదార్థం. గోమాతకు దైవత్వం సిద్ధించటానికి ముఖ్య కారణం ఆవు పాల విశిష్టతే. ఆయుర్వేద పరిభాషలో ఏ విశేషణమూ వాడకపోతే.. క్షీరం అంటే గోక్షీరమే. తైలం అంటే నువ్వుల నూనే. అదేవిధంగా నవనీతం, ఘృతం (వెన్న, నెయ్యి) కూడా ఆవుపాలకు సంబంధించినవే. అప్పుడే పుట్టిన పసిపాప పోషణలో మాతృస్తన్యం తర్వాత అతి ముఖ్య పాత్ర మేక పాలు, ఆవు పాలదే. ఎన్నో ఓషధుల్ని శుద్ధి చేయటానికి ఆవు పాలను వాడతారు. అన్ని వయసులవారికీ ఆవు పాలు ఉత్తమ రసాయనంగా (సప్తధాతు పుష్టికరంగా) ఉపకరిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది. తద్వారా ఓజో వర్ధకంగా పని చేస్తాయి.

**ఆవు పాల గుణగణాలు (సుశ్రుతుడు):**
*స్వాదు శీతం మృదు స్నిగ్ధం బహలం శ్లక్ష్ణ్య పిచ్ఛిలం*
*గురు మందం ప్రసన్నం చ గవ్యం దశ గుణం పయః*

**చరకుడు:**
*తదేవ గుణమేవ ఓజః సామాన్యత్ అభివర్ధయేత్*
*ప్రవరం జీవనీయం క్షీర ముక్తం రసాయనం*

చిక్కగా, జిడ్డుగా, మృదువుగా ఉంటాయి. (గేదె పాలతో పోలిస్తే పల్చగా ఉంటాయి). తియ్యగా ఉండి, శరీరానికి చలవ చేస్తాయి. ఆలస్యంగా జీర్ణమై ఆకలిని తీర్చి, మనసుకి ప్రసన్నంగా, బలవర్ధకంగా పనిచేస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే జీవనీయ గుణ ప్రధానంగా ఉంటాయి. వాతహరంగా, పిత్తమయంగా ఉండి, రక్తస్రావాలని అరికట్టే లక్షణం కలిగి ఉంటుంది. తక్షణ శుక్రకరం, వీర్యవర్ధకం.

**గేదె పాలు:**
*మహీషీణాం గురుతరం గవ్యాత్, శీతతరం పయః*
*స్నేహాన్యూనం, అనిద్రాయహితం అత్యగ్నియేచ తత్*

ఆవు పాల కంటె గురుగుణం కలిగి, నిద్ర వచ్చేలా చేస్తాయి. అతి ఆకలిని అరికట్టి తృప్తినిస్తాయి.


**మేకపాలు: (చరకుడు)**
*ఛాగం కషాయం మధురశీతం*
*గ్రాహి పయా లఘు*
*రక్తపిత్త అతిసారఘ్నం క్షయ*
*కాస జ్వరాపహం*

తీపితో పాటు కొంచెం వగరుగా ఉండి తేలికగా జీర్ణమవుతాయి. రక్తస్రావం, విరేచనాలు, దగ్గు, జ్వరాలను అరికడతాయి.

**గాడిదపాలు (భావమిశ్రుడు):**
*శ్వాస వాత హరం స ఆమ్లం లవణం, రుచి దీప్తి కృత్*
*కఫ కాస హరం, బాల రోగఘ్నం గార్ధభీ పయః*

దీనికి ఔషధ గుణాలు ఎక్కువ. వయసుని బట్టి పావు చెంచా నుండి ఐదు చెంచాల వరకు మాత్రమే సేవించాలి. వాతహరంగా పని చేసి ఉబ్బసం వంటి ఆయాసాలను తగ్గిస్తుంది. కఫాన్ని తొలగిస్తుంది. శిశువులకు కలిగే అన్ని రోగాలకూ ఇది ఉత్తమ ఔషధంతో సమానం.


ఈ విధంగా ఆవు పాలు, గేదె పాలు, అనంతరం మేకపాలు దేహపోషణార్థం ఉపకరిస్తాయి. నేరుగా పాలు తాగటం, పాయసాలు తయారు చేయటం, శాకపాకాలలో వాడటం వంటి వివిధ పద్ధతుల్లో సేవిస్తుంటాం. గాడిద పాలను కేవలం ఔషధ పరంగా వాడుతుంటాం. పాల మీగడ చాలా ఎక్కువ స్నిగ్ధంగా ఉండి, అతి చిక్కగా మృదువుగా గురుతరంగా దేహపోషణకు ఉపకరిస్తుంది. పెరుగును చిలకడం ద్వారా వెన్న లభిస్తుంది. దీనినే సంస్కృతంలో నవనీతం అంటారు.



అతి మృదువుగా ఉండి, కొవ్వుని కరిగించే గుణం కలిగి ఉంటుంది. అందుకే ఇది స్థూల కాయాన్ని తగ్గిస్తుంది. వెన్నను మరిగించి నెయ్యి (ఘృతం) తయారుచేస్తారు. ఇది అగ్నివర్ధకం. పిత్తహరం.

పచ్చ గడ్డి, తెలగపిండి, చిట్టు, తౌడు ఆహారంగా సేవించే దేశీ ఆవుల పాలు, వాటి ఉత్పత్తులు మాత్రమే ఆరోగ్యకరమని గుర్తుంచుకోవాలి. ఈనాడు జెర్సీ ఆవులు, వాటికిచ్చే విచిత్ర ఆహారాలు, అధికపాల కోసం వాటికిచ్చే కెమికల్ ఇంజక్షన్లూ... వీటివల్ల పేరుకి ఆవుపాలైనా అనర్థాలే అధికమని శాస్త్రజ్ఞుల పరిశోధనలలో కనిపిస్తోంది.

ఆధునిక జీవరసాయనిక శాస్త్రం రీత్యా... పాలు బలవర్ధక సమీకృత ఆహారమే. మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వులు సమతుల్యంగా ఉంటాయి. విటమిన్లు డి, బి 12, బి 6, బి 2 లభిస్తాయి. ఎ, డి లు కూడా కొంతవరకు లభిస్తాయి. సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్, కాల్షియాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలకు, ఇతర ధాతువులకు బలాన్ని కలుగచేస్తాయి. స్థూలకాయులు, మధుమేహ రోగులు పాలు సేవించవచ్చని, చెడు కాదని పరిశోధకుల పరిశీలన. పాలలోని లాక్టోజు పడకపోతే మాత్రం వాంతులు, విరేచనాల వంటివి కలుగుతాయి. వైద్యుని సంప్రదించడం, పాలు సేవించడం మానెయ్యటం వంటి జాగ్రత్తలు అవసరం.



**– డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి** ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్, ఫోన్: 9963634484

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
8-2-2020

యంగ్ బాలీవుడ్ -13 / అర్జున్ కపూర్

# యుద్ధానికి ఒక్కడు

**తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లి నైరాశ్యంలో మునిగిపోయింది. డిప్రెషన్‌లో తిని తిని 140 కేజీల బరువు పెరిగాడు. చదువు రాలేదు. సినిమాల్లో పని చేస్తే ఎప్పటికి గట్టెక్కుతాడో తెలియదు. తను ఒక్కడు. ఎదురుగా కనిపిస్తున్నది అంతూ దరీ లేని జీవన సాగరం. అర్జున్ కపూర్ చేసిన యుద్ధం కఠినమైనది. అన్ని కెరటాలను దాటి అతడు గట్టు చేరగలిగాడు.**

అర్జున్ కపూర్‌కు చిన్నప్పుడు కార్ల పిచ్చి. పిల్లలు ఆడుకునే కార్లు. పిల్లలు నడిపే కార్లు. అసలు కార్ల వలే కనిపించే పిల్లల కార్లు. కారు కొనివ్వమని తండ్రిని కోరేవాడు. దేశ విదేశాల పిల్లల కార్లు తెప్పించమని అడిగేవాడు. తండ్రి వాటి ఎందుకు తేడు? అతడు ప్రసిద్ధ నిర్మాత బోని కపూర్. ఎంతో డబ్బు ఉంది. తెస్తాడు. ఒకటి కాదు రెండు కాను 500 కార్లు చిన్నప్పుడు అర్జున్ కపూర్ దగ్గర ఉండేవి. కీ ఇచ్చేవి, బ్యాటరీతో నడిచేవి, రిమోట్ మీద పని చేసేవి....

అవన్నీ ఒకరోజు మంత్రించినట్టు ఆగిపోయాయి. కదల్లేదు. మెదల్లేదు. వాటి నోరు పడిపోయినట్టయ్యింది.

అది 1996. అప్పటికి అర్జున్‌కపూర్ వయసు 11 ఏళ్లు. సరిగ్గా అప్పుడే బోనికపూర్ శ్రీదేవిని పెళ్లి చేసుకుని ఆ ఇల్లు విడిచిపెట్టాడు.

• • •

బోనికపూర్ భార్య మోనాకపూర్ ఇది ఊహించలేదు. తనకేం తక్కువ. మంచి కుటుంబం నుంచి వచ్చింది. భర్తకు తోడుగా నిలిచింది. ఇద్దరు పిల్లలను కంది. ప్రొడ్యూసర్‌గా సినిమాలు తీసింది. టీవీ షోస్ చేసింది. ఇన్ని చేస్తూ కుటుంబాన్ని, భర్తను చూసుకుంటూ ఉంటే బోని కపూర్‌ది ఈ నిర్ణయం. అర్జున్ కపూర్ చిన్న పిల్లాడు. కూతురు అన్షులా ఇంకా చిన్నపిల్ల. బోని కపూర్-శ్రీదేవిల పెళ్లిని బోనికపూర్ కుటుంబం అంగీకరించలేదు. బోని కపూర్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాక కూడా మోనాకపూర్ మామగారు, నిర్మాత సురీందర్ కపూర్ కోడలిని ఇంట్లోనే ఉండమన్నాడు. పిల్లల బాగోగులు తనే చూశాడు. కాని ఊహించని ఈ దెబ్బకు మోనాకపూర్ విలవిల్లాడింది. పూర్తిగా తెగదెంపులు చేసుకున్నట్టుగా భర్త వెళ్లిపోవడంతో ఆమె హైపర్‌టెన్షన్‌తో మంచం పట్టింది. ఇదంతా అర్జున్ కపూర్ చూసేవాడు. అతనికి తల్లంటే చాలా ఇష్టం. తండ్రి లేని ఈ రోజులలో ఇంకా కష్టం. ఒక రెక్క కింద తల్లిని, ఒక రెక్క కింద చెల్లిని అతడు పెట్టుకుని ఇంట్లో ఉండిపోయాడు. చదువు తలకెక్కలేదు. టెన్త్ వరకు చదివాడు అంతే. ఆలోచనలు అంతూదరి లేకుండా సాగిపోయేవి. మరోవైపు తండ్రి తన మారుతల్లితో మరో ఇద్దరుపిల్లలతో ఆ లోకం వేరు అన్నట్టుగా కనిపిస్తూ ఉండేవాడు. వాళ్ల వార్తలు తెలుస్తూ ఉండేవి. ఈ వొత్తిడి అంతా పని చేసింది. తినడం మొదలెట్టాడు. ఒక్క పట్టున మూడు బర్గర్‌లు లాగించేసేవాడు. బరువు పెరిగాడు. పెరిగాడు. పెరిగాడు. 140 కేజీలు పెరిగాడు. ఇప్పుడు ఏం చేయాలి?

• • •

తెలిసింద ఒక్కటే. సినిమా పరిశ్రమ. 'కల్ హో న హో' సినిమాకు దర్శకత్వ శాఖలో చేరాడు. దర్శకుడు కావాలని అతడికి ఉండేది. కాని తన శరీరం పెరిగిపోవడంతో ఆత్మవిశ్వాసంతో ఉండేవాడు కాదు. ఇంటి వ్యధ, ఈ శరీర న్యూనత అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసేది. కొడుకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడని తెలిసి బోని అతణ్ణి తను తీస్తున్న 'నో ఎంట్రీ' (పెళ్లాం ఊరెళితే) సినిమాకు దర్శకత్వ శాఖలో పెట్టాడు. అప్పుడే ఆ సినిమాలో నటిస్తున్న సల్మాన్‌ఖాన్‌కు అర్జున్ కపూర్ బాగా దగ్గరయ్యాడు. తర్వాత బోని కపూరే నిర్మించిన 'వాంటెడ్' (పోకిరి) సినిమాకు కూడా అర్జున్ కపూర్ దర్శకత్వ శాఖలో పని చేశాడు. కష్టపడి పని చేసే తత్త్వం ఉంది... తన మానాన తానుంటాడు... డీసెంట్ బిహేవియర్... అన్నింటికి మించి సీన్ చెప్పేటప్పుడు ఒక ఎక్స్‌ప్రెషన్‌తో చెబుతున్నాడు... ఇవన్నీ గమనించిన సల్మాన్‌ఖాన్ ఒక రోజు షూటింగ్ అయిపోయాక అర్జున్ కపూర్‌ని పిలిచి 'నువ్వెందుకు ఈ పని చేస్తున్నావ్. యాక్టింగ్ చెయ్' అన్నాడు. అర్జున్‌కపూర్ షాక్ అయ్యాడు. 'ఈ 140 కేజీల శరీరంతోనా?' అన్నాడు. 'నువ్వు నాతో ఉండు... నీ బరువు నేను తగ్గిస్తాను' అన్నాడు సల్మాన్‌ఖాన్. అర్జున్ కపూర్ సల్మాన్ ఖాన్‌ను తన గురువుగా చేసుకున్నాడు. నాలుగేళ్లు సల్మాన్‌తో ఉన్నాడు. బరువు తగ్గాడు. దాదాపు యాభై కేజీల బరువు తగ్గాడు. యాభై కేజీలు! ఇప్పుడు అతడు అన్ని విధాలుగా హీరో కావడానికి రెడీ. కాని అర్జున్ మనసులో ఒకటే పట్టుదల... తండ్రి ద్వారా మాత్రం నటుడిగా లాంచ్ కాకూడదు అని.




• • •

అర్జున్ కపూర్ ఇప్పుడు తన ఫొటోలు గట్రా పట్టుకొని స్టుడియోలకు తిరగడం మొదలుపెట్టాడు. తండ్రికి అంత పేరు ఉంది. బాబాయ్ అనిల్ కపూర్ సూపర్‌స్టార్. పిన్ని శ్రీదేవి మరో సూపర్‌స్టార్. ఎవరు సాయం చేసినా క్షణాల్లో ఏదో ఒక సినిమాలో హీరో అవుతాడు. కాని తన కృషి, పట్టుదల, ప్రతిభతో హీరో అవ్వాలనుకున్నాడు అర్జున్ కపూర్. యశ్‌రాజ్ ఫిల్మ్స్‌లో జరిగే ఆడిషన్స్‌కు హాజరయ్యాడు. కాని దాని అధినేత ఆదిత్య చోప్రాకు అర్జున్ కపూర్ మీద నమ్మకం కుదరలేదు. వెనక్కు పంపించేశాడు. అర్జున్ కపూర్ నిరాశ పడలేదు. ఇంటికి వెళ్లి నటన మీద మరింత దృష్టి పెట్టాడు. కష్టం చేశాడు. మూడు నెలల తర్వాత అదే యశ్‌రాజ్ స్టుడియోకు వచ్చి మళ్లీ ఆడిషన్స్ ఇచ్చాడు. ఆ పట్టుదల ఆదిత్యా చోప్రాకు నచ్చింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు సినిమాలకు కాంట్రాక్ట్ సైన్ చేయించాడు. యశ్‌రాజ్ ఫిల్మ్స్‌లో మూడు సినిమాలంటే మాటలు కాదు. ఈ విషయం పరిగెత్తుకుంటూ వచ్చి తల్లికి చెప్పాడు. అప్పటికే ఆమె కేన్సర్ బాధితురాలు. కొడుకు చెప్పిన వార్తకు సంతోషంతో ఏడవడం మొదలుపెట్టింది. కొడుకు మొదటి సినిమా 'ఇష్క్‌జాదే' మొదలైతే సంతోషంతో తబ్బిబ్బు అయ్యింది. కాని ఆమె సంతోషం పూర్తిగా తీరలేదు. మరో నెలలో ఆ సినిమా విడుదలవుతుందనగా ఆమె చావుకు సమీపించింది. ఆమె చేసిన చివరి కాల్ సల్మాన్ ఖాన్‌కే. 'నా కొడుకును ఒక స్థితికి తెచ్చావు. నీకు చాలా థ్యాంక్స్' అని సల్మాన్‌కు కృతజ్ఞతలు చెప్పిందామె. తర్వాత ఈ లోకాన్ని వీడింది.

• • •

తండ్రితో మానసిక దూరం, ఇప్పుడు తల్లితో భౌతికదూరం... అర్జున్ మీద ఒత్తిడి కొనసాగింది. కాని తానొక మంచి నటుడు అని నిరూపించుకోవడానికి కష్టపడి పని చేశాడు. 'ఇష్క్‌జాదే' పెద్ద హిట్ అయ్యింది. ఆ వెంటనే 'ఔరంగజేబ్' సినిమాలో డబుల్ యాక్షన్ చేశాడు. ఆడలేదు. కాని రణ్‌వీర్ సింగ్‌తో చేసిన 'గూండే' సినిమా మాస్ హిట్ అయ్యింది. పంజాబీవాడుగా నటించిన '2 స్టేట్స్' ఎంత పెద్ద హిట్ అంటే నూరు కోట్ల కలెక్షన్ సాధించిన అర్జున్ కపూర్‌కు విపరీతమైన క్రేజ్ తీసుకొచ్చింది. ఈ సినిమాతో అర్జున్ కపూర్ ఎస్టాబ్లిష్డ్ స్టార్ అయ్యాడు. ఎంతగా స్టార్ అంటే తండ్రి అతడి డేట్స్ తీసుకుని 'తేవర్' (తెలుగులో ఒక్కడు) తీసేంతగా.

• • •

అర్జున్ కపూర్ తన ప్రయోగాలు కొనసాగించాడు. హౌజ్‌హజ్బెండ్‌గా అతడు నటించిన 'కి అండ్ కా' పెద్దగా ఆడలేదు. శ్రద్ధాకపూర్‌తో నటించిన 'హాఫ్‌గర్ల్‌ఫ్రెండ్' యావరేజ్‌గా నిలిచింది. బాబాయ్ అనిల్‌కపూర్‌తో నటించిన 'ముబారకన్' యావరేజ్‌గా నిలచింది. కాని అర్జున్ కపూర్ భారీగా ఆశలు పెట్టుకున్న భారీ చిత్రం 'పానీపట్'. 'లగాన్', 'జోధా అక్బర్' వంటి బ్లాక్‌బస్టర్స్ తీసిన అషుతోష్ గోవారికర్ ఈ సినిమాను అంతే భారీగా తీశాడు. మరాఠాలకు అఫ్ఘన్‌లకు జరిగిన మూడవ పానిపట్ యుద్ధం ఈ సినిమా. అర్జున్‌కపూర్ మరాఠాగా నటించాడు. కాని సినిమా విడుదలయ్యాక అందులో మరాఠాలను సరిగ్గా చూపలేదని అత్యంత కీలకమైన తొమ్మిది నిమిషాల సీన్‌ను తీసేయాల్సి వచ్చింది. దాంతో ఆ సినిమా నడుము విరిగింది. అర్జున్ కపూర్‌కు ఇది పెద్దదెబ్బ. కాని యుద్ధం తెలిసినవాడు కత్తి వదలడు. అర్జున్ ఇప్పుడు 'సందీప్ ఔర్ పింకీ ఫరార్' అనే కామెడీ సినిమాలో నటిస్తున్నాడు.

• • •

అర్జున్ కపూర్‌కు చాలామంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు. సల్మాన్ ఖాన్ చెల్లెలు అర్పిత, అతడి తొలి హీరోయిన్ పరిణితి చోప్రా, అనుష్క శర్మ... వీరు అతని గర్ల్‌ఫ్రెండ్స్‌గా ఉన్నారు. ప్రస్తుతం అతడు ఒక బిడ్డ తల్లి అయిన మలైకా అరోరాతో డేటింగ్‌లో ఉన్నాడు.


• • •

అర్జున్ కపూర్ ఎదుటివారిని ఆశ్చర్యపరిచే పనులు మరిన్ని చేయవచ్చు. కాని అవన్నీ అతడు చేస్తున్న యుద్ధానికి ఒక కొనసాగింపుగానే అర్థం చేసుకోవాలి.

**– సాక్షి ఫ్యామిలీ**



పర్యావరణం



**వేసవి కాలం వస్తోంది. ఈ కాలం తాగడానికి చల్లని నీళ్లు తప్పనిసరి అవసరం. రోజులో ఎక్కువ సేపు చల్లగా ఉండే బాటిళ్లు కొన్ని అందుబాటులోకి వచ్చేశాయి. అయితే, అవి బోలెడంత ఖరీదైనవి. పైగా వాటిలో ప్లాస్టిక్ బాటిళ్లే ఎక్కువ. పర్యావరణానికి హానికారకంగా ఉన్న ప్లాస్టిక్‌ను దూరం చేయాలంటే సహజసిద్ధమైన ఉత్పాదనల ద్వారా మన నిత్యావసరాలు తీరాలి. ఆ ఆలోచనలోంచి పుట్టిందే వెదురు బొంగుతో తయారు చేసిన నీళ్ల బాటిళ్లు.**



# వెదురు బాటిళ్ల నీళ్లు ఎంతో చల్లన

'జూర్ నాయి బాన్హ్, తార్ నాయి ఖాహ్' అని అస్సామీలో ఓ సామెత ఉంది. అంటే 'వెదురు లేని వ్యక్తికి ధైర్యం లేదు' అని దీనర్థం. నిత్యం వెదురుతోనే దోస్తీ చేస్తూ ప్లాస్టిక్‌కు వీడ్కోలు పలికి ప్రకృతివైపు వెళ్లడానికి ఎక్కువ మందిని ప్రభావితం చేసిన వ్యక్తి ధృతిమాన్ బోరా. అస్సాంలో వెదురు వస్తువుల తయారీ సంస్థ వ్యవస్థాపకుడు. వెదురు నుండి పర్యావరణ అనుకూల వస్తువులను తయారుచేస్తున్న బోరా ఈ బయో-డిగ్రేడబుల్ బాటిళ్లను నీళ్ల లీక్ కానివిధంగా తయారు చేశాడు. సీసా మూత కార్క్ అంటే వెదురుముక్కతో తయారుచేసి బిరడాలా బిగించడంతో ఇది నీళ్లను బయటకు రానివ్వదు. ఈ వెదురుబొంగు బాటిళ్లను పరిచయం చేయడానికి ధృతిమాన్‌కి 17 ఏళ్ళకు పైగానే పట్టింది. సుమారు 20 ఏళ్ల క్రితం ధృతిమాన్ బోరా పన్నెండవ తరగతితో చదువును ఆపేస్తానని తల్లిదండ్రికి ధైర్యంగా చెప్పేశాడు. జీవితంలో ఎలా నిలదొక్కుకుంటాడో అని భయపడిన తల్లి దండ్రులకు పై చదువులకు బదులుగా వెదురుతో రకరకాల ఫర్నీచర్‌ను తయారుచేసే వ్యాపారాన్ని ప్రారంభించి వారికి వెన్నుదన్నుగా నిలిచాడు.



**పెరటి తోట నుంచి స్ఫూర్తి**

అస్సాం ప్రధాన నగరమైన గౌహతికి ఈశాన్యంగా 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన ఇంటి పెరటిలోనే వెదురు తోటలు ఉండేవి. వీటి నుంచే తన కలలకు వారధి కట్టుకున్నాడు బోరా. దృఢమైన, మన్నికైనా వెదురును కనుక్కొని డిబి ఇండస్ట్రీస్‌ను 20 ఏళ్ల వయసులోనే నెలకొల్పాడు. అతని సంస్థ ద్వారా వెదురు వస్తువులు విక్రయిస్తుంటాడు. కొనుగోలుదారులను తన ఉత్పత్తులవైపు ఆకర్షించడానికి ఏదైనా ప్రత్యేకమైన వస్తువును కనుక్కోవాలని నిర్ణయించుకున్నాడు. రకరకాల పనులు చేస్తూనే వెదురు నీటిబాటిల్ తయారీలో నిమగ్నమయ్యేవాడు. ఇప్పుడు ఏడాదిలోగా ఒక్క అస్సాంలోనే కాకుండా దేశంలోని చాలా ప్రాంతాల నుంచి వెదురు బాటిళ్లలో నీళ్లు తాగాలనుకునేవిధంగా ఇవి ఆకర్షించాయి. ఈ బాటిళ్లు వేర్వేరు పరిమాణాలలో రూ.400 నుంచి రూ.600 మధ్య లభిస్తున్నాయి.

**అవరోధాలను అధిగమిస్తూ..**

'సహజమైన ఉత్పత్తి కావడంతో ఈ బాటిళ్లలో పోసిన నీళ్లు చల్లగా, శుభ్రంగా ఉంటాయి. ఇది గట్టిగా ఉండటంతో సులువుగా పగిలిపోదు. బొంగు కాబట్టి తేలికగానూ ఉంటుంది. దీనిని ఎక్కడికైనా తీసుకుపోవచ్చు' అని చెబుతాడు బోరా. 'మా సెంటర్లో పతి నెలా 1500 వరకు వెదురు బాటిళ్లను ఉత్పత్తిచేస్తాం. డిమాండ్‌కు తగ్గట్టు మిషనరీ తెప్పించుకోవడం, తయారు చేసిన సరుకును మార్కెట్‌కు చేర్చడం ఒక సవాల్..' అంటాడు బోరా.

బోరా వెదురు బాటిల్‌కు పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఈ బాటిళ్ల తయారీదారుల్లో కొంతమంది చైనీయులు ఉన్నారు. వీరు గ్లాస్, స్టీల్ క్యాప్స్‌తో ఉన్న బాటిల్స్ అమ్ముతున్నారు. అవి పూర్తిగా సేంద్రీయమైనవి కాదు. ఇవన్నింటి దృష్ట్యా బోరా బాటిల్స్‌కు పేటెంట్ రాలేదు. ప్లాస్టిక్ బాటిల్స్‌కు ప్రత్యామ్నాయం గురించి ఇప్పటికీ చాలా మందికి తెలియదు. అందువల్ల వారు ఎదుర్కొంటున్న అవరోధాలను అధిగమిస్తూ ఈ బాంబూ బాటిల్స్ ద్వారా ఒక అవగాహన కల్పించవచ్చు.

**– ఆరెన్నార్**

పరిపరిశోధన

## రోజులపాటు మన్నే బ్యాటరీలు



స్మార్ట్‌ఫోన్ ఎంత లేటెస్ట్ మోడల్ కొన్నప్పటికీ రోజుకోసారి బ్యాటరీని రీఛార్జ్ చేసుకోవాల్సిందే. కొన్ని మోడళ్ల ఫోన్ల బ్యాటరీలైతే.. అకస్మాత్తుగా పేలిపోతూంటాయి. ఈ రెండు సమస్యలకు పరిష్కారం కనుక్కున్నామని అంటున్నారు మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) శాస్త్రవేత్తలు. మనం వాడే లిథియం అయాన్ బ్యాటరీ డిజైన్, అందులో వాడే పదార్థాల కారణంగా అవి ఎక్కువ విద్యుత్తును నిల్వ చేసుకోలేవని, అప్పుడప్పుడూ కాలిపోయేందుకు అవకాశం ఎక్కువ అవుతుందని చాలాకాలంగా తెలుసు. బ్యాటరీలో ఎలక్ట్రాన్లు అటు ఇటు ప్రవహించేందుకు ఇప్పటిలా ద్రవ పదార్థాలు కాకుండా ఘన పదార్థాలు వాడటం ద్వారా బ్యాటరీలు పేలిపోయే సమస్యను అరికట్టవచ్చునని.. అలాగే బ్యాటరీలోని ఆనోడ్‌లను రాగి, గ్రాఫైట్‌ల మిశ్రమంగా కాకుండా పూర్తిగా లిథియంతోనే తయారు చేస్తే ఎక్కువ విద్యుత్తును నిల్వ చేయవచ్చునని ఇటీవలి పరిశోధనలు రుజువు చేశాయి. అయితే ఎలా అన్నది మాత్రం తెలియరాలేదు. ఈ లోపాన్ని కాస్తా ఎంఐటీ శాస్త్రవేత్తలు అధిగమించారు. ఎంఐఈసీ, ఈఎల్ఐ అనే రెండు ప్రత్యేక పదార్థాలను తేనెతుట్టెలోని షడ్భుజి ఆకారంలో తయారు చేయడం, లిథియం పూత పూయడం ద్వారా సరికొత్త బ్యాటరీ నిర్మాణాన్ని ఎంఐటీ శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్నారు. ఇలా తయారు చేసిన బ్యాటరీలను తాము పరిశీలించి చూశామని మంచి ఫలితాలు గమనించామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జూ లీ తెలిపారు. కాథోడ్ నిర్మాణంలోనూ కొన్ని మార్పులు చేయడం ద్వారా మూడు రోజులకు ఒకసారి మాత్రమే ఛార్జ్ చేసుకోగల సరికొత్త బ్యాటరీలను తయారు చేయవచ్చునని చెప్పారు. పరిశోధన వివరాలు నేచర్ ఎనర్జీ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

## మధుమేహ నియంత్రణకు కొత్త మార్గం



మధుమేహాన్ని నియంత్రించేందుకు యేల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు సరికొత్త మార్గాన్ని గుర్తించారు. ఉపవాసం ఉన్నప్పుడు మన శరీరంలో టీఈటీ3, హెచ్ఎస్ఎఫ్4ఏ అనే రెండు ప్రొటీన్లు కాలేయంలో పేరుకుపోతాయని, ఫలితంగా గ్లూకోజ్ ఉత్పత్తి ఎక్కువ అవుతుందని యేల్ వైద్యశాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిలో శరీరంలోకి ఆహారం ప్రవేశించిన వెంటనే ఈ రెండు ప్రొటీన్లు పేరుకుపోవడం ఆగిపోతుందని, టైప్-2 మధుమేహం ఉన్నవారిలోమాత్రం అలాగే కొనసాగుతూంటుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త షూచెన్ ర్యూంగ్ తెలిపారు. ప్రొటీన్లు పేరుకుపోయే ప్రక్రియను ఆపేందుకు మరో పద్ధతి ఉండవచ్చునన్న అంచనాతో పరిశోధనలు ప్రారంభించిన శాస్త్రవేత్తలు అందులో విజయం సాధించారు కూడా. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో శాస్త్రవేత్తలు వైరస్‌లలోకి స్మాల్ ఇంటర్‌ఫెరింగ్ ఆర్ఎన్ఏలు జొప్పించి ఆ రెండు ప్రొటీన్లపైకి ప్రయోగించారు. ఇది కాస్తా ప్రొటీన్ల మోతాదును తగ్గించినట్లు గుర్తించారు. అదేసమయంలో రక్తంలో గ్లూకోజ్ మోతాదు కూడా తగ్గింది. అంతేకాదు.. టీఈటీ3 ప్రొటీన్ లివర్ సైరోసిస్‌కు దారితీసే ఫైబ్రోసిస్ లక్షణాలకూ కారణమవుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అంటే మధుమేహ చికిత్సకు వాడే మందులతోనే లివర్ ఫైబ్రోసిస్‌కూ చికిత్స కల్పించవచ్చునన్నమాట. ప్రస్తుతం లివర్ ఫైబ్రోసిస్‌కు ఎలాంటి చికిత్స లేకపోవడం గమనార్హం. మధుమేహ నియంత్రణకు సంబంధించిన వివరాలు నేచర్ కమ్యూనికేషన్ తాజా సంచికలో ప్రచురితం కాగా.. ఫైబ్రోసిస్ అధ్యయనం సెల్ రిపోర్ట్‌లో కనిపించింది.

భలే బ్యాలే

# వాసవి అంటే భారతి అంటున్నారు

**"జగన్మాత వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి వెలసిన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ పక్కనే ఉన్న ఆచంట గ్రామం మా స్వస్థలం. నిరంతరం ఆ జగజ్జననిని దర్శించుకునేదానిని. శ్రీవాసవి అమ్మవారి అహింసా మార్గం, స్త్రీ సాధికారత, రక్తపాత రహితంగా జటిల సమస్యలను పరిష్కరించటం, ఈ విశ్వానికి ఆ మహాతల్లి ఇచ్చిన సందేశం, అష్టాదశపుర రాజ్యంలోని ప్రజలను కాపాడడం కోసం తాను ప్రాణత్యాగం చేయటం... వంటి అంశాలు నన్ను బాగా ఆకర్షించాయి. ఇది ఒక అద్భుతమైన చారిత్రాత్మక సంఘటన. ఆ తల్లిలోని లక్షణాలన్నీ నాకు స్ఫూర్తిదాయకం' అంటారు కూచిపూడి నాట్యకారిణి ఎస్. పి. భారతి.**





తొమ్మిది సంవత్సరాల ప్రాయంలో చింతా రామమూర్తిగారి దగ్గర నాట్యవిద్యను ప్రారంభించిన భారతి, సుమారు 12 సంవత్సరాలకు పైగా ఆయన దగ్గరే శిక్షణ పొందారు. తండ్రి కీ. శే. శనగవరపు వెంకట సూర్యనారాయణ ప్రసాదరావు ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. తల్లి వెంకట సుబ్బలక్ష్మి, గృహిణి. చిన్నతనం నుంచి తండ్రిగారితో కలిసి యక్షగానాలు చూసేవారు. కోరాడ నరసింహం, ఎస్. వరలక్ష్మి కలిసి నటించిన మోహినీ భస్మాసుర యక్షగానం నరసాపురంలో తన పదేళ్ల వయసులో తండ్రితోపాటు వెళ్లి చూశాక, నాట్యం మీద అభిలాష కలిగిందంటారు భారతి. ఆమె జీవన యానం ఆమె మాటల్లోనే...

**నాన్న గాంధేయవాది**

ఆడపిల్లలకు చదువు చెప్పించాలనే గాంధేయవాది మా నాన్నగారు. నన్ను కూచిపూడి గురువులైన చింతా రామమూర్తి గారి దగ్గర చేర్పించారు. పాలకొల్లు నుంచి నరసాపురం వరకు సైకిలు మీద తీసుకెళ్లేవారు. కొంతకాలానికే మా కోసం నరసాపురంలో మాస్టారి ఇంటి దగ్గర ఇల్లు కొన్నారు. అప్పట్లో వారం రోజులూ క్లాసులు ఉండేవి. నాట్యం నేర్చుకుంటూనే చదువుకున్నాను. మాస్టారితో కలిసి దేవీ నవరాత్రులు, శ్రీరామనవమి సందర్భాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చాను. ఇంటర్ అయిపోగానే మా మేనమామ పెండ్యాల శాంతారావుతో నా వివాహం జరిగింది. డిగ్రీ అయ్యేవరకు కాపురానికి పంపనని చెప్పి, వారి అంగీకారంతోనే మా వివాహం చేశారు. బిఎస్సీ వరకు చదివించారు. మా వారు పట్టుబట్టి నాతో ఎంఏ (నాట్యం) వరకు చదివించారు. నాకు ఇద్దరు బాబులు. పెద్దబాబు జర్మనీలో ఎం.ఎస్ చదువుతున్నాడు. చిన్నబాబు నాట్యప్రదర్శనలలో నాకు సహకరిస్తున్నాడు. వాడికి చిన్నతనం నుంచి నాట్యం మీద అభిలాష ఏర్పడింది.

**అలా అభిరుచి కలిగింది...**

పెనుగొండలో మా పిన్ని వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు, తరచు వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయానికి వెళ్తుండేదాన్ని. అక్కడ అమ్మవారి కథలు వింటున్నప్పుడు 'ఏనాటికైనా వాసవి అమ్మవారి బ్యాలే చేయాలి' అని నిశ్చయించుకున్నాను. కూచిపూడి బాణీలో అమ్మవారి మీద ఎవ్వరూ రూపకాలు రాయలేదు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని నేను కూచిపూడి విధానంలో చేయాలనుకున్నాను. పెనుగొండ దేవాలయం, కృష్ణానందపురి అనే స్వామి వారు నాకు బాగా సహకరించారు.

**వాసవి అంటే భారతి అంటున్నారు**

చారిత్రాత్మకం కాబట్టి తప్పులు చేయకూడదనే ఉద్దేశంతో, ఆర్యవైశ్యుల గురించి పరిశోధన చేశాను. వారి సూచనలు తీసుకున్నాను. ఆ రకంగా ఒక్కో పాత్రను రూపొందించాను. ఒక రూపం రావటానికి ఆరు నెలల సమయం పట్టింది. మొదటి రెండు ప్రోగ్రాములు చేశాక, ఎక్కడెక్కడ తేడాలు వచ్చాయో గమనించుకుని, సరిచేసుకున్నాను. ఈ బ్యాలే చేయటం మొదలుపెట్టాక మంచి గుర్తింపు వచ్చింది. వాసవి అంటే భారతి అని పేరు తెచ్చుకున్నాను.

**ఆవిడ స్త్రీ శక్తికి ప్రతీక**

అమ్మవారు ఆహుతి అయ్యే ఘట్టాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. అమ్మవారు అగ్నిలోకి వెళ్లిపోయి, పెనుగొండలో వెలిశారనే అంశం చూసినప్పుడు, 'అమ్మా! మీరే మా వాసవాంబ' అని నా పాదాలకు నమస్కరిస్తుంటే, నా జన్మ ధన్యమైందనుకుంటాను. ఈ రూపకంలో తుది ఘట్టం ఆత్మాహుతి దృశ్యం. ఇది ప్రేక్షకుల మనసు గెలిచి, వారిని తొమ్మిదవ శతాబ్దంలోకి తీసుకువెళ్లిందని వారు చెబుతుంటే, నాకు ఆనందంగా ఉంటుంది. నేను ఆఖరి సన్నివేశంలో అంతగా నిమగ్నమైపోతాను. వాసవీదేవిని 'స్త్రీశక్తికి ప్రతీక'గా నమ్ముతాను. వాసవి దేవి మీద మొట్టమొదటి పరిశోధన చేసినది నేనే.

– సంభాషణ:
**వైజయంతి పురాణపండ**

10 సంవత్సరాల క్రితం వాసవి అమ్మవారి నృత్యరూపకాన్ని రూపొందించి, ప్రతి సంవత్సరం జనవరి ఫిబ్రవరి మాసాలలో వచ్చే వాసవీదేవి జయంతి, మే మాసంలో వచ్చే ఆత్మాహుతి (వర్ధంతి)కి ప్రదర్శిస్తున్నాను. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీదేవి చరిత్ర, మహాత్మ్యం ఈనాటి యువతకు ఒక అద్భుతమైన సందేశం. ఆ తల్లి మనకు స్ఫూర్తినిచ్చే అనేక అంశాలను 'శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవి' నృత్య రూపకం ద్వారా ప్రజలకు తెలియపరుస్తున్నాను. దండిభొట్ల వైకుంఠ నారాయణ మూర్తి రచించగా, ఆయన సోదరుడు దండిభొట్ల శ్రీనివాస వెంకట శాస్త్రి స్వయంగా సంగీతం, గానం చేశారు. నా శిష్యులంతా పాల్గొంటున్న ఈ నృత్యరూపకంలో నేను వాసవీ దేవి పాత్రను, నా చిన్న కొడుకు పెండ్యాల సూర్య రవి ప్రసాద్ వాసవీదేవి తండ్రి అయిన కుసుమశ్రేష్ఠిగా నటిస్తున్నాడు. నా శిష్యురాలు వసుధ వాసవీ అమ్మవారి తల్లి కుసుమాంబగా వేస్తోంది. ఇందులో మొత్తం 26 మంది నటిస్తున్నారు. ఆదిపరాశక్తి, పార్వతీ దేవి, జగన్మాతల స్వరూపం శ్రీవాసవాంబ అనే విషయాన్ని నా నృత్య రూపకం ద్వారా తెలియచేస్తున్నాను.

**- ఎస్. పి. భారతి**

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
శనివారం
8-2-2020


మహేశ్‌బాబు

## డబుల్ ధమాకా?

బాల నటుడిగా 'కొడుకు దిద్దిన కాపురం' సినిమాలో డబుల్ యాక్షన్ చేశారు మహేశ్‌బాబు. హీరోగా మారిన తర్వాత పూర్తి స్థాయిలో ద్విపాత్రాభినయం చేయలేదాయన. కానీ త్వరలోనే స్క్రీన్‌పై మహేశ్‌ను రెండు పాత్రల్లో చూడబోతున్నాం అని సమాచారం. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మించనున్నారు. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇందులో మహేశ్‌బాబు రెండు పాత్రల్లో కనిపిస్తారని టాక్. అందులో ఒక పాత్ర గ్యాంగ్‌స్టర్‌గా ఉంటే మరోటి ప్రొఫెసర్ పాత్ర అని తెలిసింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ పేరుని పరిశీలిస్తున్నారని సమాచారం. మే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# రొమాంటిక్ పోలీస్!


రవితేజ

బీచ్‌లో ప్రేయసితో ప్రేమరాగం తీస్తున్నారట రవితేజ. 'డాన్ శీను'(2010), 'బలుపు' (2013) చిత్రాల తర్వాత రవితేజ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'క్రాక్' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తున్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బి. మధు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రవితేజ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చీరాలలోని ఓ బీచ్‌లో జరుగుతోందట. అక్కడ ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించే పనిలో బిజీగా ఉంది చిత్రబృందం. ఈ పాట చిత్రీకరణకు ముందు ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు రవితేజ. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం మే8న విడుదల కానుంది.

# బై బై జయేష్


మనీష్ శర్మ, రణ్‌వీర్ సింగ్ దివ్యాంగ్ తక్కర్

పాత్ర ఎలాంటిదైనా అందులోకి సులువుగా ఒదిగిపోగలరు బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్. తన లేటెస్ట్ చిత్రం 'జయేష్‌భాయ్ జోర్దార్' కోసం తుంటరి గుజరాతీ కుర్రాడిలా మారారు. తాజాగా ఆ పాత్రకు బై బై చెప్పారు. నూతన దర్శకుడు దివ్యాంగ్ తక్కర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'జయేష్‌భాయ్ జోర్దార్'. యశ్‌రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై మనీష్ శర్మ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా ద్వారా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ షాలినీ పాండే బాలీవుడ్‌కి పరిచయం కాబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తి కావడంతో ''జయేష్ భాయ్ బై బై'' అన్నారు రణ్‌వీర్.

# అమ్మకు థ్యాంక్స్ - నాగశౌర్య


రమణతేజ, శంకర్ ప్రసాద్, ఉషా మూల్పూరి, నాగశౌర్య, బుజ్జి

''సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందన్నారు. ఆ పాజిటివ్ టాక్ వల్లే మా సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. ఇలాంటి సినిమా నాతో తీసినందుకు అమ్మకు థ్యాంక్స్'' అన్నారు నాగశౌర్య. రమణ తేజ దర్శకత్వంలో నాగశౌర్య, మెహరీన్ జంటగా ఐరా క్రియేషన్స్‌పై ఉషా మూల్పూరి నిర్మించిన చిత్రం 'అశ్వథ్థామ'. జనవరి 31న విడుదలై మా చిత్రం దిగ్విజయంగా ప్రదర్శించబడుతోంది అన్నారు చిత్రబృందం. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా గ్రాండ్ సక్సెస్‌మీట్‌లో నాగశౌర్య మాట్లాడుతూ– ''రమణ తేజకు ఫుడ్, సినిమా.. ఈ రెండే ప్రాణం. అతడిని నమ్మినందుకు సినిమాని బాగా తీశాడు. మరోసారి 'నర్తనశాల' లాంటి సినిమా చెయ్యను'' అన్నారు. నిర్మాత శరత్ మరార్ మాట్లాడుతూ– ''శౌర్య రాసిన కథ నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. తెలుగు సినీ పరిశ్రమకు నాగశౌర్య రూపంలో మరో యాక్షన్ స్టార్ లభించాడు'' అన్నారు. ''ఇప్పటివరకూ చేసిన సినిమాలతో రొమాంటిక్ హీరోగా ప్రూవ్ చేసుకున్నానని, ఈ సినిమాతో యాక్షన్ హీరోగా ప్రూవ్ చేసుకోవాలని శౌర్య అన్నప్పుడు ఆశ్చర్యపోయా. తను కథ బాగా రాసుకున్నాడు'' అన్నారు రచయిత, దర్శకుడు బి.వియస్ రవి.

రమణ తేజ మాట్లాడుతూ– ''శౌర్య నటించిన విధానానికి హ్యాట్సాఫ్. మంచి సినిమాలో నన్ను భాగం చేసినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను'' అన్నారు.

ఉషా మూల్పూరి మాట్లాడుతూ– ''శౌర్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ వచ్చిన చిత్రంగా 'అశ్వథ్థామ' నిలిచినందుకు ఫుల్ హ్యాపీ. ఐరా క్రియేషన్స్‌లో ఇది బిగ్గెస్ట్ హిట్. ఇకముందు కూడా మా బ్యానర్ మంచి సినిమాలు అందిస్తుంది'' అన్నారు.

''ఐరా క్రియేషన్స్ ఏ సినిమా చేసినా టెక్నీషియన్లు, యాక్టర్లు అందరూ ఫ్యామిలీలా పనిచేస్తారు. అది వాళ్ల బలం'' అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. చిత్ర సమర్పకులు శంకర్ ప్రసాద్, లైన్ ప్రొడ్యూసర్ బుజ్జి, సినిమాటోగ్రాఫర్ మనోజ్‌రెడ్డి, ఎడిటర్ గ్యారీ, నటుడు ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

# రాణి మల్లికా


మల్లికా శెరావత్

హాట్ గర్ల్ ఇమేజ్ సొంతం చేసుకున్న మల్లికా శెరావత్ ఇప్పుడేం చేస్తున్నారు? అంటే కెరీర్‌పరంగా జోరు తగ్గిందనే చెప్పాలి. ప్రస్తుతం 'భూ సబ్‌కీ ఫతేగీ' అనే వెబ్ సిరీస్ మాత్రమే చేస్తున్నారామె. ఇప్పుడు ఆమెకు ఓ బంపర్ ఆఫర్ వచ్చింది. తమిళ చిత్రం 'పాంబాట్టన్'లో రాణి పాత్ర చేసే అవకాశం దక్కింది. చిత్రదర్శకుడు వడివుడయాన్ ఇటీవల ముంబై వెళ్లి మల్లికాకు కథ కూడా వినిపించారు. ''కథ విన్న వెంటనే ఆమె నటించడానికి ఒప్పుకున్నారు. ఇందులో రాణి పాత్ర కీలకం. సినిమా మొత్తం ఈ పాత్ర ఉంటుంది'' అని దర్శకుడు పేర్కొన్నారు. గతంలో తమిళంలో కమల్‌హాసన్ నటించిన 'దశావతారం' (2008)లో మల్లికా ఓ కీలక పాత్ర చేశారు. ఆ తర్వాత 'దబాంగ్' రీమేక్ 'ఒస్తే' (2011)లో ఐటమ్ సాంగ్ చేశారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ తమిళంలో ఆమె నటించబోతున్న చిత్రం ఇదే. ఈ సినిమాలో ఆమె ఫైట్స్ కూడా చేస్తారు. అందుకోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారు. ఈ నెలాఖరున మల్లికా పాత్ర చిత్రీకరణ మొదలవుతుంది. విశేషం ఏంటంటే.. ఈ చిత్రం తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ విడుదల కానుంది.

# ఆ పేరొస్తే చాలు


కేథరిన్

''బాక్సాఫీస్ వసూళ్ల గురించి నేను పట్టించుకోను. నా పాత్రకి న్యాయం చేయడానికి 100శాతం కష్టపడతా. నా నటన బాగుందనే పేరు వస్తే చాలనుకునే మనస్తత్వం నాది'' అని కేథరిన్ అన్నారు. విజయ్ దేవరకొండ హీరోగా క్రాంతిమాధవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్, ఇజాబెల్లే లెయితే కథానాయికలుగా నటించారు. కె.ఎస్. రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎ. వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కేథరిన్ మాట్లాడుతూ– ''ప్రేమ, పెళ్లి, అనుబంధాలు వంటి అంశాలను 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రంలో చక్కగా చెప్పారు. ఆధునిక ఆలోచనలతో స్వంతంత్ర భావాలున్న స్మిత అనే అమ్మాయి పాత్రలో నటించాను. ఈ పాత్ర నా నిజ జీవితానికి దగ్గరగా ఉంటుంది. నేనొక బొగ్గు గనిలో పని చేస్తుంటాను. ఆ ప్రాంతంలో పని చేసే హీరోతో నాకున్న అనుబంధం ఏంటి? అతని జీవితంపై నా ప్రభావం ఎంత? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఈ చిత్రంలో నలుగురు కథానాయికలు ఉన్నా అందరికీ ప్రాధాన్యత ఉంటుంది. ఇద్దరు ముగ్గురు కథానాయికలు ఉన్న చిత్రాల్లో నటించడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. విజయ్ దేవరకొండతో పని చేయడం మంచి అనుభూతినిచ్చింది. సెట్స్‌లో ప్రశాంతంగా ఉంటూ పనిలో మాత్రం పర్‌ఫెక్షన్ కనబరచాలని తపిస్తాడు. ఇది నా కెరీర్‌లో విభిన్న చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. సవాల్‌తో కూడిన పాత్రలు చేసి, ప్రేక్షకుల అభిమానం పొందాలనుకుంటున్నా'' అన్నారు.

# క్లాప్ కొట్టారు


కిరణ్ అబ్బవరం

'రాజావారు రాణివారు' ఫేమ్ కిరణ్ అబ్బవరం హీరోగా, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంకా జవాల్కర్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. శ్రీధర్ గదె ఈ సినిమాతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ఎలైట్ ఎంటర్‌టైన్మెంట్స్ ప్రొడక్షన్స్‌లో వస్తోన్న తొలి చిత్రం ఇది. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా క్లాప్ ఇచ్చారు. ప్రముఖ నటుడు సాయికుమార్ ఈ సినిమాలో కీలక పాత్ర చేస్తున్నారు. తులసి, శ్రీకాంత్, కశ్యప్ శ్రీనివాస్, అరుణ్ నటిస్తున్న ఈ సినిమాకు 'ఆర్ ఎక్స్ 100' ఫేమ్ చేతన్ భరద్వాజ్ స్వరకర్త.

# నీలి నీలి ఆకాశం..

యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించటం ఎలా?'. అమృతా అయ్యర్ కథానాయికగా నటించారు. మున్నా దర్శకత్వంలో ఎస్వీ బాబు నిర్మించారు. చంద్రబోస్ సాహిత్యం అందించగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నీలి నీలి ఆకాశం..' పాటకి మంచి ఆదరణ రావడంతో ఆ పాట విజయోత్సవాన్ని నిర్వహించారు. మున్నా మాట్లాడుతూ– ''మా సినిమాలోని 'నీలి నీలి ఆకాశం..' పాటను మొదట చూసిన ప్రేక్షకుడు హీరో మహేశ్‌బాబుగారు. ఆయనే ట్వీటర్ ద్వారా రిలీజ్ చేశారు. ఈ పాటను అందరూ పాడుతున్నారు. అనూప్ రూబెన్స్ గొప్ప ట్యూన్ ఇస్తే, చంద్రబోస్ గారు గొప్ప సాహిత్యం అందించారు'' అన్నారు. ''ఈ పాటను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు అనూప్ రూబెన్స్. ''ఒక పాటకు విజయోత్సవం జరగడం ఇదే మొదటిసారి'' అన్నారు చంద్రబోస్. ''నీలి నీలి ఆకాశం..' పాట అద్భుతాలు సృష్టించింది'' అన్నారు గాయని సునీత. ''ఈ పాటను ఇంత పెద్ద హిట్ చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు ఎస్వీ బాబు. ''నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇది'' అన్నారు అమృతా అయ్యర్. ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా డైరెక్టర్ మున్నా అసలు పేరు ప్రదీప్. అంటే ఈ సినిమాకి ఇద్దరు ప్రదీప్‌లు పని చేశారు. 'నీలి నీలి ఆకాశం..' పాటను మహేశ్‌బాబుగారు విడుదల చేయడం వల్ల ప్రపంచంలోని తెలుగువాళ్లందరికీ చేరువయింది. త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు.


అమృత, ప్రదీప్

# భావోద్వేగాల హరి

ప్రముఖ నిర్మాత ఎం.ఎస్. రాజు దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'డర్టీ హరి'. శ్రవణ్ రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నారు. సిమ్రత్ కౌర్, రుహాణి శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. గూడూరు సతీష్ బాబు, గూడూరు సాయి పునీత్ నిర్మిస్తున్న ఈ సినిమా రీ–రికార్డింగ్ మొదలయింది. నిర్మాతలు మాట్లాడుతూ– ''రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది. ఇందులో బోల్డ్ అంశాలతో పాటు సున్నితమైన, భావోద్వేగభరితమైన సన్నివేశాలు ఉంటాయి. రొమాన్స్‌ని దర్శకుడు చాలా పొయెటిక్‌గా చూపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలు తీసిన దర్శక–నిర్మాత ఎం.ఎస్. రాజుగారికి ఇది కమ్‌బ్యాక్ చిత్రం అవ్వడంతో భారీ అంచనాలున్నాయి. త్వరలోనే టీజర్‌ని విడుదల చేసి, సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అన్నారు.


సిమ్రత్, శ్రవణ్

# మహా శివరాత్రికి శివలింగాపురం


సురేష్, మధుబాల

ఆర్.కె. సురేష్, మధుబాల జంటగా తోట కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివలింగాపురం'. రావూరి అల్లికేశ్వరి సమర్పణలో అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రావూరి వెంకట స్వామి మాట్లాడుతూ– ''కుటుంబ సమేతంగా చూడదగ్గ భక్తిరస చిత్రమిది. శివలింగాపురం అనే గ్రామంలో అత్యంత మహిమగల శివలింగం దొంగలించబడుతుంది. ఆ శివలింగాన్ని విద్రోహుల చెర నుంచి ధైర్య సాహసాలతో ప్రాణాలకు తెగించి హీరో ఎలా రక్షించాడు? అనే కథని తోట కృష్ణ చక్కగా తెరకెక్కించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న మా సినిమాని తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో మహా శివరాత్రి పర్వదినాన విడుదల చేస్తున్నాం'' అన్నారు. డీఎస్ రావు, బేబీ హర్షిత తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఘన శ్యామ్.







సాక్షి బిజినెస్
శనివారం
8-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 164 ▼ | 40 ▼ |
| 41,142 | 12,098 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30కి)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,560 | ▼ | 12 |
| డోజోన్స్ | 29,176 | ▼ | 204 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,467 | ▼ | 38 |
| డాక్స్ | 13,514 | ▼ | 61 |
| షాంఘై | 2,876 | ▲ | 9 |
| నికాయ్ | 23,823 | ▼ | 46 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.52 | 72.16 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.72 | 93.95 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.94 | 79.81 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.72 | 66.11 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.93 | 49.10 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.62 | 52.37 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.29 | 19.85 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.97 | 19.98 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.58 | 10.99 |

# మారుతీ కొత్త 'ఇగ్నిస్' ఆవిష్కరణ




**గ్రేటర్ నోయిడా:** దేశీ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా... ఇగ్నిస్ మోడల్‌లో అధునాతన వెర్షన్‌ను ఆటో ఎక్స్‌పో–2020లో ఆవిష్కరించింది. ఈ తాజా కాంపాక్ట్ ఎస్‌యూవీలో 1.2 లీటర్ల బీఎస్–6 పెట్రోల్ ఇంజిన్‌ను కంపెనీ అమర్చింది. కొత్త వెర్షన్ 17.78 సెం.మీ స్మార్ట్ ప్లే స్టూడియోతో పాటు లైవ్ ట్రాఫిక్, డ్రైవర్ భద్రతా హెచ్చరికలు, వెహికిల్ సమాచారం వంటి ఫీచర్లు కలిగిన ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో వస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ (మార్కెటింగ్, సేల్స్) శశాంక్ శ్రీవాస్తవ వివరించారు. దీని ధర ప్రస్తుత మోడల్ కంటే రూ. 25,000 అధికంగా ఉండవచ్చని అంచనా. ధరల శ్రేణి రూ. 5 లక్షలు–7.5 లక్షల వరకు ఉండొచ్చని ఆటో మొబైల్ రంగ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే, కంపెనీ ధర విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. బుకింగ్స్ ప్రారంభమైనట్లు ప్రకటించింది.

**'సీఎన్‌జీ ఎర్టిగా' @ రూ. 8.95 లక్షలు**

మల్టీ పర్పస్ వెహికల్ 'ఎర్టిగా'లో భారత్ స్టేజ్ (బీఎస్)–6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న సీఎన్‌జీ వాహనాన్ని కూడా మారుతీ ఆటో ఎక్స్‌పోలో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 8.95 లక్షలు. దేశంలో ఫ్యాక్టరీ ఫిట్టింగ్‌తో వస్తోన్న బీఎస్–6 సీఎన్‌జీ మల్టీ పర్పస్ వెహికల్ ఇది ఒక్కటే అని శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ వాహనం కేజీ సీఎన్‌జీతో 28.06 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని చెప్పారు.

# ఎన్‌టీపీసీ లాభం రూ.3,198 కోట్లు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ, ఎన్‌టీపీసీ ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) మూడో త్రైమాసిక కాలంలో రూ.3,198 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2018–19) క్యూ3లో లాభం రూ.2,608 కోట్లతో పోల్చితే 23 శాతం వృద్ధి సాధించామని ఎన్‌టీపీసీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.25,677 కోట్ల నుంచి రూ.25,953 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్) 77.70 శాతం నుంచి 63.48 శాతానికి తగ్గింది. బీఎస్‌ఈలో ఎన్‌టీపీసీ షేరు 3.3 శాతం లాభంతో రూ.116 వద్ద ముగిసింది.

# టాటా స్టీల్ నష్టాలు రూ.1,228 కోట్లు

**నిర్వహణ లాభం రూ.3,659 కోట్లు**




**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ కంపెనీకి ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో క్వార్టర్‌లో రూ.1,228 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.1,753 కోట్ల నికర లాభం ఆర్జించామని టాటా స్టీల్ తెలిపింది. సీక్వెన్షియల్‌గా చూస్తే (ఈ క్యూ2లో)రూ.3,302 కోట్ల నికర లాభం వచ్చిందని పేర్కొంది. అమ్మకాలు తక్కువగా ఉండటం, యూరప్ కార్యకలాపాలకు సంబంధించిన ఇంపెయిర్‌మెంట్ కేటాయింపుల కారణంగా ఈ క్యూ3లో భారీగా నికర నష్టాలు వచ్చాయని వివరించింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుండటం, ప్రభుత్వం మౌలిక రంగ ప్రాజెక్ట్‌లపై వ్యయాలు పెంచుతుండటం తదితర కారణాల వల్ల ఉక్కుకు డిమాండ్ మెరుగుపడగలదన్న ఆశాభావాన్ని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ టి.వి. నరేంద్రన్ వ్యక్తం చేశారు. కాగా, కంపెనీ నిర్వహణ లాభం క్యూ3లో రూ.6,726 కోట్ల నుంచి రూ.3,659 కోట్లకు తగ్గింది. భారత కార్యకలాపాలకు సంబంధించి నికర లాభం రూ.2,253 కోట్ల నుంచి 43% క్షీణించి రూ.1,194 కోట్లకు చేరింది. ఆదాయం 5% తగ్గి రూ.21,299 కోట్లకు పడిపోయింది.

## బడ్జెట్‌లో తగినన్ని ప్రోత్సాహకాలు కల్పించాం

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**ముంబై:** తాజాగా తాను సమర్పించిన బడ్జెట్‌లో వివేకంతో, జాగ్రత్తతో కూడిన ప్రోత్సాహక చర్యలను ప్రకటించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. శుక్రవారం ముంబైలో పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా మంత్రి మాట్లాడారు. ''దశాబ్ద కనిష్టానికి వృద్ధి రేటు క్షీణించిన సమయంలో కొన్ని నియోజక వర్గాలు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు గుర్తించాం. గతంలో ప్రోత్సాహకాలకు సంబంధించిన అనుభవం ఆధారంగా మేము.. తగినంత జాగ్రత్తతో, వివేకంతోనే బడ్జెట్‌లో వ్యవహరించాం. స్థూల ఆర్థిక అంశాలను దృష్టిలో ఉంచుకుని.. వినియోగం పెంచేందుకు, దీర్ఘకాలం పాటు పెట్టుబడుల ఆకర్షణ ద్వారా ఆస్తుల కల్పనకు తగినన్ని ప్రోత్సాహకాలు కల్పించాం'' అని సీతారామన్ వివరించారు.

**ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుపై పని జరుగుతోంది..**

వివాదాస్పద ఫైనాన్షియల్ రిజల్యూషన్స్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డీఐ) బిల్లుపై ఆర్థిక శాఖ పని కొనసాగిస్తోందని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ బిల్లు పార్లమెంటు ముందుకు తిరిగి ఎప్పుడు వస్తుందన్నది స్పష్టంగా చెప్పలేనన్నారు. సంక్షోభంలో ఉన్న బ్యాంకులను ఒడ్డెక్కించేందుకు డిపాజిటర్ల డబ్బులను కూడా వినియోగించుకోవచ్చన్న వివాదాస్పద క్లాజులు బిల్లులో ఉండడంతో ప్రతిపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు రావడం వల్ల గతంలో ఈ బిల్లును సభ నుంచి ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

# ఇక.. పేపర్ రెపరెపలు!!

- ఒకసారి వాడే ప్లాస్టిక్ నిషేధానికి కేంద్రం యోచన
- ఈ మార్కెట్ విలువ ఏడాదికి రూ.80వేల కోట్లు
- 2025కి దీన్లో 25 శాతం వాటా పేపర్ కంపెనీలదే
- తక్కువ ఖర్చు; పర్యావరణానికి మేలు
- హైవ్ గ్రూపు అధ్యయన నివేదికలో వెల్లడి



**న్యూఢిల్లీ:** పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌పై ప్రస్తుతం వ్యక్తమవుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు. అందులోనూ ఒక్కసారి మాత్రమే వినియోగించడానికి పనికివచ్చే ప్లాస్టిక్‌పైనయితే మరీను!!. ఇది పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది కనక దీన్ని నిషేధించాలనే డిమాండ్లు కూడా దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వాలు సైతం ఈ దిశగా ఆలోచించడం మొదలెట్టాయి. ఈ పరిణామాలన్నీ పేపర్ పరిశ్రమకు కలిసొస్తాయనేది నిపుణుల మాట. ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ మార్కెట్ ప్రస్తుతం దేశీయంగా రూ.80,000 కోట్ల స్థాయిలో ఉందని.. కేంద్ర ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిషేధిస్తే 2025 నాటికి ఇందులో 25 శాతం వాటాను పేపర్ పరిశ్రమ సొంతం చేసుకుంటుందని ఓ అధ్యయన నివేదిక పేర్కొంది. లండన్ కేంద్రంగా పనిచేసే హైవ్ గ్రూపు అనుబంధ సంస్థ హైవ్ ఇండియా నిర్వహించిన పేపరెక్స్ సదస్సులో ఈ నివేదికను విడుదల చేశారు. ఒక్కసారి మాత్రమే వినియోగించడానికి పనికొచ్చే ప్లాస్టిక్‌ను 2022 నాటికి దేశంలో పూర్తిగా నిషేధించాలన్నది ప్రధాని మోదీ సంకల్పం.

**ప్లాస్టిక్‌తో హాని ఎక్కువే...**

''2017–18లో భారత్‌లో సగటున ప్రతిరోజూ 26,000 టన్నుల ప్లాస్టిక్ చెత్త పోగయింది. ఇందులో కేవలం 60 శాతమే రీసైకిల్ చేయగా (పునర్వినియోగానికి అనువుగా మార్చడం), మిగిలినది నేలపైనే ఉండిపోయింది. దేశంలో ప్లాస్టిక్ వినియోగంలో మూడింట ఒక వంతు వాటా ప్యాకేజింగ్ పరిశ్రమది. ప్యాకేజింగ్ ప్లాస్టిక్‌లో 70% చాలా స్వల్ప వ్యవధిలోనే చెత్తగా మారిపోతోంది. ప్లాస్టిక్ చెత్తను నేలపైనే వదిలేస్తే అది ఇతర జీవులకు హానికరంగా మారుతోంది. ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ కవర్లు, స్టైరోఫోమ్ కంటెయినర్లు మట్టిలో కలసి పోవడానికి 1,000 ఏళ్లకుపైనే పడుతుంది'' అని హైవ్ గ్రూపు నివేదిక వివరించింది. భారత్‌లో ప్లాస్టిక్ వినియోగం తలసరి 11 కిలోలు. అంతర్జాతీయ సగటు 28 కిలోలతో పోలిస్తే ఇది సగం కంటే తక్కువేనని నివేదిక వెల్లడించింది.

**పేపర్ పర్యావరణ అనుకూలం..**

ప్లాస్టిక్ స్థానంలో పేపర్ వాడటమనేది పర్యావరణ అనుకూలమని, ఇది సులభంగా మట్టిలో కలిసిపోతుందని ఈ అధ్యయనం గుర్తు చేసింది. ''పేపర్ పరిశ్రమలు తమ ఉత్పత్తి కోసం చెట్లను నరికేస్తాయని, నీరు, ఇంధనాన్ని అధికంగా ఖర్చు చేస్తాయనేది వాస్తవం కాదు. దాదాపు పేపర్ పరిశ్రమలన్నీ తమ సొంత అడవుల నుంచో, రైతుల ద్వారా సేకరించిన చెట్ల నుంచో పేపర్ తయారు చేస్తున్నారు. వీరు పేపర్ కోసం నరికే చెట్ల కంటే నాటే చెట్లే ఎక్కువ. కొత్తగా తయారవుతున్న పేపర్‌లో మూడింట ఒక వంతు చెత్త శుద్ధీకరణ ద్వారానే వస్తోంది. భారత్‌లో పేపర్ కంపెనీలకు 46 శాతం ముడి సరుకు తాము సేకరించిన పేపర్ నుంచే వస్తోంది. మిగిలిన ముడి సరుకులో 27 శాతం వ్యవసాయ వ్యర్థాలైన బగాసే, స్ట్రా రూపంలో... 27 శాతం చెట్ల కలప రూపంలో ఉంటోంది'' అని ఈ అధ్యయనం వాస్తవాలను తేటతెల్లం చేసింది. పేపర్ అన్నది అక్షరాస్యతను, పరిశుభ్రతను పెంచడంతో పాటు బగాసేను వినియోగించడం ద్వారా కాలుష్యం తగ్గుతోందని వివరించింది. ఒక టన్ను పేపర్‌కు 2.1 టన్నుల కలప అవసరమని, అటవీ కలపను పేపర్ తయారీకి వినియోగించడం లేదని వెల్లడించింది.

**పేపర్‌కే ఖర్చు తక్కువ...**

''పేపర్‌ను రీసైకిల్ చేయటానికి కిలోకు రూ.32 ఖర్చవుతోంది. ఇందులో రూ.20 పాతవి సేకరించడానికి, రూ.12 రీసైకిల్‌కు కాగా... కిలో ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలంటే సేకరణ ఖర్చు రూ.22–35, రీసైకిల్‌కు రూ.30–36 అవుతోంది. రవాణాకు కూడా టన్ను పేపర్‌కు కిలోమీటర్‌కు రూ.4.5 అయితే.. ప్లాస్టిక్‌కు రూ.6.2 అవుతోంది'' అంటూ నివేదిక వివరించింది. ఇంధన వినియోగం కూడా పేపర్‌కు చాలా తక్కువని, 55–60 శాతం ఇంధనాన్ని ఆదా చేయొచ్చునని హైవ్ ఇండియా డైరెక్టర్ సంజీవ్ బాత్రా చెప్పారు.

## భారత్‌లో అమెజాన్ రూ. 2,500 కోట్ల పెట్టుబడి



**న్యూఢిల్లీ:** భారత్‌లో శరవేగంగా కార్యకలాపాలు విస్తరిస్తున్న అమెరికన్ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్.. తాజాగా మరో రూ. 2,500 కోట్లను ఇక్కడ పెట్టుబడిగా పెట్టింది. డేటా సర్వీసెస్ ఇండియా విభాగంలో రూ. 2,208 కోట్లు, సెల్లర్ సర్వీసెస్‌లో రూ.355 కోట్లను ఇన్వెస్ట్ చేసినట్లు నియంత్రణ సంస్థలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. భారత పర్యటనలో భాగంగా ఇక్కడ రూ. 7,000 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ జెఫ్ బెజోస్ ఇటీవలే ప్రకటించారు.

## ఎల్‌ఐసీ ఐపీఓ సరికాదు: ఫీల్డ్ వర్కర్స్ ఫెడరేషన్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రతిపాదించిన విధంగా ఎల్‌ఐసీలోని కొంత వాటాను ఐపీఓ ద్వారా విక్రయిస్తే... దాని వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు కచ్చితంగా నష్టం వాటిల్లుతుందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎఫ్‌ఐఎఫ్‌డబ్ల్యూఐ) అభిప్రాయపడింది. వాటా విక్రయం కొంత భాగంతోనే పరిమితం కాకుండా, భవిష్యత్తులో మరింత వాటా ఇతరుల చేతికి వెళ్లే అవకాశం ఉందని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామ్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. ''ఇపుడు ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నపుడు ఎల్‌ఐసీనే ఆదుకుంటోంది. అధిక వాటా ఇతరుల చేతికి వెళితే సంస్థ ఈ సత్తాను కోల్పోతుంది. సంస్థను కాపాడటానికి ఐపీఓను వ్యతిరేకిస్తున్నాం'' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## జోయ్ అలుక్కాస్‌లో వాలెంటైన్ కలెక్షన్ ప్రారంభం

**హైదరాబాద్:** ప్రముఖ జ్యూయలరీ సంస్థ జోయ్ అలుక్కాస్.. వాలెంటైన్ డే కోసం ప్రత్యేక కలెక్షన్‌ను ప్రారంభించింది. చూడ గానే ఆకట్టుకునే విధంగా రూపొందించిన ఆభరణాలు ఈ కలెక్షన్ ప్రత్యేకమని సంస్థ ఎండీ జోయ్ అలుక్కాస్ అన్నారు. ఫిబ్రవరి 16 వరకు కొనసాగే తాజా ఆఫర్‌లో భాగంగా రూ. లక్ష విలువ చేసే వజ్రాభరణాల కొనుగోలుపై 2 గ్రాముల బంగారు నాణెం, రూ. లక్ష విలువ చేసే కొనుగోలుకు ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని షోరూంల్లో ఆఫర్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

Joyalukkas
World's favourite jeweller

# టెక్నో పెయింట్స్ మరింత కలర్‌ఫుల్

**కంపెనీ నుంచి 1,800 నూతన రంగులు ● రూ. 25 కోట్లతో మరో తయారీ కేంద్రం**



కలర్ స్పెక్ట్రాతో మూర్తి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అనిల్ (ఎడమ నుంచి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** పెయింట్స్ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ టెక్నో పెయింట్స్ 1,800 రకాల కొత్త రంగులను పరిచయం చేసింది. వీటిలో యాంటీ బ్యాక్టీరియల్, ఇన్‌ఫ్రారెడ్ రిఫ్లెక్టివ్ పెయింట్లు కూడా ఉన్నాయి. దిగ్గజ కంపెనీలకు ధీటుగా కలర్ స్పెక్ట్రాను రూపొందించింది. దీని ద్వారా నచ్చిన రంగులు ఎంచుకోవడానికి కస్టమర్లకు మరింత సులువు అవుతుందని టెక్నో పెయింట్స్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డైరెక్టర్లు సీవీఎల్ఎన్ మూర్తి, సత్యనారాయణ రెడ్డి, సీఈవో కె.అనిల్‌తో కలిసి శుక్రవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది డీలర్ నెట్‌వర్క్ ద్వారా రిటైల్ విభాగంలోకి ప్రవేశిస్తామన్నారు. ఇప్పటికే 30 కోట్ల చదరపు అడుగులకుపైగా విస్తీర్ణంలో ప్రాజెక్టులకు రంగులు అందించామని పేర్కొన్నారు. రూ.250 కోట్ల ఆర్డర్ బుక్ ఉందని వెల్లడించారు.

**రెండింతలకు సామర్థ్యం..:** ప్రస్తుతం టెక్నో పెయింట్స్‌కు అయిదు ప్లాంట్లున్నాయి. వీటన్నిటి వార్షిక సామర్థ్యం 42,000 మెట్రిక్ టన్నులు. ఆరవ ప్లాంటును హైదరాబాద్ సమీపంలోని సుల్తాన్‌పూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నెలకొల్పుతున్నారు. 3 ఎకరాల విస్తీర్ణంలో రానున్న ఈ ప్లాంటు కోసం రూ.25 కోట్ల పెట్టుబడి చేస్తున్నట్టు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. 'ఏడాదిలో సిద్ధం కానున్న కొత్త ప్లాంటుతో సామర్థ్యం రెండింతలకు చేరుతుంది. నూతనంగా 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2018–19లో రూ.62 కోట్ల టర్నోవర్ సాధించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.90 కోట్లు ఆశిస్తున్నాం. రెండేళ్లలో రూ.250 కోట్ల టర్నోవర్ లక్ష్యం. ఆఫ్రికాలో సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు ప్రయత్నాల్లో ఉన్నాం. దక్షిణాదితోపాటు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో సేవలు అందిస్తున్నాం. త్వరలో దేశవ్యాప్తంగా విస్తరిస్తాం' అని వివరించారు.

# వడ్డీరేటు తగ్గించిన ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్




**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శుక్రవారం అన్ని కాలపరిమితులపై రుణరేట్లను స్వల్పంగా ఐదు బేసిస్ పాయింట్లు తగ్గించింది. కెనరాబ్యాంక్ కూడా ఇదే బాటన పయనించింది. కాగా ద్రవ్య లభ్యత బాగున్న నేపథ్యంలో డిపాజిట్ రేట్లనూ ఎస్‌బీఐ తగ్గించడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పాలసీ నిర్ణయాల ప్రకటన మరుసటి రోజు బ్యాంకులు తీసుకున్న ఈ నిర్ణయాలకు సంబంధించి కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు వర్తించే ఏడాది కాల వ్యవధి రుణ రేటు ప్రస్తుత 7.90 శాతం నుంచి 7.85 శాతానికి తగ్గింది.
- రూ.2 కోట్లకన్నా తక్కువ ఉన్న రిటైల్ టర్మ్ డిపాజిట్‌పై వడ్డీరేటు అలాగే రూ.2 కోట్ల పైబడిన బల్క్ టర్మ్ డిపాజిట్ రేటును బ్యాంక్ సవరించింది. రిటైల్ విభాగంలో డిపాజిట్ రేటు 10–50 బేసిస్ పాయింట్లు తగ్గగా, బల్క్ సెగ్మెంట్‌లో 25–50 బేసిస్ పాయింట్లు తగ్గింది.
- తగ్గించిన రేట్లు ఫిబ్రవరి 10వ తేదీ నుంచీ అమల్లోకి వస్తాయి.

**కెనరాబ్యాంక్ 25 బేసిస్ పాయింట్లు**

ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ ఓవర్‌నైట్, నెల, మూడు, ఆరు నెలల కాలానికి ఎంసీఎల్‌ఆర్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఏడాది కాలానికి ఈ రేటు 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఫిబ్రవరి 7 నుంచీ తాజా రేటు అమల్లోకి వచ్చింది.

**బ్యాంకింగ్‌కు ఈనెలలోనే 50,000 కోట్లు!**

బ్యాంకింగ్ వ్యవస్థలో మరిన్ని నిధులు లభ్యమయ్యే కీలక చర్యలకు ఆర్‌బీఐ శ్రీకారం చుడుతోంది. ఫిబ్రవరి 17, 24 తేదీల్లో రూ.50,000 కోట్ల రీపర్చేజింగ్ ఆపరేషన్స్ (రెపో) నిర్వహించనున్నట్లు ప్రకటించింది. సంబంధిత 2 రోజుల్లో రూ.25,000 చొప్పున రెపో ఆపరేషన్స్‌ను ఆర్‌బీఐ నిర్వహించనుంది. అయితే 17న మూడేళ్ల కాలవ్యవధి రెపో ఆపరేషన్‌కాగా, 24వ తేదీ రెపో ఆపరేషన్ ఏడాది కాల వ్యవధికి ఉద్దేశించినది. దీనివల్ల బ్యాంకింగ్‌కు అదనపు నిధులు అందుబాటులోకి వస్తాయి. వడ్డీరేట్లు మరింత తగ్గడానికి ఈ చర్యలు వీలుకల్పిస్తాయి.

## రూ.700 కోట్లు కట్టండి

**అనిల్ అంబానీకి యూకే కోర్టు ఆదేశాలు**



**లండన్:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ కంపెనీకి సంబంధించి చైనా ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు గాను వ్యక్తిగత హామీ ఇచ్చిన ప్రమోటర్ అనిల్ అంబానీకి బ్రిటన్ హైకోర్టులో చుక్కెదురు అయింది. ఆరు వారాల్లో 100 మిలియన్ డాలర్లు (రూ.700 కోట్లు) కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయమూర్తి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా ముంబై శాఖ, చైనా డెవలప్‌మెంట్ బ్యాంకు, ఎగ్జిమ్ బ్యాంక్ ఆఫ్ చైనా అనిల్ అంబానీకి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌లో కండీషనల్ ఆర్డర్‌లో భాగంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

## అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు

(రూ. కోట్లలో)

| కంపెనీ | నికర లాభం 2019-20 | నికర లాభం 2018-19 | వృ./క్షీ.(%) | మొత్తం ఆదాయం 2019-20 | మొత్తం ఆదాయం 2018-19 | వృ./క్షీ.(%) |
|---|---|---|---|---|---|---|
| ఓల్టాస్ | 88 | 78 | 13 | 1,493 | 1,492 | -- |
| ఇమామి | 144 | 138 | 5 | 828 | 820 | 1 |
| గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా | 114 | 82 | 39 | 797 | 679 | 17 |
| ఏసీసీ | 273 | 732 | -63 | 4,118 | 3,926 | 5 |
| వర్ల్‌పూల్ ఇండియా | 76 | 62 | 23 | 1,311 | 1,238 | 6 |
| ఎన్‌సీసీ | 102 | 150 | -32 | 2,283 | 3,415 | -33 |

# బీదర్‌కు ట్రూజెట్ సర్వీసులు




సర్వీసు ప్రారంభిస్తున్న కర్ణాటక సీఎం, తదితరులు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ట్రూజెట్ పేరుతో విమాన సేవల్లో ఉన్న హైదరాబాద్ సంస్థ టర్బో మేఘా ఎయిర్‌వేస్ తాజాగా తన నెట్‌వర్క్‌లోకి బీదర్‌ను చేర్చింది. ఉడాన్ సర్వీసుల్లో భాగంగా బెంగళూరు–బీదర్–బెంగళూరు మధ్య ఫ్లయిట్‌ను ప్రతిరోజూ నడుపుతారు. కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప కొత్త సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి విమానంలో బీదర్ ప్రయాణించారు. బస్సులో 12 గంటల సమయం పడుతుందని, విమానంలో గంట 40 నిమిషాల్లోనే చేరుకున్నామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. బీదర్ చేరికతో ట్రూజెట్ నెట్‌వర్క్‌లో డెస్టినేషన్ల సంఖ్య 24కు చేరుకుందని టర్బో మేఘా ఎయిర్‌వేస్ డైరెక్టర్ కె.వి.ప్రదీప్ వెల్లడించారు. కార్యకలాపాలు ప్రారంభించిన నాలుగేళ్లలోనే ఈ స్థాయికి చేరుకున్నామని కంపెనీ సీఈవో కల్నల్ ఎల్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. కాగా, స్ప్రింగ్ సర్‌ప్రైజ్ పేరుతో నాలుగు రోజుల సేల్‌లో భాగంగా బెంగళూరు–బీదర్–బెంగళూరు రూట్లో బేస్ ఫేర్ రూ.699కే అందిస్తోంది.

## వాట్సాప్ పే ద్వారా చెల్లింపులు

**లైసెన్స్ జారీ చేసిన ఎన్‌పీసీఐ**




**ముంబై:** వాట్సాప్ పే ద్వారా డిజిటల్ చెల్లింపులకు మార్గం సుగమమైంది. వాట్సాప్‌కు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) నుంచి లైసెన్స్ లభించింది. ఫేస్‌బుక్‌కు చెందిన వాట్సాప్ పే దశలవారీగా డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నది. వాట్సాప్ యూజర్ల సంఖ్య దాదాపు 40 కోట్లకు పైగా ఉంది. తొలి దశలో కోటి మందికి మాత్రమే ఈ సౌకర్యాన్ని వాట్సాప్ అందించనున్నది. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిల్లో అన్ని అనుమతులు వచ్చిన తర్వాత అందరికీ ఈ సౌకార్యాన్ని అందుబాటులోకి తేనున్నది.

# 4 రోజుల లాభాలకు బ్రేక్

**లాభాల స్వీకరణతో మార్కెట్ పతనం**



గత నాలుగు రోజుల వరుస లాభాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ చేయడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. ఈ వారంలో తొలిసారిగా నష్టాలు నమోదయ్యాయి. చైనాలో కరోనా వైరస్ మృతుల సంఖ్య 636కు చేరడం, ఈ వైరస్ భయాలు మళ్లీ చెలరేగడంతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ 25 పైసలు పతనమై 71.43కు పడిపోవడం (ఇంట్రాడేలో) ప్రతికూల ప్రభావం చూపించాయి. ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ, మార్కెట్ నష్టాలు తగ్గలేదు. బీఎస్‌ఈ సెన్సెక్స్ 164 పాయింట్లు పతనమై 41,142 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 40 పాయింట్లు నష్టపోయి 12,098 పాయింట్ల వద్ద ముగిశాయి. వారం పరంగా చూస్తే, సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 1,406 పాయింట్లు(3.5 శాతం), నిఫ్టీ 437 పాయింట్ల (3.7 శాతం)మేర లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.6 శాతం నష్టంతో రూ.1,299 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

## బైజుస్‌లో జనరల్ అట్లాంటిక్ 1,420 కోట్ల పెట్టుబడులు

BYJU'S
The Learning App

**న్యూఢిల్లీ:** ఎడ్యుకేషన్ టెక్నాలజీ సంస్థ, బైజుస్ తన ప్రస్తుత ఇన్వెస్టర్లలో ఒకటైన జనరల్ అట్లాంటిక్ నుంచి భారీ మొత్తంలో నిధులను సమీకరించింది. ఎంత మొత్తంలో జనరల్ అట్లాంటిక్ ఇన్వెస్ట్ చేసింది బైజుస్ వెల్లడించలేదు. అయితే ఈ సంస్థ బైజుస్‌లో రూ.1,420 కోట్ల(20 కోట్ల డాలర్లు) మేర ఇన్వెస్ట్ చేసిందని సమాచారం. టైగర్ గ్లోబల్ కూడా ఇదే రేంజ్‌లో ఇన్వెస్ట్ చేసి ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మొత్తం మీద ఈ తాజా రౌండ్‌లో బైజుస్ సంస్థ 130 కోట్ల డాలర్ల మేర నిధులు సమీకరించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పెట్టుబడుల ఆధారంగా బైజుస్ సంస్థ విలువ 820 కోట్ల డాలర్లు (రూ.58,220 కోట్లు) ఉంటుందని అంచనా.

## మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూత

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత లాజిస్టిక్ కంపెనీ షిప్‌రాకెట్.. చిన్న మధ్య తరహా(ఎస్ఎంఈ) రంగంలోని మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు 'ఆరంభ్ 2020' కార్యక్రమాన్ని ప్రారంభించింది. సైన్స్, కామర్స్, ఆర్ట్స్‌లో బిజినెస్ ఐడియాలను పంచుకోవాలని.. 3 ఉత్తమ వ్యాపార ఆలోచనలకు రూ.3 లక్షల నగదు బహుమతితో పాటు సాంకేతిక సహాయం అందిస్తామని సీఈఓ సాహి గోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 17.

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,420 | ▲ | 100 |
| బంగారం (99.5, 10గ్రా) | 39,450 | ▲ | 100 |
| వెండి (కిలో) | 50,100 | ▲ | 300 |
| **హైదరాబాద్/చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,670 | ▲ | 120 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,730 | ▲ | 110 |
| వెండి (కిలో) | 50,100 | ▲ | 300 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,800 | ▲ | 250 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,740 | ▲ | 140 |
| వెండి (కిలో) | 47,500 | ▲ | 200 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,560 | ▲ | 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,660 | ▲ | 280 |
| వెండి (కిలో) | 47,500 | ▼ | 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,870 | ▲ | 150 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,730 | ▲ | 110 |
| వెండి (కిలో) | 47,600 | ▲ | 200 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 8-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375-00 |
| చిత్తూరు | 373-00 |
| వరంగల్ | 318-00 |
| విజయవాడ | 325-00 |
| గోదావరి | 325-00 |
| **7-2-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 315-00 |



చుట్టూ పచ్చని పైర్లు.. కోనసీమ అందాల్ని తలపిస్తున్న ప్రకృతి... భారీగా కనిపిస్తున్న వాహనాలు.. ఈ దృశ్యం ఎక్కడిదో అనుకుంటున్నారా? పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల సమ్మక్క జాతర సందర్భంగా శుక్రవారం అమ్మవార్ల దర్శనం కోసం వస్తున్న భక్తుల వాహనాలు ఇలా ట్రాఫిక్‌లో చిక్కుకొని బారులు తీరాయి

- మర్రి సతీష్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## కాంగ్రెస్ ముందుచూపుతోనే మెట్రో

### కాంగ్రెస్ నేత పొన్నాల లక్ష్మయ్య



**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ముందు చూపువల్లే హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రారంభమైందని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఐటీ ఇండస్ట్రీతో ప్రపంచ ఖ్యాతి చెందుతున్న నగరానికి ప్రజల రవాణా కోసం శంషాబాద్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్ కోసం గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేడు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం సరైనదని ప్రజలకు తెలిసిందని, మెట్రో ఆలస్యానికి క్షమాపణలతో పాటు వ్యయ పెరుగుదలకు సీఎం కేసీఆర్ సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెట్రో ఆలస్యం కారణంగా ఈ ప్రాజెక్టు వ్యయం 28 శాతం అంటే దాదాపు రూ.4వేల కోట్లకు పైగా పెరిగిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వద్దనడం, ముఖ్యమంత్రి కాగానే అలైన్‌మెంట్ మార్పు చేయాలనడం చివరగా యథాతథంగా పూర్తి చేయడం కేసీఆర్‌కే చెల్లిందని ఎద్దేవాచేశారు. సుల్తాన్ బజార్ ప్రాచీన షాపింగ్‌కు కేంద్రం.., వేల కుటుంబాలు రోడ్డున పడతాయని అన్న కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

## బీజేపీది సవతితల్లి ప్రేమ: గూడూరు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణపై బీజేపీది సవతితల్లి ప్రేమ అని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ బిల్లును ఆమోదించారని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఇంగితం లేనివని విమర్శించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటులో తెలంగాణ బిల్లుకు బీజేపీ మద్దతు అయిష్టంగా ఇచ్చిందా అన్న విషయంలో రాష్ట్ర బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోతామనే అసహనం ప్రధాని మాటల్లో కనిపిస్తోందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే సీఎం కేసీఆర్‌కు రైతు సమస్యలు గుర్తుకొస్తాయని, ఎన్నికలప్పుడు మాత్రమే రైతుబంధు గుర్తుకొస్తుందని గూడూరు ఎద్దేవాచేశారు

**మల్లు అనంతరాములుకు నివాళి**

పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు అనంత రాములు వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఉపాధ్యక్షులు మల్లు రవి, కుమార్ రావ్, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్ లాల్, కైలాశ్ కుమార్, నగేశ్ ముదిరాజ్ తదితరులు నివాళులర్పించారు.

## 'పేదవాడి ఇంటికలను కల్లలు చేశారు'

**సాక్షి, హైదరాబాద్:** పేదవాడి సొంతింటి కలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్లలు చేస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ విమర్శించారు. పేదవాడికి ఇళ్లు కట్టించాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వాలకు లేదని ధ్వజమెత్తారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లను సీఎం కేసీఆర్ అవహేళన చేశారని, అయితే తాను కట్టిస్తానన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులకు గాను కేవలం 12 శాతం ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని, నారాయణపేట, వికారాబాద్, కొమురం భీం జిల్లాల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వస్తే సొంత జాగ ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని, ఎంత మందికి ఈ మొత్తం ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు.

## రాజ్యాంగం ప్రకారమే రాష్ట్ర విభజన

### కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి



**నిజాంసాగర్(జుక్కల్):** తలుపులు మూసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లును ఆమోదించారని ప్రధాని మోదీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఏ బిల్లుపైనైనా ఓటింగ్ జరిగే సమయంలో తలుపులు మూసివేస్తారన్న విషయం ప్రధానికి తెలియదా? అని ప్రశ్నించారు. గురువారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలానికి వచ్చిన రేవంత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 60 సంవత్సరాల పోరాటాన్ని, 1,200 మంది బలిదానాలను దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగం, చట్టం పరిధిలోనే రాష్ట్ర విభజన బిల్లును ఆమోదించినట్లు వివరించారు. ఇళ్ల అనుమతులు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనుల్లో అవినీతి జరిగితే సస్పెండ్ చేస్తామంటున్న మంత్రి కేటీఆర్ తీరు చూస్తుంటే 'వంద ఏనుగులను తిన్న నక్క.. పాపాలను కడుక్కోవడానికి తీర్థయాత్రలకు పోయిందట'అన్న సామెత గుర్తుకొస్తుందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో కొన్ని వందల లేఅవుట్లను పక్కన పెట్టి, కమీషన్ ఇచ్చే వారి లేఅవుట్లకు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను గానీ, ఆయన చిత్రగుప్తుడైన శ్రీధర్‌ను గానీ ప్రసన్నం చేసుకుంటేనే కొత్త బిల్డింగులు, లేఅవుట్లకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. కూకట్‌పల్లి తహసీల్ పరిధిలోని సర్వే నెం. 376లో రూ. 300 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపి కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు.

## టీఎన్జీవోస్ క్రీడల్లో అపశ్రుతి

### కబడ్డీ ఆడుతూ పంచాయతీ కార్యదర్శి మృతి



మృతుడు సురేశ్

**నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న టీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. కబడ్డీ ఆడుతూ ఓ ఉద్యోగి హఠాన్మరణం చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన సురేశ్ (30) నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ జట్ల మధ్య కబడ్డీ పోటీ జరిగింది. రెవెన్యూ జట్టుకు చెందిన సురేశ్.. రైడింగ్‌కు వెళ్లగా, ప్రత్యర్థి జట్టు క్రీడాకారులు ఆయనను గట్టిగా పట్టుకుని మీద పడ్డారు. ఈ క్రమంలో అస్వస్థతకు గురైన ఆయన వాంతులు చేసుకున్నాడు. అక్కడే ఉన్న అదనపు వైద్యాధికారి తుకారాం ప్రథమ చికిత్స అందించారు. అనంతరం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సురేశ్ మృతి చెందాడు. సురేశ్ మృతి నేపథ్యంలో శనివారం జరగాల్సిన క్రీడలను వాయిదా వేశారు.

# ఉలిక్కిపడిన 'హుస్నాబాద్'

**అక్కన్నపేటలో ఏకే–47తో కాల్పులు**

- గొర్రెల కాపరికి ఏకే–47 ఎక్కడి నుంచి వచ్చిందని చర్చ
- నిందితుడు మాజీ మావోయిస్టుగా అనుమానం
- హుస్నాబాద్ పీఎస్‌లో మిస్సైన ఏకే 47గా సందేహం
- నిందితుడి ఇంటి వద్ద బుల్లెట్లు, తల్వార్ స్వాధీనం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బాధితుడు గంగరాజునుంచి వివరాలు తెలుసుకుంటున్న హుస్నాబాద్ ఏసీపీ మహేందర్



సదానందం ఇంట్లో దొరికిన తల్వార్

**సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్/ అక్కన్నపేట:** దశాబ్దకాలం క్రితం మావోయిస్టు కార్యకలాపాలు, తుపాకులు, బాంబుల మోతతో దద్దరిల్లిన హుస్నాబాద్ ప్రాంతంలో మరోసారి ఏకే–47 శబ్దం వినిపించడంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గొర్రెల కాపరిగా ఉంటున్న వ్యక్తి ఏకే–47 గన్ పట్టుకొని తిరగడం, చిన్న గొడవ పెద్దది కావడంతో ఎదుటి వారిపై కాల్పులు జరిపిన సంఘటన గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సిమెంట్ ఇటుకల చేబదులుపై తలెత్తిన ఓ గొడవ పెద్దదై ఏకే–47 గన్‌తో కాల్పుల వరకు వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. కోహెడకు చెందిన దేవుని సదానందం అక్కన్నపేటలోని తన మేనమామ గుంటి వెంకటయ్య ఇంటికి 2010లో వచ్చి పది సంవత్సరాలుగా గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అక్కన్నపేటకు చెందిన గుంటి గంగరాజు తనకు సిమెంట్ ఇటుకలు అవసరం కాగా సదానందం మేనమామ వెంకటయ్య వద్ద చేబదులుగా తీసుకున్నాడు. తర్వాత ఇటుకలు ఇవ్వాలని సదానందం, గంగరాజుతో కొద్దిరోజుల క్రితం గొడవ పడ్డాడు. ఈ విషయంలో కోపంగా ఉన్న సదానందం బుధవారం గంగరాజు తల్లి ఎల్లవ్వ వద్దకు తల్వార్‌తో వచ్చి చంపుతానని బెదిరించాడు. అలాగే గురువారం రాత్రి సదానందం నల్లటి దుస్తులు, తలకు నల్లటి క్యాప్ ధరించి, భుజానికి ఏకే–47 తుపాకీ వేసుకొని అది పని చేస్తుందా లేదా అని ఇంటి ముందు నేలకేసి కాల్చాడు. ఈ శబ్దానికి ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై, గంగరాజుకు సమాచారం అందజేశారు. దీంతో గంగరాజు, అతని కుటుంబ సభ్యులు భయంతో ఇంటి తలుపులు వేసుకొని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. అదే సమయంలో గంగరాజు ఇంటికి వచ్చిన సదానందం తుపాకీతో కిటికీ నుంచి ఇంట్లోకి కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు.



ఘటనా స్థలంలో లభ్యమైన తుపాకీ గుండ్లు

**నిందితుడు మాజీ మావోయిస్టుగా అనుమానం**

గొర్రెల కాపరి అయిన సదానందానికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది.. అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే స్వస్థలం కోహెడలో ఉన్న సమయంలోనే సదానందం పది సంవత్సరాలు కన్పించకుండా పోయాడని తెలుస్తోంది. తర్వాత తిరిగి వచ్చి అక్కన్నపేటలో ఉంటున్నాడు. ఈ క్రమంలోనే నల్లప్యాంటు, షర్ట్, తలకు నల్లటి క్యాప్ పెట్టుకొని, ఏకే–47తుపాకీ భుజాన వేసుకొని రావడంతో అతను గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**గతంలో మాయమైన ఏకే–47 ఇదేనా.?**

2016వ సంవత్సరంలో అప్పటి వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అంతర్భాగమైన హుస్నాబాద్ డివిజన్ సిద్దిపేట జిల్లాలో విలీనమైంది. ఆ సమయంలో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న తుపాకులను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఒక ఏకే–47, మరో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీ మాయమవడంతో పోలీసులు ఆరా తీశారు. తర్వాత మళ్లీ ఆ విషయంపై కదలిక రాలేదు. అయితే గురువారం అక్కన్నపేటలో తిరిగి ఏకే– 47 గన్ కాల్పుల ఉదంతం బయటకు రావడంతో కనిపించకుండా పోయిన గన్ ఇదేనా అనే చర్చ జరుగుతోంది.

**దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

గంగరాజు ఇంటిపై సదానందం కాల్పులు జరపడంతో ఆ శబ్దం విన్న స్థానికులు 100కు ఫోన్ చేయడంతో, ఎస్సై పాపయ్యానాయక్ సిబ్బందితో వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ 3 తుపాకీ గుండ్లతో పాటు తుపాకీ బెల్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పరారైన సదానందం ఇంటిని సోదా చేశారు. ఇంటిలో ఉన్న తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ మహేందర్, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సదానందంకోసం గాలిస్తున్నారు. సిద్దిపేట ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ శ్వేత ఈ ఘటనపై ఆరా తీశారు. గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడం కోసం 3 టీమ్‌లను ఏర్పాటు చేశారు. త్వరలో ఈ కేసును ఛేదిస్తామని ఇన్‌చార్జి సీపీ ప్రకటన విడుదల చేశారు.

### పోలీసుల అదుపులో నిందితుడు సదానందం?



ఇదిలా ఉండగా పరారైన నిందితుడు దేవుని సదానందంను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సదానందం ఇద్దరు భార్యలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తుండగా అదే సమయంలో గుర్తు తెలియని నంబర్ ద్వారా సదానందం ఇద్దరు భార్యల్లో ఒకరికి ఫోన్ చేసినట్లు తెలిసింది. అక్కడే ఉన్న పోలీసులు సదానందం చేసిన నంబర్‌ను ట్రేస్ చేసి అతడిని పట్టుకున్నట్లు సమాచారం. అతడిని కోహెడ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ జరిపిన పోలీసులు అక్కడి నుంచి వేరే చోటుకు తరలించినట్లు సమాచారం. సదానందంను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు నిర్ధారించలేదు.

## కనుల పండువగా పూర్వగిరీశుడి కల్యాణం



కల్యాణ వేడుకలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుక జరిగింది. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన కల్యాణ మహోత్సవాన్ని పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు రాత్రి 8.30 గంటలకు నిర్వహించారు. ముందుగా గజవాహనాన్ని అధిష్టించిన శ్రీస్వామి వారు, పల్లకీపై లక్ష్మీదేవి కల్యాణ మండపానికి చేరుకున్నారు. వేదపండితులు విశ్వక్సేనుడిని ఆరాధించి కల్యాణ ప్రక్రియను ప్రారంభించారు. పాద ప్రక్షాళన, జంధ్యాధారణ, జీలకర్ర బెల్లం ఘట్టాలయ్యాక శుభముహూర్తంలో శ్రీనృసింహస్వామి వారు శ్రీలక్ష్మీ దేవికి మాంగళ్యధారణ చేశారు. కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ఈ వేడుకల్లో స్థానాచార్యులు, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, రుత్వికులు, వేద పారాయణికులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో జాతరలకు పెద్దపీట

**ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు**

- 21న ప్రారంభమయ్యే ఏడుపాయల జాతరపై సమీక్ష
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచన




సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

**సాక్షి, మెదక్ :** తెలంగాణ రాష్ట్రంలో జాతరలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు ఈసారి భక్తులు పెరిగారని.. మెదక్‌లోని ఏడుపాయల వనదుర్గా భవాని ఉత్సవాలకు సైతం భక్తులు పోటెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి జరిగే ఏడుపాయల జాతరను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించాలని.. 18వ తేదీ లోపే పనులు పూర్తి చేయాలని అధికారులకు డెడ్‌లైన్ విధించారు. ఏడుపాయల జాతర ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం ఆయన స్థానిక హరిత హోటల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మెదక్ మున్సిపల్ నూతన పాలకవర్గం తొలి సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. జిల్లా ఆస్పత్రిలో రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ఎక్కడా లోటుపాట్లకు తావివ్వకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర నిర్వహణకు సంబంధించి ఇప్పటికే రూ.75 లక్షలు మంజూరయ్యాయని.. త్వరలో మరో రూ.25 లక్షలు విడుదల చేస్తామని వెల్లడించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని.. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఇదే క్రమంలో అన్ని మున్సిపాలిటీల్లో సైతం త్వరలో 'పట్టణ ప్రగతి'చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ ధర్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ నగేశ్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



**రాయపర్తి:** వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులోని భాగ్యలక్ష్మి పత్తి మిల్లులో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో నిల్వ చేసిన పత్తి చుట్టూ జేసీబీ సహాయంతో కందకాలు తీసేక్రమంలో భూమిలో ఉన్న కరెంటు వైర్లు తెగిపోయి మెరుపులు వెలువడడంతో పత్తికి మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.కోట్లలో ఆస్తినష్టం వాటిల్లిందని మిల్లు నిర్వాహకులు తెలిపారు. వర్ధన్నపేట ఎస్సై వంశీకృష్ణ, స్థానిక ఏఎస్సై లింగారెడ్డి పరిస్థితిని పర్యవేక్షించారు.

# ఎనిమిదేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

- గ్రామపంచాయతీ భవనంలోనే కామాంధుడి ఘాతుకం
- చాక్లెట్లు కొనిస్తానని చెప్పి తీసుకెళ్లి అత్యాచారం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- జగిత్యాల జిల్లాలో ఘటన



నిందితుడు గంగారాం

**మేడిపెల్లి(వేములవాడ)/కోరుట్ల:** అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం పసునూర్‌లో గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బెజ్జంకి గంగారెడ్డి అలియాస్ గంగారాం(50) 3 నెలల క్రితం పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా విధుల్లో చేరాడు. కాగా, స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండోతరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల చిన్నారితోపాటు ఆమె అక్క, మరో బాలిక స్కూల్ నుంచి ఇంటికి తిరిగివస్తుండగా గంగారాం వారికి చాక్లెట్లు కొనిస్తానని నమ్మించాడు. అతడిని నమ్మిన ఎనిమిదేళ్ల చిన్నారితోపాటు మరో చిన్నారిని గ్రామపంచాయతీ భవనంలోకి తీసుకెళ్లాడు. ఒకే కాలనీకి చెందిన వ్యక్తి కావడంతోపాటు గంగారాంను చిన్నారులు మామా.. అంటూ పిలిచేవారు. అదే చనువుతో ఇద్దరు చిన్నారులు గ్రామపంచాయతీ భవనంలోకి వెళ్లారు. వీరితోపాటు ఉన్న ఆ చిన్నారి అక్క మాత్రం ఇంటికెళ్లింది. దీంతో చెల్లి ఏదని తల్లి అడగ్గా, గంగారాం మామ పిలిచాడని చెప్పింది. దీంతో చెల్లెలిని తీసుకుని రావాలని తల్లి చెప్పడంతో ఆ బాలిక గ్రామపంచాయతీ వద్దకు వచ్చి పిలిచినా గడియ తీయకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లింది. గంగారాం మరో బాలికకు చాక్లెట్లు కొనుక్కు రావాలని డబ్బులు ఇచ్చి బయటకు పంపించాడు. అనంతరం ఒంటరిగా ఉన్న ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. కొద్ది సేపటికి ఆ చిన్నారి ఇంటికి చేరుకుంది. గంగారాం మద్యం మత్తులో పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు రాగా, ఇది గమనించిన అంగన్‌వాడీ టీచర్ చిన్నారి ఇంటికెళ్లి తల్లికి విషయం చెప్పింది. ఇద్దరు కలసి చిన్నారిని ఆరా తీయగా.. గంగారాం తనపై చేసిన అఘాయిత్యాన్ని చెప్పింది. దీంతో సర్పంచ్ సహకారంతో పోలీసులకు సమాచారం అందించగా మెట్‌పల్లి డీఎస్పీ గౌస్‌బాబా, కోరుట్ల సీఐ రాజశేఖరరాజు, మేడిపెల్లి ఎస్సై శ్రీనివాస్ రాత్రి పసునూర్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. బాధిత చిన్నారి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చిన్నారిని వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**నిందితుడి అరెస్టు**

నిందితుడు గంగారాంను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రాజశేఖరరాజు తెలిపారు. కోరుట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిందితునిపై ఐపీసీ 376(2)(1), 342 సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

## ఏపీ, తెలంగాణ అధికారుల భేటీ

**షెడ్యూల్–9 సంస్థల విభజనపై చర్చలు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విభజన వివాదాల పరిష్కారం దిశగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉన్నతాధికారులు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయం బీఆర్‌కేఆర్ భవన్‌లో సమావేశమై మరో దఫా చర్చలు జరిపారు. ఏపీ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి (ఎక్స్‌అఫీషియో) ఎల్.ప్రేమ్‌చంద్రారెడ్డి, తెలంగాణ ఆర్థిక శాఖ సీనియర్ కన్సల్టెంట్, రిటైర్డ్ ఐఏఎస్ ఎన్.శివశంకర్‌ల నేతృత్వంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమై చర్చలు జరిపారు. రాష్ట్ర విభజన చట్టంలోని షెడ్యూల్–9లో 89 ప్రభుత్వ రంగ సంస్థలుండగా, ఇప్పటికే 53 సంస్థల విభజన విషయంలో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. మిగిలిన వాటిలో 4 సంస్థల విభజనపై ఈ సమావేశంలో చర్చించారు. స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోయినా, చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని అధికారవర్గాలు పేర్కొన్నా యి. వచ్చే సోమవారం మళ్లీ సమావేశమై చర్చలు కొనసాగించాలని నిర్ణయించారు.

## ఇండస్ట్రియల్ ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ప్రవేశాలు

**సాక్షి, హైదరాబాద్:** ఇండస్ట్రియల్ ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నట్లు హైదరాబాద్ 'అపెరల్ ట్రైనింగ్ అండ్ డిజైన్ సెంటర్' ప్రాంతీయ డైరెక్టర్ రవి కిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. 18–35 ఏళ్ల వయసు గల తెలంగాణ గ్రామీణ ప్రాంత అభ్యర్థులు అర్హులని, వార్షిక ఆదాయం రూ.1,25,000కు మించకూడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఇంటర్, టెన్త్ సర్టిఫికెట్లు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలని, వివరాలకు మాదాపూర్‌లోని అపెరల్ ట్రైనింగ్, డిజైన్ సెంటర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. ఇండస్ట్రియల్ ఇంజనీర్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ఏ తయారీ పరిశ్రమకైనా ఎంతో కీలకం. ప్రత్యేకించి రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమకు మరీ ముఖ్యమైంది. రెడీమేడ్ వస్త్రాల తయారీ పరిశ్రమలో వేలాది మంది ఉపాధిని పొందుతున్నారు. భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయంతో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజనలో భాగంగా తెలంగాణలో 2019 మార్చి నుంచి పలు జిల్లాలకు చెందిన వందలాది బాల బాలికలకు శిక్షణను అందించామని రవికిశోర్ తెలిపారు.

## మధ్యాహ్న భోజనంపై జిల్లాల్లో గ్రీవెన్స్ సెల్

**సాక్షి, హైదరాబాద్:** మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లాల్లో గ్రీవెన్స్ సెల్స్‌ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమణకుమార్ డీఈవోలను ఆదేశించారు. అన్ని జిల్లాల డీఈవో కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కార విభాగాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, వంట ఏజెన్సీలు ఎవరైనా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసేందుకు డీఈవోల మెయిల్ ఐడీలను సంబంధిత జిల్లాల్లోని అన్ని పాఠశాలల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని సూచించారు. పాఠశాల విద్య కమిషనర్‌కు ఈ–మెయిల్ ద్వారా (mdmts yahoo. com) ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. ఎంఈవోలు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఫిర్యాదులను, బెస్ట్ ప్రాక్టీసెస్ ఉంటే పంపించాలని పేర్కొన్నారు.

## 15 నుంచి ఎఫ్‌బీవో పోస్టులకు ఫిజికల్ టెస్టులు

**సాక్షి, హైదరాబాద్:** ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో) పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 15 నుంచి 18 వరకు అన్ని జిల్లాల్లో ఫిజికల్ టెస్టులు, ఈవెంట్లు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. వీటికి సంబంధించిన రోజువారీ షెడ్యూల్‌ను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కమిషన్ చెప్పింది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వ్యాయామ పరీక్షలు జరపనున్నట్లు పేర్కొంది. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 5.15 వరకు ఈవెంట్లు నిర్వహించే ప్రదేశంలో ఉండాలని వివరించింది. అభ్యర్థులు హాల్ టికెట్, ఐడీ ప్రూఫ్, కాటన్ దుస్తులు, షూ, క్యాప్ తమ వెంట తెచ్చుకోవాలని సూచించింది. ఎస్టీ అభ్యర్థుల ఎత్తు పురుషులకు 158 సెం.మీ., మహిళలకు 145 సెం.మీ. ఉండాలని, అలాగే వారు సంబంధిత అధికారితో గుర్తించిన కుల ధ్రువీకరణ పత్రాన్ని వెంట తెచ్చుకోవాలని తెలిపింది. వివరాలకు www.tspsc.gov.in ను సందర్శించొచ్చు.

## సమాచార కమిషనర్ల నియామకానికి కమిటీ ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సమాచార కమిషనర్లను ఎంపిక చేసి సిఫారసు చేసేందుకు సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎంపిక కమిటీ ఏర్పాటైంది. శాసన సభలో అతి పెద్ద విపక్ష పార్టీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## డీజీలుగా నలుగురు ఐపీఎస్‌లకు పదోన్నతి

**సాక్షి, హైదరాబాద్:** నలుగురు రాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారులకు అదనపు డైరెక్టర్ జనరల్ నుంచి డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి లభించింది. 1987 బ్యాచ్ అధికారులైన వీకే సింగ్, ఎం.గోపీకృష్ణ, సంతోష్ మెహ్రాతోపాటు 1988 బ్యాచ్ అధికారి జె.పూర్ణచంద్రరావు డీజీలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు సీఎస్ సోమేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## హెల్త్ అసిస్టెంట్‌ల జాబితా విడుదల

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. వీటి భర్తీకి సంబంధించి ఎంపికైన వారికి గత నెల 25 నుంచి 27 వరకు రెలిక్విష్‌మెంట్‌కు అవకాశం ఇచ్చినట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. 50 ఖాళీలకు గాను 31 పోస్టులను భర్తీ చేశామని తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు లేని కారణంగా 18 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. వివరాలకు www.tspsc.gov.in సందర్శించాలని సూచించింది.

## 'విద్యా సంస్థలకు సూచనలు జారీ చేయండి'

**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ కోసం రాష్ట్రంలోని విద్యా సంస్థలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా సూచనలు జారీ చేయాలని డీఈవోలకు సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ఎస్‌పీడీ పీవీ శ్రీహరి ఆదేశాలు జారీ చేశారు. 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యువల్‌తో కలుపుకొని మొత్తంగా 11,229 సంస్థలు దరఖాస్తు చేశాయని ఆయన తెలిపారు. 6,192 సంస్థలు రిజిస్ట్రేషన్ ఫారాలను సబ్మిట్ చేయాల్సి ఉందని, మరో 2,435 సంస్థలు ఫైనల్ సబ్మిషన్ చేయలేదని పేర్కొన్నారు.

# శాంపిల్ల సేకరణలో అవగాహనలేమి!

- ఏ మోతాదులో సేకరించాలో తెలియని వైనం
- సరైన పరిమాణంలో తీసుకోని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు
- అయినా పరీక్షలు నిర్వహించిన గాంధీ ఆస్పత్రి సిబ్బంది
- ఇద్దరు చైనీయులకు కరోనా సోకిందంటూ తప్పుడు సమాచారం
- మొదటిసారి స్పష్టంగా కనిపించని లక్షణాలు..
- రెండోసారి పరీక్షల్లో నెగెటివ్ వచ్చిన వైనం
- కేంద్రానికి చెప్పకుండానే పాజిటివ్ అంటూ అధికారుల లీకులు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. చైనాలో వందలాది మంది కరోనా బారినపడి మృత్యువాత పడుతున్నారు. దీంతో కరోనా పేరు వింటేనే జనం హడలిపోతున్నారు. అలాంటి భయంకరమైన వైరస్ నిర్ధారణలో ఏ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ అందుకు విరుద్ధంగా హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల గాంధీలో ఏర్పాటు చేసిన కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన నమూనాలను సరైన పరిమాణంలో సేకరించకపోవడంతో పెద్ద చిక్కు వచ్చి పడింది. ఇద్దరు చైనీయుల నుంచి నమూనాలు తీసుకున్నా.. సరైన పరిమాణంలో తీసుకోకపోవడంతో పాజిటివ్ లక్షణాలు కనిపించాయన్న ప్రచారం జరిగింది. దీంతో రెండోసారి పరీక్షలు చేసి కరోనా పాజిటివ్ లేదంటూ తాజాగా ప్రకటించారు. దీంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.

### నమూనాల సేకరణపై నిర్లక్ష్యమేల?

గాంధీ ఆసుపత్రిలో ఇటీవలే కరోనా నిర్ధారణ పరీక్షలు ప్రారంభించారు. అందుకోసం కేంద్రం కరోనా కిట్లను పంపింది. అంతకు ముందు నమూనాలను పుణేకు పంపి నిర్ధారణ చేసిన సంగతి తెలిసిందే. గాంధీ ఆసుపత్రిలో మొదటి ట్రయల్ రన్‌లో, తర్వాత చేసిన నిర్ధారణ పరీక్షల్లో అంతా సవ్యంగానే జరిగింది. అయితే రెండ్రోజుల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసే ఇద్దరు చైనీయులు ఫీవర్ ఆసుపత్రికి



వచ్చారు. వారి నుంచి నమూనాలను సేకరించి గాంధీ ఆసుపత్రికి పంపించారు. కరోనా పరీక్షకు పెద్దలకు గొంతు నుంచి, పిల్లలకు ముక్కు నుంచి నమూనాలను సేకరిస్తారు. దూది ద్వారా గొంతు లోపలి నుంచి ఈ నమూనాలు తీస్తారు. ఇదే కరోనా నిర్ధారణ పరీక్షకు అత్యంత కీలకమైనది. రక్త నమూనాలను కూడా తీస్తారు. ఎందుకంటే ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అనేదాని కోసం సేకరిస్తారు. అయితే ఇద్దరు చైనీయుల గొంతులోంచి తీసిన నమూనాలను పూర్తి పరిమాణంలో తీయలేదు. వాటినే గాంధీ ఆసుపత్రికి పంపారు. అక్కడ కూడా సరైన పరిమాణంలో నమూనాలు లేవని వెనక్కి పంపకుండా.. ఉన్న వాటితోనే పరీక్షలు చేశారు. వాటి ఫలితాలు పాజిటివ్‌గా వచ్చాయని కొందరు ప్రచారం చేశారు. కొందరేమో ఎలాంటి ఫలితాలు రాలేదని, అస్పష్టంగా రిపోర్టు వచ్చిందని చెబుతున్నారు. ఇలా అధికారులు తలోమాట చెప్పడం, కొందరు వైద్యాధికారులు బయటకు వివరాలు వెల్లడించడంతో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. రిపోర్టు వివరాలు అస్పష్టంగా ఉన్నాయని, రెండోసారి సక్రమంగా నమూనాలను సేకరించారు. వాటి ఫలితాల్లో నెగెటివ్ రావడం గమనార్హం. ఇది టెక్నీషియన్ల వైఫల్యమా? వైద్యాధికారుల వైఫల్యమా? అనేదానిపై ఇప్పుడు అంతర్గతంగా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. నమూనాల సేకరణపై వారికి శిక్షణ ఇచ్చారా లేదా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. పైగా కరోనాపై పాజిటివ్ వస్తే కేంద్రమే అధికారికంగా ప్రకటించాలి. కానీ చైనీయులకు పాజిటివ్ వచ్చిందంటూ కొందరు కీలకమైన వైద్యాధికారులే ప్రచారం మొదలుపెట్టడంలో ఉద్దేశమేంటో అంతుబట్టట్లేదు.

### ఓపీకి 'కరోనా' ఫీవర్..

కరోనా దెబ్బకు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు గాంధీ, నల్లకుంట ఫీవర్ సహా ఎర్రగడ్డ ఛాతీ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చైనా, సమీప దేశాల నుంచి హైదరాబాద్ వచ్చి దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలతో బాధపడుతున్న వారిని కరోనా నిర్ధారణ పరీక్షల కోసం గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు పంపుతున్నారు. కరోనా అనుమానితులను గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకే తీసుకొస్తుండటంతో ఎక్కడ తమకు వైరస్ సోకుతుందోనని ఇతర రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇన్‌పేషంట్లుగా చేరిన రోగులు కూడా భయంతో డిశ్చార్జయి ఇతర ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు.

### కరోనా పని మాకు అప్పగించకండి

కరోనా అనుమానిత కేసులను గాంధీ, ఫీవర్, ఛాతీ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందుకోసం వాటన్నింటిలో మొత్తం 100 పడకలను సిద్ధం చేసింది. పైగా కరోనా నిర్ధారణ పరీక్షలను గాంధీలోనే నిర్వహిస్తున్నారు. తెలంగాణ, ఏపీలకు సంబంధించిన పరీక్షలన్నీ ఇక్కడే నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏర్పాట్ల పరిశీలన కోసం ఇటీవల కేంద్ర బృందం హైదరాబాద్‌లో పర్యటించింది. ఆ సందర్భంగా గాంధీ ఆసుపత్రికి చెందిన కొందరు అధికారులు కరోనాకు సంబంధించి బాధ్యత తమకు వద్దని, తాము చేయలేమని చేతులెత్తేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మరీ దారుణమైన విషయం ఏంటంటే కరోనా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో కనీస వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో బాధితులు అక్కడ ఉండలేమంటూ వెళ్లిపోతున్నారు.




## ఎయిర్‌పోర్టులో కరోనా స్క్రీనింగ్ పరీక్షలు

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ఎయిర్‌పోర్టు వైద్యాధికారుల బృందం కొద్దిరోజులుగా సింగపూర్, మలేసియా, థాయిలాండ్, హాంగ్‌కాంగ్ నుంచి వస్తున్న ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎయిర్‌లైన్స్‌లు కూడా ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులను ఎక్కడి నుంచి తమ ప్రయాణం ప్రారంభించారో సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటున్నాయి. రోజూ 800 మందికి పైగా ప్రయాణికులకు స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. చైనా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నేరుగా విమానాల రాకపోకల్లేవు. హాంగ్‌కాంగ్ నుంచి రోజూ ఒకటి, సింగపూర్ నుంచి 5, కౌలాలం పూర్ నుంచి 4, బ్యాంకాక్ నుంచి ఒక విమానం ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాయి.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రం

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు

- ఇంటర్ పరీక్షల్లో సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబరు
- విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడండి
- జిల్లా కలెక్టర్లకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** వచ్చే నెల 4 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి తెలిపారు. పరీక్షలు రోజూ ఉదయం 8:45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా వెంటనే పరిష్కరించేందుకు వీలుగా ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, దానికి నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా 040–24601010, 040–24732369, 040–24655027 నెంబర్లలో సంప్రదించాలని, నోడల్ అధికారి పరిష్కరిస్తారన్నారు. పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు జిల్లా కలెక్టర్లు తగిన శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలన్నింటిలోనూ కనీస సౌకర్యాలు కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. సమయానికి విద్యార్థులు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

### 20లోగా నివేదిక ఇవ్వండి

జిల్లాల్లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై చెక్ లిస్టు ప్రకారం ఈనెల 20లోగా నివేదికలు అందజేయాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ కోరారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలకు సరైన భద్రత కల్పించే విషయంలో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎస్పీలు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఇటీవల నియమించిన స్టూడెంట్ కౌన్సెలర్ల సహాయం తీసుకోవాలన్నారు. 9,65,840 మంది విద్యార్థులు హాజరయ్యే ఈ పరీక్షల కోసం 1,339 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో 50 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 24,750 మంది ఇన్విజిలేటరుల పాల్గొంటారని తెలిపారు.

## సబిత మేడమ్.. మీరైనా పట్టించుకోండి





**హైదరాబాద్:** బడికి వెళ్లేటప్పుడు బస్సుంటుంది సరే ..కానీ, తిరిగొచ్చేటప్పుడే భయం..ఎందుకంటే దారిలో చిరుత ఉంటుంది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో కడ్తాల్ మండలంలోని పల్లెచల్కతండాకు చెందిన 50 మంది చదువుకుంటున్నారు. వీరంతా ఉదయంపూట బడికి బస్సులో వచ్చేస్తారు. కానీ ఇటీవల ఇబ్రహీంపట్నం నుంచి నక్కర్తమేడిపల్లి మీదుగా సరికొండ గ్రామానికి వెళ్లే బస్సును ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో వీరి కష్టాలు మరీ ఎక్కువైపోయాయి. అసలే కాలినడక..ఆపై చిరుత భయం..దీంతో కొంతమంది తండా విద్యార్థులు ఏకంగా బడే మానేశారు. చిరుత ఎప్పుడు తమపై దాడిచేస్తుందోనన్న భయంతో బ్యాట్లు, కర్రలు వెంటబెట్టుకుని అరుపులు, కేకలు వేస్తూ, మధ్యమధ్యలో ఇలా మంటలు వేసుకుంటూ బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు ఇంటికెళ్తున్నారు. విద్యార్థులేకాదు, ఆ ప్రాంత రైతులది కూడా ఆ అటవీ ప్రాంతంగుండా తిరిగి ఇంటికివెళ్లాలంటే ఇదే పరిస్థితి. రాత్రి 8 గంటల వరకు కూడా తమ పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా తమ గోడును విన్పించుకుని బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని వేడుకుంటున్నారు.

# మేము ఎవరికీ భారం కాకూడదు!

- ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు స్నేహితురాళ్లు
- ఒకే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న యువతులు





మృతి చెందిన గౌతమి, మమత (ఫైల్)

**హైదరాబాద్:** 'మాకు పెళ్లిళ్లు చేయడం వల్ల మీరు అప్పుల పాలు కాకూడదు. మా కారణంగా మీరు గొడవలు పడొద్దు. చావడం తప్పే.. మా చావు కారణంగా ఎన్నో పుకార్లు పుట్టుకొస్తాయి. మేము ఎలాంటి తప్పు చేయలేదు. అయినా చావాలనుకుని చస్తున్నాం' అంటూ సూసైడ్ నోటు రాసి ఇద్దరు స్నేహితురాళ్లు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. కర్నూలు జిల్లా వెలుగోడు మండలం మాదవరం గ్రామానికి చెందిన బాషం నారాయణ, నారాయణమ్మ దంపతులు.. కుమార్తె గౌతమి(20)తో కలసి హయత్‌నగర్ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోత్నపల్లికి చెందిన రాములు, తిరుపతమ్మ దంపతులు.. కుమార్తె మమత(20)తో కలసి రాఘవేంద్ర కాలనీలో ఉంటున్నారు. ఇరు కుటుంబాలు గతంలో శ్రీనివాసకాలనీలో పక్కపక్కనే నివాసముండటం వల్ల గౌతమి, మమతల మధ్య స్నేహం ఏర్పడింది. ఇద్దరూ ఇంటర్మీడియెట్ వరకు చదివారు. మమత ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండగా, గౌతమి ఉద్యోగ అన్వేషణలో ఉంది. ఇటీవల ఇద్దరికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. శుక్రవారం మమత తల్లిదండ్రులు పెళ్లికి వెళ్లగా, తమ్ముడు పాఠశాలకు వెళ్లాడు. గౌతమి మమత ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరూ ఒకే గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నారు. సాయంత్రం నాలుగున్నర సమయంలో మమత తమ్ముడు ఇంటికి వచ్చి చూడగా ఇద్దరూ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**ఎవరికీ భారం కాకూడదని....**

నా పెళ్లితో తమ్ముడి చదువు ఆగిపోకూడదంటూ మమత... నాన్నా నా చావుతో అయినా నీవు ప్రశాంతంగా ఉండు. అమ్మను బాధ పెట్టకు అని గౌతమి.. ఇరువురు వేర్వేరుగా సూసైడ్ నోట్ రాశారు. 'మమ్మల్ని క్షమించండి. మా చావుకు ఎవరూ కారణం కాదు. మేము ఎవరికీ భారం కాకూడదు. మా పెళ్లిళ్ల కోసం అప్పులు చేయడం వల్ల మీరు అప్పులపాలు కావద్దు. మా ఆత్మహత్యకు అనేక పుకార్లు పుట్టుకొస్తాయి. మేము ఎలాంటి తప్పు చేయలేదు. మా చావుతో ఇరు కుటుంబాల వారు ఎలాంటి గొడవలకు దిగరాదు'అంటూ ఇద్దరు కలసి మరో సూసైడ్ నోటు రాశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# యువతిపై లైంగిక దాడి

**వీడియో తీసిన ఓ ప్రబుద్ధుడి భార్య, మేనల్లుడు • రూ.50 లక్షల దాకా వసూలు**

**హైదరాబాద్:** భార్య ముందే భర్త ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడి భార్య, మేనల్లుడు దాన్ని వీడియో తీశారు. ఆ వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తూ ఏకంగా అర కోటి వరకు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని బాచుపల్లి పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కోకాపేటకు చెందిన యువతి అమెరికాలో ఉంటోంది. కర్ణాటక బీదర్ ప్రాంతానికి చెందిన సంజీవరెడ్డి.. ఆమెకు 2018 జులైలో ఫేస్‌బుక్ ద్వారా పరిచ యం అయ్యాడు. అదే సంవత్సరం అక్టోబర్ 31న అమెరికా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన యువతిని సంజీవరెడ్డి రిసీవ్ చేసుకుని, యువతి చెల్లెలు ఇంటికి పంపించాడు. ఆ తర్వాత 2 రోజులకు సంజీవరెడ్డి ఫోన్ చేసి కూకట్‌పల్లిలోని ఓ హోటల్‌కు రావాలని కోరాడు. దీంతో అక్కడికి వచ్చిన యువతికి భార్య కావేరి, మేనల్లుడు విశాల్ రెడ్డిని పరిచయం చేశాడు. ఆ తర్వాత కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇవ్వగా తాగి అపస్మారక స్థితికి చేరిన యువతిని నిజాంపేటలోని వారి నివాసానికి తీసుకెళ్లి, సంజీవరెడ్డి లైంగిక దాడి చేస్తుండగా, భార్య, మేనల్లుడు వీడియోలు తీశారు. అప్పటి నుంచి ఆ వీడియోలు చూపిస్తూ దండుకుంటూ వస్తున్నారు. 30 తులాల బంగారం, రూ.6 వేల యూఎస్ డాలర్లను లాక్కున్నారని ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. ఇలా రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితురాలు గురువారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు బీదర్‌లో ఉన్న సంజీవరెడ్డి, అతడి భార్య కావేరి, మేనల్లుడు విశాల్‌రెడ్డిని పట్టుకుని హైదరాబాద్ తీసుకొచ్చి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

## నాస్కామ్‌తో కళాశాల విద్యా శాఖ ఒప్పందం

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నైపుణ్య కేంద్రాల ద్వారా విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను అందిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పరిశ్రమలు, ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో ఉద్యోగాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను సిద్ధం చేసే ఉద్దేశంతో కళాశాల విద్యాశాఖ టీఎస్‌కేసీ ద్వారా నాస్కామ్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలల నుంచి గుర్తించిన అధ్యాపకులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ఆయా నైపుణ్యాలను విద్యార్థులకు అందజేయటం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ సమక్షంలో సంయుక్త డైరెక్టర్ మంజులత, నాస్కామ్ ప్రతినిధి సంధ్య ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్‌ను విద్యార్థులకు చేరువ చేస్తామన్నారు. విద్యాశాఖ నైపుణ్య విద్యను అందించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పి.బాలభాస్కర్, పృధుకళ తదితరులు పాల్గొన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com